www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 16-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 361 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: తదియ మ.1:18 తదుపరి చవితి, నక్షత్రం: అనూరాధ తె. 5:55 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: ఉ.7:37-9:24, దుర్ముహూర్తం: ఉ.11:50-12:39. అమృతఘడియలు: సా.6:19-8:06, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:02, సూర్యాస్తమయం: 6:28 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

'నైరుతి'లో వర్షాలే వర్షాలు!

ఈసారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం.. దీర్ఘకాలిక సగటులో 105 శాతం నమోదు

ఉత్తర, దక్షిణ, పశ్చిమ, మధ్య భారతంలో ఎక్కువగా.. ఏపీలోనూ సమృద్ధిగా వానలు పడే అవకాశం

జమ్మూకశ్మీర్, బిహార్, తమిళనాడు, ఈశాన్యంలో మాత్రం సాధారణం కంటే తక్కువ 12

రైతులకు తీపి కబురు చెప్పిన భారత వాతావరణ శాఖ

4 రోజులు ఈదురుగాలులతో వర్షాలు



అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైన టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్, మంత్రి లోకేశ్ (ఫైల్)

వెల్కమ్ టీసీఎస్

టీసీఎస్‌కు రుషికొండలో 21.6 ఎకరాలు

- ఎకరాకు 99 పైసల లీజు మాత్రమే
- 1370 కోట్లతో ఆపరేషన్స్ సెంటర్
- 12 వేల మందికి ఉద్యోగావకాశాలు
- పలుమార్లు టాటా సన్స్ చైర్మన్‌తో చంద్రబాబు, లోకేశ్ చర్చలు
- సొంత క్యాంపస్ ఏర్పాటుకు స్థలం కోరిన టీసీఎస్
- మరిన్ని పెద్ద కంపెనీలను ఆకర్షించే అవకాశం

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం రెడ్‌కార్పెట్ పరిచింది. టీసీఎస్ ఆపరేషన్స్ సెంటర్ ఏర్పాటు కోసం విశాఖపట్నంలో 21.6 ఎకరాల భూమిని కేటాయించింది. అది కూడా... ఎకరాకు కేవలం 99 పైసల అత్యంత నామమాత్రపు లీజు నిర్ణయించింది. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్ర మంత్రివర్గం మంగళవారం ఆమోద ముద్ర వేసింది. దీని ప్రకారం... ఐటీలో మేటి కంపెనీగా ఉన్న టీసీఎస్‌కు రుషికొండలో 21.6 ఎకరాలను కేటాయిస్తారు. దీనిని తొలుత ఉచితంగానే ఇవ్వాలని భావించినప్పటికీ... 'ఎంతో కొంత' మొత్తం లీజుగా ఉండాలన్న నిబంధన మేరకు, 99 పైసల నామమాత్రపు లీజు నిర్ణయించారు. ఒకరకంగా చెప్పాలంటే, ఇది పూర్తి ఉచితంగా ఇచ్చినట్లే.

మిగతా 13వ పేజీలో...

'ఉక్కు'కు ఊపిరి! 3

- రుణాల సర్దుబాటుకు ఎస్‌బీఐ ఓకే
- వడ్డీ 14 నుంచి 9 శాతానికి తగ్గింపు
- కేంద్ర ప్యాకేజీతో మారిన పరిస్థితి
- 2 బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా పూర్తిస్థాయి ఉత్పత్తి.. జూన్‌లో మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభం!

ఇక వర్గీకరణ

ఆర్డినెన్స్‌కు మంత్రిమండలి ఓకే

- నాడు బాబు హయాంలోనే ఎస్సీ వర్గీకరణ
- తిరిగి ఆయన నేతృత్వంలోనే ఆర్డినెన్స్
- ఆ ఎజెండాలో తొలి అంశంగా చేర్చి ఆమోదం
- మూడు కేటగిరీలుగా ఎస్సీలను వర్గీకరించిన మిశ్రా కమిషన్
- రెల్లి, మాదిగ, మాల ఉపకులాలు గ్రూప్-1, 2, 3గా విభజన
- వరుసగా 1, 6.5, 7.5% రిజర్వేషన్
- వచ్చే అసెంబ్లీ భేటీలో చట్టబద్ధత



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు చిక్కులు తొలగిపోయాయి. ప్రభుత్వం ఇప్పటికే అన్ని కసరత్తులు పూర్తిచేసి విద్యా, ఉద్యోగ రంగాల్లో వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం వేసిన రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను గతనెల 17న కేబినెట్ ఆమోదించింది. మంగళవారం కేబినెట్‌లో మొదటి అజెండాగా చేర్చి వర్గీకరణపై ఆర్డినెన్స్‌ను ఆమోదించారు. ఇక గవర్నర్ ఆమోదంతో ఎస్సీ వర్గీకరణ రాష్ట్రంలో అమల్లోకి రానుంది. నిజానికి, ఈ ప్రక్రియకు గతంలో తన హయాంలోనే చంద్రబాబు నాంది పలకడం విశేషం. ఎస్సీల్లో

మిగతా 13వ పేజీలో...

గనుల ఆదాయానికి రెక్కలు

- మైనర్ మినరల్-2022 పాలసీలో కీలక సవరణలు
- మళ్లీ ఓటీఎస్ విధానం అమలు
- రాష్ట్రమంతా ఒకే తరహా సీనరేజీ

4.23 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

- 4.62 లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేబినెట్ ఓకే
- 26న జాలర్లకు 20 వేల సాయం
- అమరావతి నిర్మాణాలు ఇక వేగవంతం
- వెలగపూడిలో రూ.106.39 కోట్లతో పనులకు అనుమతి

2న అమరావతికి మోదీ

- రాజధాని పనుల పునరుద్ధరణకు శ్రీకారం
- వెలగపూడిలో భారీ బహిరంగ సభ
- పనులన్నీ మూడేళ్లలో పూర్తిచేసి తీరాలి
- వైసీపీది కుటిల రాజకీయం.. కుల మతాలు, ప్రాంతాల నడుమ చిచ్చుకు కుట్ర
- వక్ఫ్ బిల్లుపై ఆ పార్టీది సెల్ఫ్‌గోల్ 13
- మన సంస్కరణలకు మైలేజీ రావడం లేదు
- పీ4లో మంత్రులూ భాగస్వాములు కావాలి
- కేబినెట్‌లో ముఖ్యమంత్రి పిలుపు



విండ్‌షీల్డ్ నిజంగా దెబ్బతిందా? 14

కలెక్టరేట్‌కు, ఎస్పీకి చెప్పకుండా హెలికాప్టర్‌ను ఎలా తీసుకెళ్లారు?.. నేడు వచ్చి వివరణ ఇవ్వండి

జగన్ పర్యటించిన చాపర్ పైలట్లకు పోలీసుల నోటీసు

'గుండెపోటు' కథనంలో ఉదయ్ పాత్ర!

వివేకా గాయాలు కనపడకుండా దాచిపెట్టడలోనూ: సీబీఐ

ఉదయ్‌కుమార్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు 14

బెయిల్ రద్దు పిటిషన్లపై 29న విచారణ?

ఆంధ్రా టు ఆంధ్రా వయా తెలంగాణ! 11



విశాఖ నుంచి విజయవాడ వెళ్లాలంటే రెండు విమానాలు మారాల్సి వస్తోంది

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవేదన

ప్రణాళిక ప్రకారమే పరార్!

కొందరు పోలీసుల సహకారంతోనే కసిరెడ్డి అజ్ఞాతంలోకి

- రాజ్ తండ్రిని ప్రశ్నించిన సిట్ అధికారులు
- విచారణకు సహకరించని ఉపేందర్ రెడ్డి
- అన్ని ప్రశ్నలకూ 'తెలియదు' అనే సమాధానం
- బెజవాడ సిట్ ఆఫీసుకు రావాలంటూ నోటీసు
- హైదరాబాద్‌లో రెండోరోజూ సిట్ సోదాలు
- రాజ్ మరదలి కంపెనీ లావాదేవీల పత్రాలు సీజ్
- స్నేహితుడి ఫామ్‌హౌస్‌లో రాజ్ కారు స్వాధీనం




అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారి, పాత్రధారిగా భావిస్తున్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రణాళిక ప్రకారమే పరారైనట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నిర్ధారణకు వచ్చింది. జగన్ ప్రభుత్వంలో కీలక స్థానాల్లో పనిచేసిన కొందరు పోలీసు అధికారుల సహకారంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. మూడుసార్లు నోటీసులు ఇచ్చినా, హైకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేసి విచారణకు డుమ్మా కొట్టిన రాజ్ కసిరెడ్డి ఆచూకీ కోసం సిట్ అధికారులు రెండు రోజులుగా హైదరాబాద్‌లో మకాం వేసి సోదాలు చేపడుతున్నారు. రెండోరోజు తనిఖీల్లో భాగంగా మంగళవారం రాజ్ కసిరెడ్డి భార్యకు సోదరి అయ్యే మేఘనా రెడ్డి, ఆమె తల్లి సుజాత రెడ్డి డైరెక్టర్లుగా ఉన్న ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తనిఖీలు చేశారు. ఈ కంపెనీ ద్వారా ఎక్కువగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు సేకరించిన సిట్..

మిగతా 14వ పేజీలో...

మద్యం స్కామ్‌లో సాయిరెడ్డికి పిలుపు

- 18న విచారణకు రావాలంటూ సిట్ నోటీసు
- అయితే, 17న రాగలనన్న సాయిరెడ్డి.. సిట్ ఓకే
- స్కాంలో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డేనని గతంలో సాయిరెడ్డి వ్యాఖ్య



అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మరో అడుగు ముందుకేసింది. మద్య నిషేధం హామీ ఇచ్చి దేశంలో ఎక్కడా లేని ధరలతో మందుబాబులను దోచుకుని, నాసిరకం మద్యం సరఫరాతో వారిని తీవ్ర అనారోగ్యానికి గురి చేసిన

మిగతా 14వ పేజీలో...





నేషనల్ హెరాల్డ్ కేసు..

A1 సోనియా.. A2 రాహుల్


- చార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. సామ్ పిట్రోడా, సుమన్ దూబేపైనా అభియోగాలు
- విచారణార్హతపై 25న కోర్టు నిర్ణయం
- ఈడీ విచారణకు హాజరైన రాబర్ట్ వాద్రా
- ఇది చట్టబద్ధ పాలన ముసుగులో ప్రభుత్వ దాడి
- విపక్షంపై రాజకీయ ప్రతీకారం: కేసీ వేణుగోపాల్
- నేడు దేశవ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ పిలుపు

సిద్దరామయ్యకు బిగిసిన ఉచ్చు

- ముడా కేసు దర్యాప్తును కొనసాగించండి
- మే 7లోగా నివేదికివ్వండి
- లోకాయుక్తకు ప్రజా ప్రతినిధుల కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: నేషనల్ హెరాల్డ్ కేసు మరోమారు జాతీయ స్థాయిలో రాజకీయంగా ఓ కుదుపు కుదిపింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు మంగళవారం ఈ కేసులో రౌస్‌అవెన్యూ ప్రత్యేక కోర్టులో చార్జిషీటు(ప్రాసిక్యూషన్ కంప్లైంట్) దాఖలు చేశారు. ఆ అభియోగపత్రాల్లో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీని ఏ1గా, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఏ2గా పేర్కొంది. దీనిపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. కేంద్రంలోని బీజేపీ సర్కారు దర్యాప్తు సంస్థలను రాజకీయ

మిగతా 2వ పేజీలో...



శ్రీశైలం డ్యాం భద్రతకు

కేంద్రం ఓకే

- ప్లంజ్‌పూల్ మరమ్మతుపై కార్యాచరణ
- 28న విజయవాడకు ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్
- ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్‌తో భేటీ
- మర్నాడు జలాశయం, భారీగొయ్యి పరిశీలన


అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం భద్రతకు సంబంధించి ఉభయ రాష్ట్రాల ఆందోళనలపై కేంద్రం స్పందించింది. ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యిని పూడ్చడంపై కార్యాచరణ సిద్ధం చేయనుంది. ఇందుకోసం జాతీయ జలాశయాల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ అనిల్ జైన్ ఈ నెలాఖరులో విజయవాడ రానున్నారు. 2009 సెప్టెంబరులో పెను వరదల కారణంగా శ్రీశైలం జలాశయం ప్లంజ్‌పూల్ వద్ద భారీ గొయ్యి ఏర్పడింది. దీనికి యుద్ధప్రాతిపదికన

మిగతా 3వ పేజీలో...

తమిళనాడుకు


స్వయం ప్రతిపత్తి

- గవర్నర్‌తో విభేదాల నేపథ్యంలో రాష్ట్ర హక్కుల పరిరక్షణకు స్టాలిన్ ప్రభుత్వం కీలక నిర్ణయం
- జస్టిస్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ
- కేంద్రంతో సత్సంబంధాలకూ సూచనలు
- వచ్చే జనవరి కల్లా మధ్యంతర నివేదిక
- రెండేళ్లలో సమగ్రమైన నివేదిక రూపకల్పన



చెన్నై, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గవర్నర్ ఆర్‌ఎన్ రవితో విభేదాలు తీవ్రమైన నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర స్వయం ప్రతిపత్తి విషయంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. రాష్ట్ర న్యాయమైన హక్కుల పరిరక్షణతోపాటు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలను పెంపొందించేలా కమిటీ సిఫారసులు చేస్తుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన శాసనసభలో 110వ నిబంధన కింద ఒక ప్రకటన చేశారు. కమిటీలో ఇండియన్ మారిటైమ్ వర్సిటీ మాజీ

మిగతా 13వ పేజీలో...



ట్రంప్‌కు చైనా షాక్!

- అమెరికా నుంచి బోయింగ్ జెట్లు బంద్
- వాటిని తీసుకోవద్దని తమ ఎయిర్‌లైన్స్‌కు ఆదేశం
- విమానాల విడిభాగాల దిగుమతీ నిలిపివేత

బీజింగ్, ఏప్రిల్ 15: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇప్పటివరకు అమెరికా వస్తువులపై సుంకాలు భారీగా పెంచిన చైనా.. తాజాగా ఆ దేశం నుంచి బోయింగ్ జెట్ విమానాల దిగుమతినే నిలిపివేసింది. వాటి డెలివరీ తీసుకోవద్దని తన విమానయాన సంస్థ 'చైనా ఎయిర్‌లైన్స్'ను ఆదేశించినట్లు

మిగతా 2వ పేజీలో...

హార్వర్డ్ నిధులకు ట్రంప్ ఎసరు

- 220 కోట్ల డాలర్లు స్తంభింపజేసిన సర్కారు
- ప్రభుత్వానికి తలొగ్గబోమన్న వర్సిటీ అధ్యక్షుడు



మంత్రి లోకేశ్‌తో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు

టాపర్లు.. బ్రాండ్ అంబాసిడర్లు!

మంచి ఫలితాలు రావనే ముద్రను చెరిపేశారు 14

- ప్రభుత్వ పరువును కాపాడారు
- పీజీకి ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తాం
- ఐటీ ఒక్కటే కాదు.. అన్ని రంగాల్లోనూ అవకాశాలు
- జూన్ నాటికి విద్యా సంస్కరణలు పూర్తి
- ప్రభుత్వ ఇంటర్ టాపర్లతో మంత్రి లోకేశ్

స్పెషల్ ఎడ్యుకేషన్‌కు 2,260 పోస్టులు

- ఈ ఏడాది నుంచే ఆటిజం కేంద్రాలు
- ఎస్జీటీ 1,136, స్కూల్ అసిస్టెంట్ 1,124.. మిగులు టీచర్ల సర్దుబాటుతో పోస్టుల సృష్టి

ఆక్వా సమస్యలపై దూకుడు

ఏపీ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఏర్పాటు.. కౌంట్‌ల వారీగా ధరల నిర్ణయం 12

ధరల స్థిరీకరణకు కమిటీ ఏర్పాటు.. రఘురామ అధ్యక్షతన ఆక్వా పక్షాల భేటీ

తమ్ముడి దొంగతనానికి అక్క బలి!

- సోదరి ఇంటికి వచ్చి బావ సెల్‌ఫోన్, నగదు చోరీ
- భర్త ఆగ్రహం.. ఇద్దరు పిల్లలతో సహా భార్య ఆత్మహత్య

బెంగళూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అక్క ఇంటికి వచ్చిన తమ్ముడు.. బావ దాచుకున్న నగదు, సెల్‌ఫోన్ తీసుకుని ఉడాయించాడు. ఆగ్రహించిన బావ.. బావమరిదికి ఫోన్ చేసి మందలించాడు. భార్యపై సైతం ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె.. ఇద్దరు పిల్లలతో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన కర్ణాటక రాష్ట్రం చామరాజనగర జిల్లా హనూరు తాలూకా కాడుగోళ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు, కాడుగోళ గ్రామంలో ఉంటున్న సుశీల ఇంటికి తమ్ముడు మాదేవ వెళ్లాడు. కాసేపటి తరువాత తన బావ మహేశ్‌కు చెందిన మొబైల్ ఫోన్, నగదు తీసుకుని వెళ్లిపోయాడు. ఈ విషయమై మహేశ్ తన బావమరిదికి ఫోన్ చేసి 'ఇంటికొచ్చి ఇలాంటి పనులు చేస్తారా..? కష్టపడి సొమ్ము దాచుకున్నాం. వెంటనే వచ్చి తిరిగి ఇచ్చెయ్' అని తీవ్రస్థాయిలో మందలించాడు. ఈ క్రమంలో బావబావమరుదుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత మహేశ్, తన భార్య సుశీలతోనూ గొడవపడ్డాడు. 'మీ తమ్ముడు ఇలాంటి పనులు చేస్తాడా..?' అని దూషించాడు. ఈ అవమానాన్ని జీర్ణించుకోలేని సుశీల, ఆదివారం రాత్రి ఇంటి నుంచి పిల్లలతో కలిసి వెళ్లిపోయింది. పుట్టింటికి వెళ్లి ఉంటుందని మహేశ్ భావించాడు. కానీ సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని ఓ బావి వద్ద సుశీల చెప్పులు, తాళిబొట్టు, ఇతర వస్తువులను గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహదేశ్వర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బావిలో గాలించి సుశీల(30), పిల్లలు దివ్య (11), చంద్రు(8) మృతదేహాలను వెలికి తీశారు.

హజ్ పోర్టల్‌ను తెరిచేందుకు సౌదీ అంగీకారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: కేంద్ర ప్రభుత్వ జోక్యంతో సౌదీ హజ్ మంత్రిత్వ శాఖ హజ్ (నుసుక్) పోర్టల్‌ను తిరిగి తెరిచేందుకు అంగీకరించింది. దాంతో 10 వేల మంది భారతీయ యాత్రికులకు అవకాశం లభించనుందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెల్లడించింది. మీనాలో ఏర్పాటు చేయాల్సిన క్యాంప్‌లు, బస, రవాణాకు సంబంధించి ఇవ్వాల్సిన యాత్రికుల డేటాకు సంబంధించిన ప్రక్రియలను సౌదీ ప్రభుత్వం నిర్ణయించిన గడువులోపల హజ్ గ్రూప్ ఆర్గనైజర్లు పూర్తి చేయలేకపోయారు. దాంతో దాదాపు 10వేల మంది యాత్రికుల పరిస్థితి సందిగ్ధంలో పడింది. ఈ నేపథ్యంలో భారత ప్రభు త్వం కలగజేసుకుని మరో అవకాశం ఇవ్వాలని కోరడంతో హజ్ పోర్టల్‌ను తిరిగి తెరిచేందుకు సౌదీ ప్రభుత్వం అంగీకరించింది.

'వక్ఫ్' పిటిషన్లపై సుప్రీం విచారణ నేడే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేసిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం (ఏప్రిల్ 16న) విచారణ చేపట్టనుంది. కొత్త చట్టంలోని పలు సెక్షన్లు రాజ్యాంగానికి విరుద్ధమని, జాతీయ సమగ్రతకు భంగం కలిగించేలా ఉన్నాయని పేర్కొంటూ మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ పిటిషన్ సహా ఇప్పటికే పది పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. వీటిపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం విచారణ ప్రారంభించనుంది. మరోవైపు కొత్త వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. ఆ చట్టంలోని కొన్ని సెక్షన్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సీనియర్ న్యాయవాది విష్ణు శంకర్ జైన్ వేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం మంగళవారం వెల్లడించింది. దీనిపై విచారణ చేపట్టే తేదీని త్వరలో ఖరారు చేస్తామని తెలిపింది.

లా కమిషన్ చీఫ్‌గా జస్టిస్ దినేష్ మహేశ్వరి

- ప్రధాని మోదీ ఆమోదం


న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మహేశ్వరి 23వ లా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఈ విషయాన్ని న్యాయ శాఖ మంగళవారం ఎక్స్ ద్వారా తెలిపింది. ఆయన నియామకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆమోదించారని పేర్కొంది. పూర్తికాల సభ్యులుగా న్యాయవాది హితేష్ జైన్, ప్రొఫెసర్ డి.పి.వర్మ నియమితులయ్యారు. ప్రొఫెసర్ వర్మ గత లా కమిషన్‌లోనూ సభ్యుడిగా పనిచేశారు. వారు బాధ్యతలు స్వీకరించారని న్యాయ శాఖ తెలిపింది. ఈ ముగ్గురి పేర్లను న్యాయ వ్యవహారాల విభాగం ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

కంప్యూటర్ చిప్స్, ఫార్మా దిగుమతుల ప్రభావంపై

అమెరికా అధ్యయనం..

ఆయా ఉత్పత్తులకు ఒకే దేశంపై ఆధారపడడం తమ జాతీయ భద్రతకు ముప్పనే అభిప్రాయం

- దేశీయంగా తయారీపై పరిశీలన
- ప్రజాభిప్రాయాలకు 3వారాల గడువు
- త్వరలోనే ఫార్మాపై సుంకాలు: ట్రంప్
- దేశీ తయారీని ప్రోత్సహించడానికేనని వెల్లడి



బ్యాంకాక్, ఏప్రిల్ 15: కంప్యూటర్ చిప్స్, చిప్ మేకింగ్ పరికరాలు, ఫార్మాస్యూటికల్స్ (ఔషధాల)పై సుంకాల విధింపునకు సంబంధించి ట్రంప్ సర్కారు తదుపరి చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. అందులో భాగంగా.. కార్లు, రిఫ్రిజిరేటర్లు, స్మార్ట్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో వాడే కంప్యూటర్ చిప్‌లు, వాటిని తయారుచేసే పరికరాలను దిగుమతి చేసుకోవడం దేశ భద్రతపై చూపే ప్రభావాన్ని తెలుసుకునేందుకు పరిశోధన ప్రారంభించినట్టు అమెరికా కామర్స్ విభాగం ప్రకటించింది. దీనిపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలపడానికి మూడువారాల గడువు ఇచ్చింది. నిజానికి ఈ ఇన్వెస్టిగేషన్‌ను ట్రంప్ యంత్రాంగం ఏప్రిల్ 1నే ప్రారంభించినట్టు సమాచారం. అందులో వెల్లడైన సమాచారం ఆధారంగానే.. చైనా సహా అన్ని దేశాల నుంచి అమెరికాకు దిగుమతి చేసుకుంటున్న స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలపై 10శాతం మూల సుంకాన్ని కూడా మినహాయిస్తున్నట్టు కిందటివారం ప్రకటించింది. ఈ పరిశోధనలో భాగంగా.. అమెరికా డిమాండ్‌కు తగ్గట్టు కంప్యూటర్ చిప్‌లు, వాటి తయారీ పరికరాలను తమ దేశంలోనే ఉత్పత్తి చేయడానికి గల అవకాశాలను ట్రంప్ సర్కారు పరిశీలించనుంది. వాటిపై పలు దేశాలు తమ ఉత్పత్తిదారులకు ఇస్తున్న రాయితీల కారణంగా అమెరికన్ కంపెనీలపై పడే ప్రభావాన్ని కూడా పరిశీలిస్తోంది. కాగా.. ఔషధాలపై సుంకాలు త్వరలోనే వేస్తామని ట్రంప్ సోమవారం పునరుద్ఘాటించారు. తమ దేశంలోనే ఔషధాల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. అమెరికాలో తయారయ్యే ఔషధాలకు అవసరమయ్యే ముడిపదార్థాల్లో (యాక్టివ్ పార్మా ఇన్‌గ్రీడియెంట్స్) 70 శాతానికి పైగా చైనా, ఇండియా, యూరప్ దేశాల నుంచి దిగుమతి అయ్యేవే. ఇక.. సెమీకండక్టర్ల విషయానికి వస్తే అమెరికా ఎక్కువగా తైవాన్, దక్షిణ కొరియాపై ఆధారపడుతోంది. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, వాటి తయారీకి అవసరమయ్యే కాంపోనెంట్లకు సంబంధించి అమెరికా ఎక్కువగా చైనాపై ఆధారపడుతోంది. నిరుడు చైనా నుంచి.. అమెరికా దిగుమతి చేసుకున్న ఈ ఉత్పత్తుల విలువ ఏకంగా 174 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.14 లక్షల కోట్ల) దాకా ఉంది. ఏప్రిల్ 2న విధించిన ప్రతీకార సుంకాల కన్నా ముందు.. ఫెంటనిల్ అక్రమరవాణాను నిరోధించడంలో విఫలమైందంటూ చైనాపై ట్రంప్ విధించిన 20% సుంకం కొనసాగుతుందని చెప్పింది ఈ ఉత్పత్తులపైనే. ఈ ఉత్పత్తుల కోసం ఒకే దేశంపై లేదా కొన్ని దేశాలపై ఎక్కువగా ఆధారపడడం అమెరికా భద్రతకే ముప్పు అని ట్రంప్ ప్రభుత్వం అభిప్రాయపడుతోంది.

హార్వర్డ్ నిధులకు ట్రంప్ ఎసరు

220 కోట్ల డాలర్లు స్తంభింపజేసిన సర్కారు

న్యూయార్క్, ఏప్రిల్ 15: అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ వర్సిటీకి 220 కోట్ల డాలర్ల ఫెడరల్ నిధులను ట్రంప్ ప్రభుత్వం స్తంభింపజేసింది. క్యాంపస్‌లో యూదు వ్యతిరేక నిరసనలను కట్టడి చేయడంలో భాగంగా వైట్‌హౌస్ నిర్దేశించిన పలు నిబంధనలను అమలు చేయడానికి తిరస్కరించడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వర్సిటీ పరిపాలనా విధానాలతో పాటు ప్రవేశాలు, నియామకాల ప్రక్రియల్లో మార్పులు చేయాలని, విదేశీ విద్యార్థుల స్క్రీనింగ్ విషయంలో ఇమిగ్రేషన్ అధికారులతో సహకరించాలని ఈనెల 3న హార్వర్డ్ వర్గాలకు ఆదేశాలు అందాయి. అయితే తమ స్వతంత్రత, రాజ్యాంగ హక్కులపై వర్సిటీ ఎలాంటి చర్చలు జరపబోదని, ప్రభుత్వ విధానాలకు లొంగబోమని వర్సిటీ విద్యార్థులు, సిబ్బందికి రాసిన బహిరంగ లేఖలో హార్వర్డ్ అధ్యక్షుడు అలన్ గార్బెర్ స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం హార్వర్డ్ వర్సిటీకి 2.2 బిలియన్ డాలర్ల గ్రాంట్లతో పాటు ఫెడరల్ కాంట్రాక్టుల కింద మరో 60 మిలియన్ డాలర్లు స్తంభింపజేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. అంతేకాదు, హార్వర్డ్‌ను రాజకీయ సంస్థ గా ప్రకటిస్తామని, పన్ను మినహాయింపును రద్దు చేస్తామనీ ట్రంప్ హెచ్చరించారు. కాగా, ట్రంప్ డిమాండ్లను తిరస్కరించడం ద్వారా హార్వర్డ్ వర్సిటీ మిగిలిన ఉన్నత విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలిచిందని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పేర్కొన్నారు. మిగిలిన సంస్థలూ ఇదే బాటలో పయనిస్తాయని 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఆయన ఆకాంక్షించారు.

ట్రంప్‌కు చైనా షాక్!

(మొదటి పేజీ తరువాయి)

'బ్లూమ్‌బెర్గ్ న్యూస్' మంగళవారం వెల్లడించింది. అలాగే అమెరికన్ కంపెనీల నుంచి విమానాల విడిభాగాలు, పరికరాల కొనుగోలును కూడా ఆపేయాలని నిర్దేశించింది. అమెరికా నుంచి దిగుమతులపై చైనా టారిఫ్‌లు పెంచడంతో అక్కడి నుంచి విమానాలు, విడిభాగాలు తీసుకురావడానికి వ్యయం తడిసిమోపెడవుతోంది. దీంతో బోయింగ్ విమానాలను లీజుకు తీసుకునే చైనా విమానయాన సంస్థలకు ఆర్థికంగా ఊతమివ్వాలని చైనా యోచిస్తోంది. గత జనవరిలో ట్రంప్ రెండో సారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మిత్రులు, ప్రత్యర్థులు అనే తేడా లేకుండా.. ప్రతి దేశం తమకు చేసే ఎగుమతులపై ఎడాపెడా సుంకాలు విధిస్తున్నారు. చైనా దిగుమతులపై ఏకంగా 145 శాతం వరకు సుంకాలు ప్రకటించారు. దీనికి ప్రతీకారంగా అమెరికా నుంచి దిగుమతులపై 125 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చైనా వెల్లడించింది. అంతటితో ఆగకుండా ఇప్పుడు ఏకంగా బోయింగ్ విమానాలనే ఆపేసింది. బోయింగ్ అమెరికాకు చెందిన అతిపెద్ద విమానతయారీ సంస్థ అయిన సంగతి తెలిసిందే. బోయింగ్ విమానాల్లో 30 శాతం వరకూ చైనాయే కొంటోంది. చైనా నిర్ణయంతో మంగళవారం బోయింగ్ కంపెనీ షేర్లు పతనమయ్యాయి.

లోకం తీరు



సిద్దరామయ్యకు బిగిసిన ఉచ్చు

ముడా కేసు దర్యాప్తును కొనసాగించండి

ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశం

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు ప్రజాప్రతినిధుల కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో ఉచ్చు బిగిసింది. మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు కేసు దర్యాప్తును కొనసాగించాలని లోకాయుక్తను ప్రజాప్రతినిధుల కేసుల కోర్టు ఆదేశించింది. ఈ కేసులో సిద్దరామయ్య, ఆయన కుటుంబసభ్యుల తప్పిదం లేదని లోకాయుక్త ప్రాథమిక చార్జ్‌షీట్(బి-రిపోర్ట్)లో పేర్కొంది. దీన్ని వ్యతిరేకించిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించారు. లోకాయుక్త దర్యాప్తు సరిగా లేదని అభ్యంతరం తెలిపారు. దీనిపై విచారణ జరిపిన ప్రజాప్రతినిధుల కోర్టు న్యాయాధికారి సంతోష్ గజానన్ భట్ ముడా కేసులో విచారణ కొనసాగించాలని మంగళవారం లోకాయుక్తను ఆదేశించారు.

పోలీసుల అదుపులో కియ దొంగలు

హిందూపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమలో కారు ఇంజిన్లు మాయమైన కేసులో సిట్ పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో ఎనిమిదిమందిని అదుపులోకి తీసుకుని పెనుకొండకు తరలించారు. కేసు దర్యాప్తులో భాగంగా తమిళనాడుకు వెళ్లిన సిట్ అధికారులు చెన్నై సమీప ప్రాంతంలో వీరు కారు ఇంజన్లను విక్రయించినట్లు గుర్తించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న మొత్తం ఎనిమిది మందిని మంగళవారం రాత్రి పెనుకొండకు తీసుకువచ్చారు.

ఏ1 సోనియా, ఏ2 రాహుల్

(మొదటి పేజీ తరువాయి)



ప్రతీకారాలకు వాడుకుంటోందని మండిపడ్డాయి. బుధవారం దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చాయి. సోనియా, రాహుల్‌పై ఏదైనా కేసులో చార్జిషీట్ దాఖలవ్వడం ఇదే మొదటిసారి. ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను స్వీకరించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి విశాల్‌గోగ్నే.. ఈనెల 25న అభియోగపత్రాలపై విచారణ చేపడతామని వ్యాఖ్యానించారు. ఈ చార్జిషీట్ విచారణార్హమా? కాదా? అన్నదానిపైనా ఈనెల 25న నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఇదే కేసుకు సంబంధించి ఈడీ శుక్రవారం అసోసియేట్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్)కు చెందిన రూ.700 కోట్లకు పైగా ఆస్తులను అటాచ్ చేయనున్నట్లు నోటీసులు జారీ చేసిన నాలుగు రోజుల్లోనే.. చార్జిషీట్ దాఖలు కావడం గమనార్హం.! నేషనల్ హెరాల్డ్‌ను యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తుండగా.. ఇందులో చెరో 38% చొప్పున షేర్లతో సోనియా, రాహుల్ మెజారిటీ వాటాదారులుగా ఉన్నారు. నేషనల్ హెరాల్డ్‌కు ఢిల్లీలోని బహదూర్‌షా జాఫర్ మార్గ్‌లోని ఐకానిక్ హెరాల్డ్ హౌస్‌తోపాటు.. ముంబై, లఖ్‌నవూల్లో ఆస్తులున్నాయి. నిజానికి భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కాలంలో ఏజేఎల్‌ను స్థాపించి, నేషనల్ హెరాల్డ్‌ను ప్రారంభించారు. యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సోనియా, రాహుల్ గాంధీలకు చెందినది. అయితే.. నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన ఆస్తులను సోనియా, రాహుల్ గాంధీ రూ.50 లక్షలకు యంగ్ ఇండియా కంపెనీకి బదిలీ చేశారు. ఆ ఆస్తుల వాస్తవ విలువ రూ.2 వేల కోట్లుగా ఉంటుంది. బీజేపీ మాజీ ఎంపీ సుబ్రమణ్యన్ స్వామి దీనిపై 2012లో పటియాలా హౌస్ కోర్టులో ఫిర్యాదు చేశారు. తొలుత ఐపీసీలోని సెక్షన్ల కింద కేసు నమోదైంది. 2021లో మనీల్యాండరింగ్ కోణంలో ఈడీ రంగంలోకి దిగింది. ఈడీ కంప్లైంట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్)ను నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించింది. 2022లో రాహుల్‌గాంధీ, సోనియాలకు సమన్లు జారీచేసి, విచారణను కొనసాగించింది. మంగళవారం కోర్టులో దాఖలు చేసిన అభియోగపత్రాల్లో సోనియాగాంధీని ఏ1గా, రాహుల్‌గాంధీని ఏ2గా పేర్కొంది. కాంగ్రెస్ నేత సామ్ పిట్రోడా, జర్నలిస్టు సుమన్ దూబే, యంగ్ ఇండియా కంపెనీని నిందితుల జాబితాలో చేర్చింది.

విచారణకు హాజరైన వాద్రా

హరియాణాలో జరిగిన భూఒప్పందంపై మనీల్యాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఈడీ నుంచి సమన్లు రావడంతో.. రాబర్ట్‌వాద్రా మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఈడీ ఆయనను దాదాపు 6 గంటల పాటు విచారించి, తిరిగి బుధవారం రావాలని ఆదేశించింది. ఈ సందర్భంగా వాద్రా మద్దతుదారులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈడీ విచారణకు ముందు వాద్రా మీడియాతో మాట్లాడుతూ.. 2008 భూలావాదేవీకి సంబంధించి ఎలాంటి అక్రమాలు లేవన్నారు.

నేడు దేశవ్యాప్త ఆందోళనలు

కేంద్రంలోని బీజేపీ.. దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రతీకారానికి దిగుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు సీనియర్ నేత జైరాంరమేశ్ సహా.. పలువురు మంగళవారం ఎక్స్‌లో స్పందించగా.. బుధవారం దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనను విడుదల చేశారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జిషీట్‌ను దాఖలు చేయడాన్ని భారత జాతీయ కాంగ్రెస్(ఐఎన్‌సీ) ముక్తకంఠంతో ఖండిస్తోందని కేసీ వేణుగోపాల్ అన్నారు. నేషనల్ హెరాల్డ్‌కు చెందిన ఆస్తులను ఏకపక్షంగా, అన్యాయంగా సీజ్ చేయడాన్ని ఖండించారు. "ఇది(తాము లేవనెత్తుతున్న అంశం) న్యాయ విధానానికి సంబంధించిన అంశం కాదు. ఈ చర్య చట్టబద్ధ పాలన(రూల్ ఆఫ్ లా)ను ముసుగుగా ధరించి, చేస్తున్న ప్రభుత్వ-ప్రాయోజిత నేరం. సోనియా, రాహుల్, ఇతర అగ్రనేతలపై చార్జిషీట్ దాఖలు చేయడం అనేది ప్రభుత్వం తన అధికారాలను దుర్వినియోగం చేయడమే" అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ చర్య.. ప్రజాస్వామ్యబద్ధమైన విపక్ష పార్టీపై దాడి అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఈ చర్యలను చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యను నిరసిస్తూ బుధవారం దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని ఆయన అన్ని పీసీసీలను ఆదేశించారు. అన్ని రాష్ట్రాల్లోని ఈడీ ఆఫీసులు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

వైసీపీ హయాంలో 'గో' నిర్లక్ష్య శాలలు!

ఆవుల పేరిట అక్రమాలు

- దాణా, గడ్డి లీజులతో శ్రీవారి సొమ్ముకు ఎసరు
- ఇష్టారీతి కాంట్రాక్టులు.. హరినాథ్ ఆగమాగం
- గడ్డి సరఫరా చేయకున్నా రూ.కోట్లు చెల్లింపు
- విజిలెన్సు నివేదికల్లో బట్టబయలు

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో టీటీడీ గోశాలల నిర్వహణ మేడిపండును తలపించింది. గోశాలల బయట బోర్డు, ఆర్చి అంతా అందంగా, చూసేందుకు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ, లోపలకు వెళ్లి చూస్తే అపరిశుభ్రత, పాచిపోయిన తొట్టెల్లో నీరు, పురుగులు పట్టిన దాణా, జబ్బులబారిన పడ్డ గోవులు.. ఇలా మూగజీవుల పట్ల అప్పట్లో నిర్లక్ష్యం తాండవమాడింది. ఒక్క నిర్లక్ష్యమే కాదు.. గోశాలలను అడ్డుపెట్టి.. కావాల్సినంత దోచుకున్నారు!. దాణా లీజు, గడ్డి పెంపకం పేరిట శ్రీవారి సొమ్ములు బొక్కేశారు. టీటీడీ గోశాలల్లో నాటి అక్రమాలు, అవినీతి, నిర్లక్ష్య ధోరణికి సంబంధించి విజిలెన్స్ నివేదికల్లో విషయాలు వెలుగు చూశాయి.

సేవ లేకుండానే సొమ్ములు

పలమనేరులోని ఎస్వీ గోశాల నిర్వహణపై విమర్శలు వచ్చిన క్రమంలో 2021, జూలైలో అప్పటి విజిలెన్స్ అధికారులు.. పశువైద్యుడు పల్లా లక్ష్మీనారాయణ బృందంతో కలిసి సందర్శించారు. అక్కడ 20 మంది కాంట్రాక్టు కార్మికులు ఉండాల్సి ఉండగా దీనిలో సగం కన్నా తక్కువ మంది పనిచేస్తున్నట్టు గుర్తించారు. టీటీడీ గోశాల నిర్వహణకు టెండర్లు పిలవగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కీర్తి డెయిరీ దక్కించుకుంది. ప్రతి పశువుకు నెలకు రూ.1,435 చెల్లించాలని ఒప్పందం కుదిరింది. అయితే, కాంట్రాక్టరు తక్కువ మంది కార్మికులతో ఎక్కువ లాభాలు పొందుతున్నట్టు తేలింది. పైగా షెడ్లను పరిశుభ్రంగా ఉంచకపోవడం వంటి అంశాలు నాటి తనిఖీల్లో కనిపించాయి. ఇక, పాల ఉత్పత్తులకు సంబంధించిన రికార్డులు లేకపోవడం వెలుగు చూసింది. టీటీడీకి చెందిన భూమి, కరెంట్, నీటిని వినియోగించుకుంటూనే ఆ సంస్థ గడ్డి పెంచింది. ప్రతి టన్నుకు టీటీడీ రూ.2,482 చెల్లించేది. అయితే, తిరుపతిలోని గోశాలకు అదే గడ్డిని మరో కాంట్రాక్టర్ ఇంకా తక్కువకు విక్రయిస్తున్నట్టు తేలింది. ఇలా మొత్తం ఏడాదికి రూ.1.16 కోట్లు ఆ కాంట్రాక్టరు తన జేబులో వేసుకుంటున్నట్టు నివేదికలో తేలింది. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా టీటీడీకి తీవ్రనష్టం వాటిల్లిందని ఆ నివేదిక ద్వారా తెలుస్తోంది. తిరుపతి జిల్లా కమలయ్యగారి పల్లెలో ఆవులు లేనప్పటికీ అక్కడి గోశాలకు దాణా సరఫరా చేసేందుకు టెండర్లు పిలిచారు. టన్నుకు రూ.2,455 చెల్లించారు. ఈ ధరను నిర్ణయించేటప్పుడు తిరుపతి గోశాలకు గతంలో చెల్లించిన టెండరు ధరను కాకుండా పలమనేరులోని గత ధరను ఆధారంగా తీసుకోవడం గమనార్హం. నిజానికి తిరుపతి, కమలయ్యగారిపల్లె గోశాలలకు గడ్డి సరఫరా చేసినందుకు రూ.1.78 కోట్లు చెల్లించారు. ఇక్కడ దారుణం ఏమంటే.. ఆవుల్లేని కమలయ్యగారిపల్లె గోశాలకు గడ్డే సరఫరా చేయలేదు. దీని వల్ల టీటీడీకి రూ.కోట్ల నష్టం వాటిల్లింది. వ్యర్థాలను ఎరువుగా మార్చేందుకు 'క్యూబ్ బయో ఎనర్జీ' అనే సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. ఈ సంస్థకు నీరు, షెడ్లు, మిషన్లు, పేడ, మూత్రం, విద్యుత్ ఉచితంగా ఇచ్చారు. టన్నుకు రూ.7,500 చొప్పున టీటీడీ చెల్లించింది. దీనివెనుక పెద్ద కుంభకోణం జరిగిందని తేల్చారు. గతంలో గోశాల డైరెక్టర్ గా పనిచేసిన హరినాథ్‌రెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు రావడంతో విజిలెన్స్ విచారణ చేపట్టింది. బయట నుంచి పచ్చగడ్డిని కొనుగోలు చేస్తూ టీటీడీపై ఆర్థిక భారాన్ని మోపినట్టు తేలింది. విరాళాలు సేకరించి అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించారు.

సరైన సంరక్షణ లేక..

'గుడికో గోమాత' పేరుతో ఆలయాలకు గోవులను విరాళంగా ఇచ్చిన గత పాలకులు.. వాటి సంరక్షణ గురించి పట్టించుకోకపోవడంతో పలు ప్రదేశాల్లో ఆవులు, లేగదూడలు మృతి చెందినట్టు రికార్డుల్లో స్పష్టంగా ఉంది. ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో 8 ఏళ్ల వయసున్న ఆవు ఎక్కువగా అన్నం తినడం వల్ల అసిడ్ ఇండైజెషన్‌తో 2023లో మృతి చెందింది. 2022, నవంబరులో నిమ్మకూరులో రెండు ఆవులు మృతి చెందాయి. 2022, డిసెంబరులో నగరిలోనూ మరో దూడ లంపీ స్కిన్ డిసీజ్‌తో మృతి చెందినట్టు తేలింది. తెలుగురాష్ట్రాల్లోని ఆలయాలకు ఆవులను ఇచ్చి కనీసం వాటి సంరక్షణ బాధ్యతలను పట్టించుకోకపోవడంతో ఈ మరణాలు సంభవించినట్టు స్పష్టమైంది. గడువు ముగిసిన ఔషధాలను కూడా వినియోగించినట్టు 2021 నివేదిక ద్వారా తెలిసింది. 2023, ఏప్రిల్‌లో చేసిన విచారణలో ఆవులకు పాచి పట్టిన తొట్టెల్లో నీరు, పురుగులుపట్టిన దాణాపెట్టినట్టు స్పష్టంగా పేర్కొన్నారు.

భూమనపై పోలీసులకు బీజేపీ ఫిర్యాదు

తిరుపతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): టీటీడీతో పాటు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా గోవుల మరణాలపై అసత్య ప్రచారం చేస్తున్న భూమన కరుణాకరరెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, బీజేపీ నేతలు.. ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్వీ గోశాలను గోవధశాలగా మార్చారంటూ తప్పుడు ప్రచారాలు చేసిన కరుణాకరరెడ్డిపై ఐటీ చట్టం సెక్షన్ 74, బీఎన్ఎస్ సెక్షన్ 365 కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



ఒంటిమిట్ట కోదండ రామాలయంలో
సీతారామలక్ష్మణులకు పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్టలో వైభవంగా

పుష్పయాగం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం కోదండరామునికి పుష్పయాగం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం ధ్వజావరోహణతో ముగిశాయి. మంగళవారం రాత్రి సీతాలక్ష్మణ సమేత కోదండరాముడికి పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి సుమారు 2.5 టన్నుల పుష్పాలు భక్తులు విరాళంగా అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో గాని, నిత్యకైంకర్యాల్లో తెలియక ఏమైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. కంకణభట్టార్ రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు.

శ్రీశైలంలో శాస్త్రోక్తంగా

కుంభోత్సవం



భ్రమరాంబికాదేవి ఆలయం ముందు రాశిగా పోసిన అన్నం

శ్రీశైలం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబికాదేవి కుంభోత్సవాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏటా చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత అమ్మవారికి కుంభోత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ప్రాతఃకాల పూజల అనంతరం ...హరిహరరాయ గోపురం వద్ద గల మహిషాసురమర్దిని అమ్మవారికి పూజాదికాలు జరిపి ఆ తర్వాత గుమ్మడికాయలు, కొబ్బరికాయలతో పాటు నిమ్మకాయలతో సాత్వికబలిని సమర్పించారు. పసుపు, కుంకుమను సమర్పించి అమ్మవారికి శాంతి ప్రక్రియ క్రతువును పూర్తిచేశారు. సాయంత్రం ప్రదోషకాల పూజల అనంతరం మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం చేసి ఆలయాన్ని మూసివేశారు. అదేవిధంగా అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న సింహ మంటపం వద్ద అన్నాన్ని కుంభరాశిగా పోశారు. ఆ తర్వాత సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతిని సమర్పించారు. ఆ తర్వాత రెండో విడతగా అమ్మవారికి గుమ్మడికాయలు, కొబ్బరికాయలతో సాత్వికబలిని ఇచ్చారు. చివరగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి పిండివంటలతో మహానివేదన ఇచ్చారు. సాయంత్రం భ్రమరాంబికాదేవి నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

8న తలసేమియా రన్

- ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహణ
- హాజరుకానున్న సీఎం సతీమణి భువనేశ్వరి



విశాఖపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే 8వ తేదీన విశాఖ నగరంలో తలసేమియా రన్-2025 నిర్వహించనున్నారు. తలసేమియా, ఇతర జన్యుపరమైన వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ రన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పాల్గొననున్నారు. మే ఎనిమిదో తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఆర్కే బీచ్ రోడ్డులో ఈ రన్ నిర్వహించనున్నారు. 10కే, 5కే, 3కే విభాగాల్లో నిర్వహిస్తున్న రన్‌లో అన్ని వయసుల వారు పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు 9652974235, 9100433499 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చు. www.thalassemiarun.comలో పేరు నమోదు చేసుకోవచ్చు.

ఏపీ హజ్ కమిటీ చైర్మన్‌గా షేక్ హసన్ భాషా



అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్‌గా షేక్ హసన్ భాషాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరుకు చెందిన హసన్ భాషా సుదీర్ఘకాలంగా టీడీపీలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో రిసెప్షన్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో హసన్ భాషా ఏపీ హజ్ కమిటీ డైరెక్టర్‌గా పనిచేశారు.

'మన చంద్రన్న' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం



అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు టీడీ జనార్దన్ రూపొందించిన మన చంద్రన్న- అభివృద్ధి, సంక్షేమ విజనరీ పుస్తకాన్ని సీఎం చంద్రబాబు సచివాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. మొత్తం 700 అంశాలతో తయారు చేసిన ఈ పాకెట్ సైజు పుస్తకంలో.. చంద్రబాబు బాల్యం, విద్యాభ్యాసం, విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా పోషించిన పాత్ర, రాజకీయ అరంగేట్రం వంటి అంశాలు, చిత్రాలు ఉన్నాయి.

ప్రపంచ ఆహార పథకంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

- ముందుగా కడప జిల్లాలో అమలుకు నిర్ణయం

రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతులకు వాతావరణ అనుకూలత కల్పించే ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం చేసేందుకు ఐక్యరాజ్య సమితి సౌజన్యంతో ప్రపంచ ఆహార పథకంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక ఒప్పందం చేసుకుంది. మంగళవారం అమరావతి సచివాలయంలో వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ప్రపంచ ఆహార పథకం డైరెక్టర్ ఎలిజబెత్ ఫెయిరీ ఒప్పంద లేఖ(లెటర్ ఆఫ్ అండర్‌స్టాండ్)పై సంతకాలు చేశారు. శ్రీలంక, భారత్‌లో ప్రాంతీయ వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా వాతావరణ, వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నాయి. ఈ ప్రణాళికను ముందుగా కడప జిల్లాలో ఏపీ రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలు చేయనున్నారు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయించారు.

16 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో 16 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెయిటింగ్‌లో ఉన్నవారికి పోస్టింగ్స్ ఇచ్చింది. తిరుపతిలో టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా సువర్ణమ్మ, నెల్లూరు మెప్మా పీడీగా లీలారాణి, విశాఖ టూరిజం అధికారిగా జల్లెపల్లి మాధవిని నియమించింది.

అటవీ అభివృద్ధి సలహాదారుగా మల్లికార్జునరావు

రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్యకలాపాల ప్రభుత్వ సలహాదారుగా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి పి. మల్లికార్జునరావును ప్రభుత్వం నియమించింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్లికార్జునరావు గతంలో అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి, అటవీ ముఖ్య దళాధికారిగా పని చేశారు. ఆయన రెండేళ్ల ఈ పదవిలో ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అంగన్వాడీ మినీ సెంటర్లను

అప్‌గ్రేడ్ చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ మినీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తూ మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లు, హెల్పర్లకు మే నెలలో వేసవి సెలవులు ఇవ్వాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారిని కోరినట్లు రాష్ట్ర అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బేబీరాణి, సుబ్బరావమ్మలు ఒక ప్రకటనలో కోరారు. మినీ వర్కర్లకు ఖాళీ పోస్టుల్లో పదోన్నతులు ఇవ్వాలని కోరారు.

చంద్రబాబు పీ-4 బూటకం: రామకృష్ణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు చెబుతున్న పీ-4 బూటకం. పేదరికం ఎందుకు వస్తోంది? పేదలు, ధనికుల మధ్య తారతమ్యాలు ఎందుకు ఉన్నాయి? ఇవేమీ చెప్పకుండా.. పీ-4తో, పేదరికానికి లింకు పెట్టడం విడ్డూరంగా ఉంది' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అనంతపురంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కొందరు ధనికుల దగ్గర ఉన్న డబ్బులు తీసుకుని పేదలకిస్తే.. పేదరికం పోతుందని సీఎం చెప్పడం ప్రజల చెవిలో వంద శాతం పూలు పెట్టడమే. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అవలంబిస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగానే దేశంలో, రాష్ట్రంలో పేద, ధనిక తారతమ్యం పెరుగుతోంది. దేశవ్యాప్తంగా అందరూ వ్యతిరేకిస్తున్న వక్ఫ్ సవరణకు బిల్లుకు సైతం టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వడం సరికాదు' అని రామకృష్ణ అన్నారు.

'ఉక్కు'కు ఊపిరి!

- రుణాల రీస్ట్రక్చర్‌కు ఎస్‌బీఐ ఓకే
- వడ్డీ 14 నుంచి 9 శాతానికి తగ్గింపు
- కేంద్ర ఆర్థిక ప్యాకేజీతో మారిన పరిస్థితి
- రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా పూర్తిస్థాయి ఉత్పత్తి
- జూన్‌లో మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభం!



విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారానికి ఊపిరి పోసే ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. రాష్ట్ర ప్రభుత్వ చొరవ, కేంద్ర సహకారంతో కష్టాల నుంచి గట్టెక్కుతోంది. తాజాగా... విశాఖ ఉక్కుకు సంబంధించిన రుణాలను పునర్‌వ్యవస్థీకరించి, వడ్డీ రేట్లు తగ్గించాలన్న ప్రతిపాదనపై లీడ్‌బ్యాంక్‌గా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బోర్డు ఆమోద ముద్ర వేసింది. స్టీల్ ప్లాంటు రుణాలను రీస్ట్రక్చర్ చేసింది. వడ్డీ రేట్లను 14 శాతం నుంచి 9 శాతానికి తగ్గించింది. దీంతో స్టీల్ ప్లాంటుకు వడ్డీల భారం బాగా తగ్గింది. స్టీల్ ప్లాంటు 2024-25 ఆర్థిక సంవత్సరంలో పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయింది. వివిధ ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణభారం రూ.20 వేల కోట్లను దాటేసింది. బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి వచ్చింది. ప్రధాన ముడి పదార్థాలైన ఐరన్‌ఓర్, కోకింగ్ కోల్ అవసరమైనంత అందుబాటులో లేక పూర్తిస్థాయిలో ప్లాంటు నడవలేదు. మూడు బ్లాస్ట్ ఫర్నేసుల్లో ఒకదానిని పూర్తిగా మూసివేయగా, మిగిలిన రెండింటిని అరకొరగా నడుపుతూ రోజుకు ఏడు నుంచి ఎనిమిది వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే చేసేవారు. సంస్థను ఆదుకోవాలని కార్మిక సంఘాలు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును అభ్యర్థించగా, ఆయన ఢిల్లీ వెళ్లి ప్రధానితో, కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారు. అనేక చర్చల అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. రూ.11,440 కోట్లు సాయం చేసింది. అందులో నుంచి రూ.6వేల కోట్లను రుణాలు తీర్చేందుకు కేటాయించడంతో... రుణాల రీస్ట్రక్చర్‌కు అవకాశం కలిగింది.

పూర్తిస్థాయిలో ఉత్పత్తి

విశాఖ ఉక్కు కర్మాగారానికి బ్యాంకులన్నీ అవసరమైనంత వరకు రుణాలు ఇస్తుండటంతో ముడి పదార్థాల కొరత తీరిపోయింది. అక్టోబరు నుంచి రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడం ప్రారంభించాయి. రోజుకు 14 వేల టన్నుల ఉక్కు ఉత్పత్తితో... పూర్తి సామర్థ్యంతో ప్లాంటు పనిచేస్తోంది. మూతపడిన మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా జూన్‌లో ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అవసరమైన ముడి పదార్థాలను అందించాలని ఎన్ఎండీసీని కేంద్రం ఆదేశించింది. అదే విధంగా మార్కెటింగ్ వ్యవహారాల్లో సహాయం చేయాలని సెయిల్‌కు సూచించింది. ఈ రెండు ప్రభుత్వ రంగ సంస్థలు విశాఖ ఉక్కుకు అండగా నిలిచాయి. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేయాలని, 7.3 మిలియటన్ టన్నుల ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఉద్యోగుల సంఖ్య తగ్గింపు

సంస్థ వ్యయాల నియంత్రణకు ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటూ వస్తున్నారు. సుమారు 1,200 మందికి వీఆర్ఎస్ ఇచ్చి మార్చి నెలాఖరున పంపించేశారు. కాంట్రాక్టు కార్మికుల సంఖ్య తగ్గించేలా... కాంట్రాక్ట్‌లను రెన్యువల్ చేయకుండా నిలిపివేస్తున్నారు.

శ్రీవారి ఆలయంపై డ్రోన్

- టీటీడీ విజిలెన్స్ అదుపులో రాజస్థానీ యూట్యూబర్



శ్రీవారి ఆలయంపై ఎగురుతున్న డ్రోన్



యూట్యూబర్ అన్షుమన్ తరెజా

తిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంపై ఓ యూట్యూబర్ డ్రోన్ ఎగురవేయడం కలకలం రేపింది. ఈ ఘటనతో తిరుమలలో మరోసారి భద్రతా వైఫల్యం వెలుగు చూసింది. రాజస్థాన్‌కు చెందిన అన్షుమన్ తరెజా అనే యూట్యూబర్ మంగళవారం సాయంత్రం డ్రోన్ కెమెరాను ఆలయంపై ఎగురవేశాడు. దాదాపు 10 నిమిషాల పాటు డ్రోన్ ఆలయం పరిసర ప్రాంతాల్లోనే తిరగడం గమనార్హం. దీంతో టీటీడీ విజిలెన్స్ అధికారులు అప్రమత్తమై, అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఏయే ప్రాంతాలను చిత్రీకరించారు? డ్రోన్ ఎందుకు ఎగురవేశారని ఆరా తీస్తున్నారు. అన్షుమన్ ఉదయం నుంచి తిరుమలలో పలు ప్రాంతాల్లో డ్రోన్ వినియోగించినట్టు సమాచారం. ఆగమ నిబంధనల ప్రకారమే కాకుండా, భద్రతా కారణాలతోనూ ఆలయంపై డ్రోన్ కెమెరాలు ఎగురవేయడం నిషేధం. సాధారణంగా డ్రోన్ కెమెరాలతో వచ్చే భక్తులను అలిపిరి చెక్ పాయింట్‌లోనే భద్రతా సిబ్బంది అడ్డుకోవాలి. అయితే ఓ యూట్యూబర్ డ్రోన్ కెమెరాతో తిరుమల రావడంతో భద్రతాధికారులపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఇక, 2023 జనవరిలో కూడా సర్వే కోసమని వచ్చిన ఓ సంస్థ శ్రీవారి ఆలయంపై డ్రోన్ ఎగురవేసి ఆ చిత్రాలను సోషల్ మీడియాలో పెట్టడం కూడా తీవ్ర విమర్శలకు దారితీసింది. గతేడాది జనవరిలోనూ అసోంకు చెందిన ఓ జంట ఘాట్‌రోడ్డులో డ్రోన్ ఎగురవేసిన ఘటనలు ఉన్నాయి. మరోవైపు మంగళవారం ఉదయం తిరుమలకు వచ్చిన ఓ టెంపో వాహనంపై ఇతర మతాలకు సంబంధించిన చిహ్నాలు ఉండటం కూడా భక్తుల నుంచి విమర్శలకు దారి తీసింది.

శ్రీశైలం డ్యాం భద్రతకు కేంద్రం ఓకే

(మొదటి పేజీ తరువాయి)

మరమ్మతులు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏను అప్పటి నుంచి కోరుతూనే ఉంది. ఇటీవల సదరు గొయ్యి మరింత పెరిగి భయానకంగా మారింది. 2009 తరహాలో మరోసారి ఎగువ నుంచి భారీగా వరద వస్తే డ్యాం కొట్టుకుపోయే ప్రమాదం ఉందని సాగునీటి నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ కూడా.. ఈ గొయ్యి వల్ల జలాశయానికి ఏదైనా నష్టం వాటిల్లితే.. దాని ప్రభావం నాగార్జున సాగర్‌పై పడుతుందని.. సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బంది తప్పదని కలవరపడుతోంది. ఉభయ రాష్ట్రాల భయాందోళనల నేపథ్యంలో ఈ నెల 28న ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్ బృందం విజయవాడ వస్తోంది. ఆరోజున జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డ్యాం ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమవుతుంది. మర్నాడు 29న శ్రీశైలం జలాశయాన్ని సందర్శిస్తుంది. ప్లంజ్‌పూల్ పరిస్థితిని అంచనా వేస్తుంది. 30న హైదరాబాద్‌లో తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులతో భేటీ తర్వాత ఢిల్లీ వెళ్లిపోతుంది. వాస్తవానికి శ్రీశైలం జలాశయం ముందున్న భారీ గొయ్యిని పూడ్చడం, మరమ్మతులు చేయడానికి సంబంధించిన అధ్యయన బాధ్యతను కేంద్రం సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్)కు అప్పగించింది. ఇందుకోసం రూ.16.70 కోట్లను డ్యామ్ సేఫ్టీ అథారిటీ ద్వారా అందజేసేందుకు కేంద్ర జలశక్తి శాఖ సంసిద్ధత తెలిపింది. ఇప్పటికే రూ.3 కోట్లు చెల్లించింది. తర్వాత ప్లంజ్‌పూల్‌ను పరిశీలించిన సీడబ్ల్యూపీఆర్ఎస్.. మరమ్మతులకు 14 కీలకమైన సూచనలు చేసింది. వీటిని అనిల్ జైన్ బృందం తన పర్యటనలో సమీక్షించి కార్యాచరణ ప్రకటిస్తుందని జల వనరుల శాఖ వర్గాలు వెల్లడించాయి.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

దశాబ్దాల అన్యాయానికి దిద్దుబాటు!

దశాబ్దాలుగా తమకు తీరని అన్యాయం జరుగుతోందని బలంగా వాదిస్తున్న ఒక వర్గాన్ని సంతృప్తిపరచటం చాలా కష్టమైన పని. దాన్ని అధిగమించి లక్ష్యాన్ని సాధించటం అరుదు. తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలును నిస్సందేహంగా దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఎస్సీలకు గంపగుత్తగా అమలవుతున్న రిజర్వేషన్లను వెనుకబాటుతనం ప్రాతిపదికగా వర్గీకరించే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు కిందటి ఏడాది ఆగస్టు 1న ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును అమలుపరచటానికి తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేసింది. వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో ప్రకటన, ఆ తర్వాత మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు, తదనంతరం జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్‌ను నియమించటంలోనూ ఆ వేగం కనపడింది.

షమీమ్ అక్తర్ కమిషన్ విస్తృతంగానే అభిప్రాయసేకరణ జరిపింది. వర్గీకరణకు వ్యతిరేక, అనుకూల వాదనలను పరిగణనలోకి తీసుకుని నివేదికను ఇచ్చింది. ఎస్సీల్లోని సంపన్న శ్రేణికి రిజర్వేషన్లను వర్తింపచేయకూడదన్న కీలక సిఫార్సు మినహా మిగతా వాటిని తెలంగాణ మంత్రివర్గం యథాతథంగా ఆమోదించిందనే భావించొచ్చు. మొత్తంగా ఎస్సీలను మూడు సమూహాలుగా విభజించి రిజర్వేషన్ల శాతాలను (9శాతం, 5శాతం, 1శాతం) కమిషన్ ప్రతిపాదించింది. ఆ శాతాల్లో మార్పులు చేయాలని ఒత్తిడి వచ్చినా ప్రభుత్వం కమిషన్ సిఫార్సులకే కట్టుబడింది. అంబేడ్కర్ జయంతి రోజునే వర్గీకరణ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చి తను అనుకున్న దాన్ని సాధించగలిగింది.

మొత్తంగా చూస్తే దశాబ్దాల నుంచి వర్గీకరణను గట్టిగా కోరుతున్న వర్గం నుంచి గరిష్ఠ సంతృప్తి వ్యక్తమైందనే చెప్పుకోవచ్చు. శాతాల విషయంలో అసంతృప్తులు ఉన్నా అవేమీ ప్రభుత్వంపై ఆగ్రహం పెట్టుకునే స్థాయిలో లేవు. వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన వారిలో అసంతృప్తి, ఆగ్రహం ఉండటం సహజం. సంఖ్యాపరంగా తక్కువ ఉన్న కులాల్లో తమకు మరింత ఎక్కువ శాతం రిజర్వేషన్లు ఉండాలని కోరుకోవటాన్ని కూడా న్యాయబద్ధంగానే భావించొచ్చు. సామాజిక సామరస్యం దృష్ట్యా వీటిని కూడా ప్రభుత్వం పట్టించుకుని పరిష్కారమార్గాలు ఆలోచించాలి. ఒక నిర్ణయంతో జన సమూహాలు శత్రు శిబిరాలుగా మారకుండా చూడాల్సిన బాధ్యతా ప్రభుత్వంపై ఉంటుంది.

కులాల జనసంఖ్య ఆధారంగా రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించకూడదని వర్గీకరణ తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. విద్య, ఉద్యోగాల్లో వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్ల శాతాలను నిర్ణయించాలనీ చెప్పింది. అట్లాకాకుండా రాజకీయ లాభనష్టాలను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ల శాతాలను నిర్ణయిస్తే న్యాయస్థానాల తలుపులు తట్టవచ్చని కూడా ఖచ్చితంగానే ప్రకటించింది. షమీమ్ అక్తర్ కమిషన్ కూడా వీటిని పరిగణనలోకి తీసుకునే సిఫార్సులు చేసిందని కాంగ్రెస్ నేతలు అనేక సందర్భాల్లో చెప్పారు. వివిధ కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి ఖచ్చితమైన సమాచారం లభిస్తే కొన్ని అపోహలు తొలగిపోతాయి. ఎవరు ఎక్కడున్నారో స్పష్టమవుతుంది. దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయనంత సమగ్రంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వే నిర్వహించామని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటోంది. సర్వేని నిర్వహించి తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందని రాహుల్ గాంధీ ప్రకటిస్తూనే ఉన్నారు. కానీ సర్వేలో తేలిన అసలు నిజాలు ఇంకా వెలుగులోకి రాలేదు. స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీల జనాభా శాతాలను మాత్రమే ఇప్పటివరకూ ప్రభుత్వం ప్రకటించింది. కనీసం ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా ఎవరు ఎక్కడున్నారో తెలిపే గణాంకాలను సైతం బయటపెట్టలేదు. నిజానికి స్థూల శాతాలతో తెలిసిన కొత్త విషయం ఏదీ లేదు. ఏ రాష్ట్రంలోనైనా ఏడెనిమిది కులాలు మినహా మిగతావన్నీ రిజర్వేషన్ల కేటగిరీలోనే ఉంటాయి. సహజంగానే తెలంగాణలో వెల్లడైన శాతాల చిత్రమే అన్ని చోట్లా కనపడుతుంది.

ప్రభుత్వ ఉద్యోగాలు, పథకాల్లో ప్రాతినిధ్యం చుట్టూనే వర్గీకరణ ఉద్యమం ప్రధానంగా తిరిగింది కాబట్టి ఆ విషయంలో షమీమ్ అక్తర్ కమిషన్ తేల్చిన నిజాలు సంపూర్ణంగా వెల్లడైతే అసంతృప్తులు చల్లారే అవకాశం ఉంది. మాల, మాదిగ వర్గాలు చేస్తున్న వాదనల్లో సహేతుకత ఎంతో తెలుస్తుంది. ఏ ఉద్యమమైనా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టటానికి అసలు విషయాలకు అతిశయోక్తులను జోడిస్తుంది. దీన్ని తప్పుపట్టలేం! ప్రపంచవ్యాప్తంగా ఇది జరిగింది. ఇంకా జరుగుతోంది కూడా! కానీ, ఎప్పుడో ఒకప్పుడు నిజాలు వెల్లడి కావాలి. వర్గీకరణ చట్టం అమల్లోకి వచ్చింది కాబట్టి ఇప్పటికైనా షమీమ్ అక్తర్ నివేదికను ప్రజల ముందుంచటం పారదర్శకత దృష్ట్యా అత్యవసరం. గట్టి గణాంకాల ఆధారంగా వర్గీకరణ జరిగి, సామాజిక న్యాయం సంపూర్ణతను సంతరించుకుంటే దాన్నుంచి మరెందరో ప్రేరణపొందే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ అజెండా అదే కదా!

ఇక ఆంధ్రప్రదేశ్‌లో కూడా వర్గీకరణకు మార్గం సుగమమైంది. ఎస్సీ రిజర్వేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అమలుచేయటానికి మంగళవారం మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. వర్గీకరణకు ఉమ్మడి రాష్ట్రంలో మూడు దశాబ్దాల ఆందోళనకు రెండు తెలుగు రాష్ట్రాలు సముచిత రీతిలో స్పందించి మార్గదర్శకంగా నిలిచాయి.

కులాల్లో అంతర్గతంగానే గాక విభిన్న కులాల మధ్య నెలకొంటున్న ఆర్థిక అంతరాలు ఏ సమస్యనీ ఒకే దృక్పథంతో చూడనివ్వటం లేదు. ఇదొక సంక్లిష్ట పరిస్థితి. నిరంతరం మారిపోయే పరిస్థితి అని కూడా చెప్పుకోవాలి. రిజర్వేషన్లు బాగా అందుకున్న కులాలు... అలా అందుకోలేని కులాల మధ్య ఆర్థిక అంతరాలు స్పష్టంగా కనపడుతున్నాయి. వర్గీకరణతో ప్రస్తుతానికి పరిష్కారం లభించినా కొత్త డిమాండ్లు ఈ అంతరాల ఆధారంగా ఇకపై రావని భావించలేం. అందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాల్సిందే! సంపన్నశ్రేణి సమస్యను ఎల్లకాలమూ వాయిదావేసే పరిస్థితీ ఉండకపోవచ్చు!

తన చమురు, సహజ వాయువును భారత్ తదితర దేశాలకు ఎగుమతి చేయడానికి అమెరికా కసరత్తు చేస్తోంది. అగ్రరాజ్యం నుంచి చమురు దిగుమమతులను పెంచుకోవాలంటే సంప్రదాయ చమురు ఉత్పత్తి దేశాల నుంచి దిగుమతులు తగ్గించుకోవాలి. మన ప్రవాస కార్మికుల ఉపాధి, ఇతర వాణిజ్య అవసరాలు దృష్ట్యా గల్ఫ్ దేశాల నుంచి చమురు దిగుమతులను తగ్గించుకోవడం అంత సులువు కాదు.

ట్రంప్ తెచ్చిన సుంకాల సంకటం

అమెరికా నూతన సుంకాల విధానం బలవంతుడు, బలహీనుడు అనే సహేతుకత లేకుండా కొనసాగుతుండగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిళ్లకు గురవుతోంది. ఇది ఒక రకంగా అగ్రరాజ్యం ప్రారంభించిన వాణిజ్య యుద్ధం. కొన్ని దేశాలు ప్రతీకార సుంకాలతో ఎదురుదాడి చేస్తుండగా మరికొన్ని దేశాలు అనిశ్చిత స్థితిలో ఉన్నాయి. భారత్ మాత్రం బహిరంగ ఆవేశానికి లోనుకాకుండ వ్యూహాత్మక మౌనంతో వ్యవహరిస్తూ స్వీయ ఆర్థిక ప్రయోజనాలు కాపాడుకోవడానికి ప్రయత్నిస్తోంది.

అమెరికాలో నూతన సుంకాలు అమలులోకి వచ్చిన రోజు వ్యూహాత్మకంగా పార్లమెంటులో వక్ఫ్ బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా సుంకాల ప్రస్తావన బహిరంగ చర్చ కాకుండా కేంద్రం కట్టడి చేసింది. అమెరికాతో చర్చల సారాంశం ఎక్కడా వెల్లడవకుండా జాగ్రత్త పడుతున్నారు.

అమెరికా సుంకాల నేపథ్యంలో ప్రపంచ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. భారత్‌లో చమురు, వ్యవసాయ రంగాలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలపై వాటి ప్రభావం ఉంటుంది. భారత్‌తో సహా వివిధ దేశాలతో తన వాణిజ్యలోటును భర్తీ చేసుకోవడం అమెరికా లక్ష్యం. ఇందుకు తన వద్ద ఉన్న చమురు, సహజ వాయువును భారత్‌తో సహా ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి అమెరికా కసరత్తు చేస్తోంది. అగ్రరాజ్యం నుంచి చమురు దిగుమమతులను పెంచుకోవాలంటే సంప్రదాయ చమురు ఉత్పత్తి దేశాల నుంచి దిగుమతులు తగ్గించుకోవాలి. అయితే మన ప్రవాస కార్మికుల ఉపాధి, ఇతర వాణిజ్య అవసరాలు దృష్ట్యా గల్ఫ్ దేశాల నుంచి చమురు దిగుమతులను తగ్గించుకోవడం అంత సులువు కాదు. ఇప్పటికే భారత్‌లో తమ ఎగుమతులను పెంచుకోవడానికి గల్ఫ్ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిపాదిత రిఫైనరీ నిల్వ సామర్థ్యానికి మూడింతలు ఎక్కువగా తమకు చమురు వ్యాపారం చేసుకోవడానికి అవకాశం ఇస్తే పెట్టుబడులు పెడుతామని గల్ఫ్ దేశాలు షరతు విధిస్తున్నట్లు సమాచారం. ఇదిలా వుండగా భారత చమురు విపణిలో తమకు మరింత వాటా కావాలని అమెరికా ఒత్తిడి చేస్తోంది.

గల్ఫ్ లేఖ

నేరుగా ఒక్క అమెరికా ఎగుమతులపైనే కాకుండ అమెరికా సుంకాల వలన ప్రభావితమయ్యే ఇతర దేశాలకు జరిగే భారతీయ ఎగుమతులపై కూడా సుంకాల తాకిడి ఉంటుంది. ఇది ఎంత అనేది ఇప్పుడే కచ్చితంగా అంచనా వేయడం కష్టం. భారత వ్యవసాయ రంగంపై 26 శాతం పన్నులు విధింపును అమెరికా తాత్కాలికంగా వాయిదా వేసుకున్నది. దీనివల్ల పరస్పర చర్చలకు దారి సుగమమయింది. అమెరికాతో బుజ్జగింపు చర్యలలో భాగంగా కొన్ని రంగాలను కాపాడుకోవడానికి మరికొన్నింటిని అనివార్యంగా బలిపీఠం ఎక్కించవల్సి వస్తుంది. అమెరికా మద్యం లేదా మోటర్ సైకిళ్ళు మొదలైన విలాస వస్తువులపై సుంకాలు తగ్గించడం వల్ల సామాన్యులకు సమస్య ఉండదు. అయితే కీలకమైన ఆహార ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలు తగ్గించే అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయిక ఉత్పత్తుల విక్రయ రంగంలో అడుగుపెట్టడానికి అమెరికా దశాబ్దాలుగా కలలు కంటోంది. భారతీయ విపణిలో ప్రవేశానికి నిరంతరం ప్రయత్నిస్తోంది. సువిశాల భారతీయ వ్యవసాయక రంగంపై అమెరికా ఏనాటి నుంచో కన్నేసి ఉన్నది. అయితే పార్టీలకు అతీతంగా ప్రభుత్వాలన్నీ కీలకమైన వ్యవసాయరంగం, దాని అనుబంధ మత్స్య, కోళ్ళ పరిశ్రమ రంగాలను కాపాడుకుంటూ వస్తున్నాయి. అమెరికా వ్యవసాయిక ఉత్పత్తులపై మనం 39 నుండి 65 శాతం సుంకాలు విధిస్తుండగా అదే అమెరికా మన దేశ దిగుమతులపై 4–5 శాతం మాత్రమే సుంకాలు విధిస్తోంది. ఇప్పుడు పరిస్థితి మార్పు తథ్యమనిపిస్తోంది. దౌత్యపరమైన ఇచ్చిపుచ్చుకునే విధానంలో కొన్నిసార్లు మినహాయింపులు ఇవ్వడం జరుగుతోంది. భారీ భూకమతాలు, జన్యుమార్పిడితో అధిక దిగుబడులు సాధించే అమెరికాతో, వాతావరణాన్ని విశ్వసించి వ్యవసాయం చేస్తూ జీవనోపాధి కల్పించే ఇతర దేశాలు పోటీపడడం అంత సులువు ఏమీ కాదు. కీలకమైన వ్యవసాయ రంగంలో రైతులను విస్మరించి కార్పొరేటీకరణ కేంద్రీకృత వ్యవసాయ విధానం అమలు చేయాలని చూస్తే జరిగేదేమిటి? ప్రస్తుతం బియ్యం పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. పండించే రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదు. అలాగని అధిక ధరలు, తరుచుగా మారుతున్న వంగడాల వలన వినియోగదారులకు ఇబ్బంది ఎదురవుతోంది. పౌల్ట్రీ రంగంలోనూ అమెరికా అగ్రగామే. దాని ధాటికి ఇతర దేశాలు తట్టుకోవడం కష్టం. భారతీయ పౌల్ట్రీ రంగంలో అమెరికా అడుగు పెట్టకుండా ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ చాల కాలంగా కృషి చేసి అమెరికాను నిలువరించగలిగారు. అయినా చివరకు అమెరికా కోడి కాళ్ళ దిగుమతులను అడ్డుకోలేకపోయారు. భారతీయ కోళ్ళ పరిశ్రమలో దేశంలోని అగ్ర రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉందనే విషయాన్ని విస్మరించరాదు.



కోడి కాళ్ళు కాకుండ మొత్తం కోడిని భారత్‌కు ఎగుమతి చేయడానికి అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఈ విషయంలో అమెరికా సఫలీకృతమైతే భారతీయ పౌల్ట్రీ రంగం మనుగడ కష్టమవుతుంది. ఇప్పుడు సుంకాల చర్చలలో అమెరికాను చల్లబర్చడానికి పౌల్ట్రీ రంగంలో అగ్రరాజ్యాన్ని తక్కువ సుంకాలతో అనుమతించే అవకాశాలు ఉన్నట్లుగా చెబుతున్నారు. ఇక మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల విషయానికి వస్తే, రొయ్యలు అగ్రగామి. వీటిపై అమెరికా హెచ్చించిన సుంకాలు తాత్కాలికంగా వాయిదా వేసింది కానీ పూర్తిగా రద్దు చేయలేదు. మన దేశం నుంచి అమెరికాతో పాటు విదేశాలకు రొయ్యల ఎగుమతిలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. అమెరికా సుంకాలతో ఆంధ్ర రొయ్యల సేద్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలున్నాయి. మరో మూడు నెలలు కాదు కానీ ఒక సంవత్సరం తర్వాత ట్రంప్ సుంకాల ప్రభావం ఒక్కొక్కటిగా భారత్‌తో పాటు యావత్తు ప్రపంచానికి తెలిసి వస్తుంది. అయితే అప్పటికి చాలా నష్టం సంభవించడం ఖాయం.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

వ్యవస్థీకృతమైన పోలీసు హింస



■ **ఎ. కృష్ణారావు**

ఇండియాగేట్

'దేశంలో జైళ్లు 5.70 లక్షలమంది ఖైదీలతో నిండిపోయాయి. గత దశాబ్దంలో ఖైదీల సంఖ్య 50శాతం కంటే పెరిగిపోగా, అనేక రాష్ట్రాల్లో ఉండాల్సిన దాని కంటే 200 శాతం ఎక్కువగా ఖైదీలు జైళ్లలో మగ్గిపోతున్నారు. నిద్రపోయేందుకు సరైన స్థలం కూడా దాదాపు 31శాతం ఖైదీలకు లభించడం లేదు. మొత్తంగా 20శాతానికి పైగా ఖైదీలు మూడేళ్లకు పైగా విచారణ లేకుండా మగ్గిపోతున్నారు. జైళ్లలో 30శాతం పైగా సిబ్బంది పోస్టులు ఖాళీలు ఉన్నాయి.' మంగళవారంనాడు ఢిల్లీలో విడుదలైన 'ఇండియా జస్టిస్' రిపోర్ట్ సారాంశమిది. మాజీ న్యాయమూర్తులు, న్యాయనిపుణులు, పలు పౌర సంస్థలు కలిసి రూపొందించిన నివేదిక ఇది. దేశంలో నేర న్యాయవ్యవస్థ తీరుతెన్నులను అది వెల్లడించింది. రూల్ ఆఫ్ లా అమలు చేయడంలో భారతదేశం 142 దేశాల్లో 77వ స్థానంలో ఉన్నది! నేర న్యాయవ్యవస్థను అమలు చేయడంలో 89వ స్థానంలో ఉన్నది!!

భారతదేశంలో నేరాలను అదుపు చేయడంలో ఫోరెన్సిక్ సైన్స్, కృత్రిమ మేధ (ఏఐ) వంటి టెక్నాలజీలను సమర్థంగా ఉపయోగిస్తున్నామని, ప్రజలకు న్యాయాన్ని సకాలంలో సంతృప్తికరంగా అందించేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం నాడు అఖిల భారత ఫోరెన్సిక్ సైన్స్ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ అన్నారు. కేంద్ర హోంమంత్రి మాటలకూ, ఆచరణలో కనిపిస్తున్న దానికీ పొంతన లేదు. తాను మాట్లాడిన ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలోనే 50శాతానికి పైగా ఖాళీలు ఉన్న విషయం ఆయనకు తెలియనిది కాదు.

జైళ్లు నిండిపోకుండా ఉండాలంటే, ప్రజలకు సకాలంలో న్యాయం అందాలంటే న్యాయ వ్యవస్థ సరిగా పనిచేయాలి. కాని దేశంలో హైకోర్టులు, జిల్లా కోర్టుల్లో 5.1 కోట్ల మేరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సగటున మూడేళ్లకు పైగా 61 శాతం కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. 1987లో లా కమిషన్ దేశంలో ప్రతి పదిలక్షల మందికి కనీసం 50 మంది న్యాయమూర్తులు ఉండాలని తెలిపింది. కాని ఏ రాష్ట్రంలోనూ ఈ పరిస్థితి లేదు. ప్రతి పదిలక్షల మందికీ కేవలం 15 మంది న్యాయమూర్తులే ఉన్నారు. జిల్లా కోర్టుల్లో ప్రతి జడ్జిపైనా 2200 కేసుల భారం ఉంది. ఈ పరిస్థితి మూలంగా క్రింది కోర్టుల్లో మూడేళ్లకు మించిన పెండింగ్ కేసులు 25 నుంచి 45 శాతానికి పెరిగిపోయాయి. బిహార్‌లో అయితే క్రింది కోర్టుల్లో 71 శాతం కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. హైకోర్టుల్లో ఈ పరిస్థితి ఇంతకంటే ఘోరంగా ఉన్నది. దేశంలోని 25 హైకోర్టుల్లో అయిదేళ్లకు మించి పెండింగ్‌లో ఉన్న కేసులు 51 శాతానికి పై మాటే. సుప్రీంకోర్టులో అయితే 81వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

దేశం అత్యాధునిక ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందాలంటే నేర న్యాయవ్యవస్థ, రూల్ ఆఫ్ లా సక్రమంగా ఉండడం ముఖ్యం. ఒక దేశం అభివృద్ధి చెందిందని చెప్పేందుకు కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కొలమానం కాదు. సామాజిక శాంతి, అందరికీ సమాన న్యాయం కూడా అభివృద్ధికి కొలమానాలే. కాని ఇక్కడ ప్రజలకు సకాలంలో న్యాయం అందడం అనేది ఒక సుదూర స్వప్నంగా మిగిలిపోయింది. న్యాయం ఆలస్యం కావడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే అన్నది ఒక నానుడి. కాని మన నేతలు ఎంత టెక్నాలజీ గురించి మాట్లాడుతున్నా, కోర్టులు, పోలీసు స్టేషన్లకు వెళ్లిన వారికి మనం ఎన్ని దశాబ్దాలు వెనుకగా ఉన్నామో అర్థమవుతోంది. ప్రజలకు న్యాయం అందడమే కష్టమైనప్పుడు దళితులు, మైనారిటీలు, ఆదివాసీలు అన్న తేడా లేకుండా సమాన న్యాయం అందడానికి మనకు ఎంత కాలం పట్టాలి? దేశంలో పేరుకుపోయిన కేసులన్నీ పరిష్కారం కావాలంటే 324 సంవత్సరాలు పడుతుందని నీతీ ఆయోగ్ ఒక నివేదికలో పేర్కొంది. న్యాయవ్యవస్థలో మహిళలు, దళితులు, ఆదివాసీలు, బీసీల శాతం గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తుల్లో కేవలం 14 శాతం మంది ఎస్‌సీలు కాగా హైకోర్టుల్లో ఎస్‌సీ, ఎస్‌టీలకు చెందినవారు అయిదు శాతం మంది మాత్రమే ఉన్నారు. బీసీలు కేవలం 25.6 శాతం మంది మాత్రమే.

న్యాయవ్యవస్థ వేగంగా న్యాయం అందించకపోవడానికి న్యాయమూర్తుల సంఖ్య, మౌలిక సదుపాయాలు లేకపోవడం కారణమైతే, ప్రజలు చట్టం, న్యాయం పట్ల నమ్మకం కోల్పోవడానికి పోలీసు వ్యవస్థ కూడా కారణం. భారతదేశంలో పోలీసింగ్ పరిస్థితిపై కామన్ కాజ్, లోక్‌నీతి –సీఎస్‌డీఎస్ వారం రోజుల క్రితం విడుదల చేసిన నివేదిక అనేక పచ్చి నిజాలను వెలికితీసింది. దేశంలోని 8వేల మంది పోలీసులను ఈ సంస్థలు ప్రశ్నించి నివేదికను రూపొందించాయి. దేశంలో నేరాలను పరిష్కరించాలంటే చట్టవ్యతిరేకంగా బలప్రయోగం చేయడమే సరైనదని పోలీసుల్లో అత్యధికులు భావిస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. వారికి రూల్ ఆఫ్ లా అన్నా, నిబంధనలు పాటించడమన్నా లెక్కలేదని తెలిపింది. సమాచారం రాబట్టాలంటే హింస తప్పదని సగానికి పైగా పోలీసులు చెప్పారని వెల్లడించింది. వ్యవస్థ నేరస్థులను రక్షిస్తుందని ఈ నివేదిక తెలిపింది. ప్రజల్లో భయం ఉండాలంటే బలప్రయోగం తప్పదని 55 శాతం మంది పోలీసులు చెప్పారని, సీరియస్ కేసుల్లో థర్డ్ డిగ్రీ ప్రయోగించాల్సిందేనని 30శాతం మంది సమర్థించుకున్నారని, చిన్ననేరాలకు కూడా హింసించకపోతే నిజాలు బయటకురావని 9శాతం మంది పోలీసులు చెప్పారని తెలిపింది. అరెస్టుకు నిబంధనల ప్రకారం వ్యవహరించాలంటే ప్రతిసారీ సాధ్యం కాదని 24శాతం మంది పోలీసులు అంగీకరించారని తెలిపింది. పోలీసుల ప్రతాపానికి గురైన వారిలో అత్యధికులు దళితులు, ముస్లింలు, ఆదివాసీలు, మురికివాడల్లో నివసించేవారే కావడం గమనార్హం. దీంతో చట్టాలు ఎవరికి అనుకూలంగా పనిచేస్తున్నాయో అర్థమవుతుంది. ఎలాంటి ఫోరెన్సిక్ నైపుణ్యం లేకుండానే డాక్టర్లు వైద్యపరీక్షలు చేయడం, మెజిస్ట్రేట్లు తరుచూ మౌన ప్రేక్షకులుగా ఉండిపోవడం సహజ పరిణామం. ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారమే 2011–2022ల మధ్య పోలీసు కస్టడీలో 1107 మంది మరణించారు. కాని ఒక్క పోలీసు అధికారికి కూడా శిక్షపడలేదు అసలు భారత న్యాయవ్యవస్థనే పోలీసు హింస కమ్మి వేసిందని, టెక్నాలజీ, ఏఐ గురించి ఎంత మాట్లాడుకున్నా ఒక రకంగా పోలీసు హింస అనేది దేశంలో వ్యవస్థీకృతంగా మారిందని వ్యాఖ్యానించింది.



సమాజంలో అన్ని వర్గాలకూ చట్టం సమరీతిలో వర్తించాలంటే పోలీసులు వృత్తి నైపుణ్యంతో వ్యవహరించాలి. అంతర్జాతీయ ఒడంబడికల స్ఫూర్తితో హింసాకాండకు వ్యతిరేకంగా అనేక దేశాలు చట్టాలు చేసినప్పటికీ మన దేశం మాత్రం ఈ విషయంలో పెద్ద పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది! హింస, చట్టవ్యతిరేక హత్యలకు రాజకీయ వ్యవస్థలు ప్రోద్బలం కలిగించడమే ఇందుకు కారణం.

భారత రాజ్యాంగం పోలీసు కస్టడీలో హింసాకాండను పూర్తిగా నిషేధించింది. నాగరిక సమాజంలో న్యాయం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలు ప్రధానం. హింస అనేది ఆటవిక సంస్కృతిని ప్రతిబింబించడమే కాదు, మానవ సంబంధాలను హరించివేస్తుంది. సమాజంలో అన్ని వర్గాలకు చట్టం సమరీతిలో వర్తించాలంటే పోలీసులు వృత్తి నైపుణ్యం, జవాబుదారీతనంతో వ్యవహరించాలి. హింసాకాండకు వ్యతిరేకంగా అనేక దేశాలు అంతర్జాతీయ ఒడంబడికలకు అనుగుణంగా చట్టాలు చేసినప్పటికీ మన దేశం మాత్రం ఈ విషయంలో పెద్ద పట్టింపు లేకుండా వ్యవహరిస్తోంది. హింస, చట్టవ్యతిరేక హత్యలకు రాజకీయ వ్యవస్థలు ప్రోద్బలం కలిగించడమే ఇందుకు కారణం. ఈ క్రమంలో మానవ హక్కుల సంఘాలు కూడా కోరలు లేని నామమాత్ర సంస్థలుగా మిగిలిపోయాయి.

1997లో డికె బసు వర్సెస్ ఆఫ్ స్టేట్ ఆఫ్ బెంగాల్ కేసులో సుప్రీంకోర్టు పోలీసు కస్టడీలో హింసాకాండ, మరణాలు పెరిగిపోతున్నాయని పేర్కొంది. పోలీసు కస్టడీలో హింసాకాండ మానవ హక్కులను పూర్తిగా హరించి వేసి మనిషి ఉనికికే ముప్పుగా మారిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎన్వీ రమణ ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు.

దాదాపు 19 సంవత్సరాల క్రితం సుప్రీంకోర్టు పోలీసు సంస్కరణలపై సమగ్రమైన తీర్పు నిచ్చింది. కాని ఇంత వరకూ ఈ సంస్కరణలపై ఏ ప్రభుత్వమూ దృష్టి సారించ లేదు. ఈ సంస్కరణలు కావాలని సుప్రీంకోర్టులో పోరాడిన ఉత్తరప్రదేశ్ మాజీ డీజీపీ ప్రకాశ్‌సింగ్ పోలీసులు, రాజకీయ నాయకులు పరస్పరం ఆధారపడడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్యానించారు. పోలీసులు లేకుండా రాజ్యం కోరలు లేనిదవుతుందని అన్నారు. రాజకీయ నాయకులు పోలీసులు తమ అడుగులకు మడుగులొత్తాలని, తమ రాజకీయ ఎజెండా అమలు చేయాలని అనుకుంటారని, పోలీసులపై రాజకీయనేతల పెత్తనం లేకుండా కొంత స్వతంత్రత ఏర్పర్చడం అవసరమని అన్నారు.

పోలీసుల శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతల నుంచి దర్యాప్తు బాధ్యతలను వేరు చేయాలని చెప్పిన సుప్రీంకోర్టు, వారు జవాబుదారీగా వ్యవహరించేందుకు అనేక ప్రతిపాదనలూ చేసింది. డీజీపీలను తాత్కాలికంగా నియమించకుండా యూపీఎస్‌సీ ద్వారా నియమించాలని తెలిపింది. డీజీపీలకు నిర్దిష్టంగా రెండేళ్ల కాలపరిమితిని విధించి రాజకీయ జోక్యం లేకుండా చూడాలని, బదిలీలు, పోస్టింగులు పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డుకు అప్పగించాలని, పోలీసులపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, కేంద్ర స్థాయిలో జాతీయ సెక్యూరిటీ కమిషన్ నియమించి నియామకాల బాధ్యతలు అప్పగించాలని తెలిపింది. ఈ సూచనలేవీ ప్రభుత్వాలు పాటించడం లేదని, అనేక రాష్ట్రాల్లో నిబంధలను ఉల్లంఘించి పోలీసులను నియమిస్తున్నారని, ఈ నియామకాల్లో తీవ్రమైన అవినీతి జరుగుతోందని ఇటీవల ప్రముఖ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, దుష్యంత్ దవే సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. తాము మే నెలలో పోలీసు సంస్కరణలపై దృష్టి సారిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా చెప్పారు. అప్పటికి ఆయన పదవీవిరమణ చేస్తారు. ఆ తర్వాత కొత్త సీజే ఈ తీర్పులపై దృష్టిసారిస్తారో కాలగర్భంలో కలిపివేస్తారో చెప్పలేం. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో కనీసం మూడో స్థానానికి చేరాలనుకుంటున్న భారతదేశం ఆ దేశాల్లో ఉన్న ప్రమాణాలకు అనుగుణంగా న్యాయ, భద్రతా వ్యవస్థలను సంస్కరించుకోకపోతే అభివృద్ధికి అర్థం లేనట్లే.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

జానపదుల రారాజు రామరాజు

దక్షిణ భారతదేశంలోని విశ్వవిద్యాలయాలన్నింటిలోను తొలుదొలుత శాస్త్రీయంగా, పండితులకు అంటరానిదైన జానపద సాహిత్యంపై పరిశోధనకు శ్రీకారం చుట్టింది డా.బిరుదురాజు రామరాజు. 'జానపద గేయసాహిత్యం' అనే అంశంపై 1952లో రిజిస్టర్ చేసి పరిశోధన ప్రారంభించి రవాణా సౌకర్యాలు లేని, రికార్డు చేసుకునే వసతులు లేని ఆ గడ్డు కాలంలో, క్షేత్రస్థాయిలో కాలికి బలపం కట్టుకొని తెలంగాణ ప్రాంతంలోని జిల్లాలు తిరిగారు. గ్రామీణుల చేత వేలాది పాటలు పాడించుకొని వాటిని శ్రద్ధగా రాసుకొని, తెలంగాణేతర తెలుగు ప్రాంతాలలో, ఆనాటి మద్రాసు ప్రాంతంలోని గ్రంథాలయాలలో విషయ సేకరణ చేసి, తాను రాసే సిద్ధాంత వ్యాసానికి, తానే స్వయంగా ఒక పద్ధతి ఏర్పాటు చేసుకొని దాన్ని రచించారు. ఆ సిద్ధాంత వ్యాసానికి 1955లోనే ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నుండి మొట్టమొదట పిహెచ్.డి పట్టా పొందిన మహా పరిశోధకుడు, పథనిర్దేశకుడు బిరుదురాజు రామరాజు. ఈవేళ విశ్వవిద్యాలయాలన్నింటిలోను జానపద సాహిత్యానికి సముచిత స్థానం లభించి వందలాదిమంది జానపద రంగంలోని పలు అంశాలు తీసుకొని పిహెచ్.డి సిద్ధాంత వ్యాసాలు రాసారంటే చాలావరకు అవి రామరాజు సిద్ధాంత వ్యాసాన్ని మూలంగా తీసుకొని రాసినవే.

డా. రామరాజు కేవలం జానపద సాహిత్యరంగానికే పరిమితమైన పండితుడు కాదు, ప్రాచీన తెలుగు సాహిత్యమంతా వారికి కరతలామలకం. తాను సేకరించిన వందలాది ప్రాచీన గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలలో 15 గ్రంథాలను పరిష్కరించి వారు వెలుగులోకి తెచ్చారు. శ్రీనాథ మహాకవి అసమగ్ర కావ్యం 'శివరాత్రి మహత్త్యం'ను పూర్తిగా సేకరించి సంపూర్ణ గ్రంథాన్ని వెలువరించారు. డా. రామరాజు తెలుగు భాషలో ఎంత గొప్ప పరిశోధకుడో, పండితుడో సంస్కృత భాషలోనూ అదేస్థాయిలో పరిశోధన చేసారు, గ్రంథాలు ప్రచురించారు. ఇంగ్లీషు భాషలోను సమాన ప్రతిభగల డా. రామరాజు జాతీయ, అంతర్జాతీయ పరిశోధకుల కోసం, పాఠకుల నిమిత్తం ఇంగ్లీషులోను పలురచనలు చేసి పలు అంతర్జాతీయ విజ్ఞాన సర్వస్వాలకు తన రచనలు అందించి ఎన్నో అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్రాలు సమర్పించి – జానపద సాహిత్యాన్ని జగమంతా మెచ్చేలా సహజంగా, సశాస్త్రీయంగా ప్రచారం చేసారు.

డా. బి. రామరాజు అనగానే జానపద సాహిత్యం, ప్రాచీన సంస్కృతాంధ్ర సాహిత్యాలు, గ్రంథపరిష్కరణలు, తాళపత్ర గ్రంథాలు, తెలుగునేలలో 'మరుగుపడిన మాణిక్యాలు', 'చరిత్ర కెక్కని చరితార్థులు', 'సాహిత్యోద్ధారకులు', 'సంస్కృత సాహిత్యానికి తెలుగువారి సేవ' ఇత్యాది అంశాలలో – విశేషమైన, విశిష్టమైన సేవ చేసిన ఒక మహాపరిశోధకుడు కళ్ళముందు కనబడతాడు. ఇంతటి మహామహోపాధ్యాయుడి, జాతీయ ఆచార్యుడి శతజయంతి నేడు. ఈ మహానుభావుడు పదిహేనేళ్ళ క్రితం వరకు మనమధ్యలోనే ఉండి, 'ఆంధ్రయోగులు'పై ఇంతవరకు జరగని పరిశోధనలు చేసి, 317మంది యోగుల విశేష జీవిత వివరాలు సేకరించి, ఏడు గొలుసు గ్రంథాలు వెలువరించిన పట్టువిడువని పండిత శ్రేష్ఠుడు. 2011 ఫిబ్రవరి 8న తన 85వ ఏట కన్నుమూసే దాకా నిరంతరం కృషిచేసారు.

కొందరేమో శిష్యవర్గం ప్రచారంతో, మరికొందరేమో అభిమానుల ఆదరంతో, ఇంకా కొందరేమో అధికార ప్రాభవంతో గొప్పవారు అవుతున్న రోజులలో కేవలం తన పరిశోధనల వలన, వాటి ఫలితమైన రచనల వల్లనే గుర్తింపు పొందారు ఆయన. తెలుగు ప్రొఫెసర్‌గా పదవీవిరమణ చేసిన పుష్కర కాలానికి గాని, డా. రామరాజు లాగా జాతీయ ఆచార్యుడిగా అవకాశం రాదు. తనకు గాడ్‌ఫాదర్ లేడు కాబట్టే, కేవలం గాడ్ మీదనే ఆధారపడినందున అంత ఆలస్యం జరిగిందేమో అనే వారు రామరాజు మాస్టారు.



ఈవేళ విశ్వవిద్యాలయాలన్నింటిలోను జానపద సాహిత్యానికి సముచితస్థానం లభించి వందలాదిమంది ఆ రంగంలోని పలు అంశాలు తీసుకొని సిద్ధాంత వ్యాసాలు రూపొందించారంటే చాలావరకు అవి రామరాజు సిద్ధాంత వ్యాసాన్ని మూలంగా తీసుకొన్నవే.

రామరాజు తొలినాళ్ళలో చక్కని కవి. వీరిలోని పరిశోధన పాటవాన్ని గమనించిన సుప్రసిద్ధ సంపాదకులు ప్రతాపరెడ్డి సలహా మేరకు కవిత్వం రాయడం మానివేసి జీవితం సమస్తం పరిశోధనా రంగానికే అంకితం చేసిన నిత్యకృషీవలుడు. యం.ఏ.లో ఉన్నప్పుడు, అప్పుడు బి.ఏ. చదువుతున్న సి.నారాయణరెడ్డితో కలిసి 'రామనారాయణకవులు'గా రామరాజు జంటకవిత్వం రాసారు. సినారె స్థాయిలో కవిత్వం చెప్పగలిగిన రామరాజు కవిత్వం జోలికి పోకుండా తన జీవితాన్ని పరిశోధనకు, విమర్శకు అంకితం చేయడం వెనుక ఎంత పట్టుదల, పరిశ్రమ ఉందో వేరుగా చెప్పనవసరంలేదు.

రామరాజు దాదాపు మూడున్నర దశాబ్దాల కాలం విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడుగా సేవలందించి ఎంతోమందిని ఉత్తమ ఆచార్యులుగా తీర్చిదిద్దారు. పేర్వారం జగన్నాథం, రవ్వా శ్రీహరి లాంటి వీరి శిష్యులు వైస్ ఛాన్సలర్లు అయ్యారు. ఆచార్య రామకోటి శాస్త్రి, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, ఆచార్య యం. వీరభద్రశాస్త్రి, వై. రఘుమన్న లాంటి ఎందరో వారి శిష్యులు, ప్రశిష్యులు వివిధ విశ్వవిద్యాలయాల్లో తెలుగుశాఖలో కీలకస్థానాల్లో ఉన్నా ఎందుచేతనోగానీ ఒకే ఒక్క విదుషీమణి శ్రీమతి కంచి విజయలక్ష్మి మాత్రమే 'డా.రామరాజు జీవితం – రచనలు' అంశంపై రెండున్నర దశాబ్దాల క్రితం పరిశోధన చేసారు.

ఊరూ పేరూ తెలియని ఎందరో అనామకులపై పరిశోధనలు చేయించే విశ్వవిద్యాలయ ఆచార్యులకు డా. రామరాజు పరిశీలించి, పరిష్కరించి వెలుగులోకి తెచ్చిన సంస్కృతాంధ్ర గ్రంథాలయాలపై వేరుగా పరిశోధనలు చేయించవచ్చునని, తాళపత్ర గ్రంథాలను ప్రపంచానికి తెలియజేసిన వారి వ్యాసావళిపైనే ప్రత్యేక పరిశోధన చేయించవచ్చని తెలియక పోదు. సంస్కృత భాషాసాహిత్యాలకు ఆంధ్రులు చేసిన సేవల గురించి, ఇంకా వీరు ఇంగ్లీషులో రచించిన పలు పరిశోధన వ్యాసాలపైన పరిశోధన చేయించవచ్చు. అంత దాకా ఎందుకు 'ఆంధ్రయోగులు' గొలుసు గ్రంథాలపై పరిశోధన చేయించవచ్చు. జరిగిన ఆలస్యం ఏలాగు జరిగిపోయింది. బిరుదురాజు రామరాజు శతజయంతి జరుగుతున్న ఈ సందర్భంలోనైన ఈ అంశాలలో కొన్నింటిపైనైనా పరిశోధనకు తెలుగు రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాలు శ్రీకారం చుడితే సంతోషం.

■ **టి. ఉడయవర్లు**

(నేడు బిరుదురాజు రామరాజు శతజయంతి. కేంద్ర సాహిత్య అకాడమీ– శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో శతజయంతి సభ)

మోడల్ స్కూల్ సిబ్బందినీ బదిలీ చేయండి

రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం చట్టం తీసుకురావడం శుభ పరిణామం. వీటిలో పారదర్శకతకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ ఉపాధ్యాయులకు చట్ట పరిధిలో బదిలీలు జరుగుతాయి. అదే విధంగా అతి తక్కువ సంఖ్య ఉన్న ఆంధ్రప్రదేశ్ మోడల్స్ స్కూల్స్ రెగ్యులర్ ఉపాధ్యాయులు కూడా తమ బైలాస్ ప్రకారం బదిలీలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కేవలం 164 మోడల్ స్కూల్స్ మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. వీటిలో జోనల్ వ్యవస్థ ఆధారంగా నియామకాలు జరిగాయి. 2018లో బదిలీ అయిన ఏపీ మోడల్ స్కూల్స్ రెగ్యులర్ ఉపాధ్యాయులు, 2019 డిసెంబర్‌లో డీఎస్సీ 2018 ద్వారా నియామకమైన మోడల్ స్కూల్స్ రెగ్యులర్ సిబ్బంది, ఆదర్శ పాఠశాలల పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు తమకు బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మెగా డీఎస్సీ–2025 ద్వారా మోడల్ స్కూల్స్‌లో కూడా రెగ్యులర్ పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయనుంది. అందువల్ల ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే బదిలీలు నిర్వహిస్తే ఈ పాఠశాలల్లో కూడా క్రమబద్ధీకరణ జరిగి సుదూర ప్రాంతాల్లో ఐదేళ్లకు పైబడి విధులు నిర్వహిస్తున్న వారికి బదిలీల ద్వారా న్యాయం జరిగే అవకాశం ఉంది. ప్రస్తుత ప్రభుత్వమైనా న్యాయం చేయాలని వీరు కోరుతున్నారు.

– **బి. సురేశ్**
మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్స్ కమిటీ



10 వేల ఎకరాల భూ సమీకరణ!

ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్య సీఆర్‌డీఏ ఎంపిక

- ఎయిర్ పోర్టుకు 5 వేలు, స్మార్ట్ ఇండస్ట్రియల్ పార్క్‌కు 2,500, స్పోర్ట్స్ సిటీకి 2,500 ఎకరాలు
- గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులు పూర్తయిన రెండేళ్లకు మరో 34 వేల ఎకరాల సమీకరణ
- మల్టీ కనెక్టివిటీ కోసమే.. ఇన్నర్, అవుటర్ మధ్య ప్రాంతం గుర్తింపు
- తుళ్లూరు మండలంలో అంతర్జాతీయ విమానాశ్రయం!
- ప్రపంచ బ్యాంకు సూచనల మేరకు భూములు తీసుకోవాలని నిర్ణయం



అమరావతికి దగ్గరగా ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతంలో ఉన్న 10 వేల ఎకరాల భూములను యుద్ధప్రాతిపదికన సమీకరించాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ఎండ్రాయి, కర్లపూడి, తాడికొండ, వైకుంఠపురంలోని భూములను టాప్-3 ప్రాధాన్యతా ప్రాజెక్టుల కోసం తీసుకోవాలని యోచిస్తోంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయానికి ఐదు వేల ఎకరాలు, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీకి 2,500 ఎకరాలు, స్పోర్ట్స్ సిటీ కోసం 2,500 ఎకరాల చొప్పున తీసుకోవాలన్నది ఆలోచన. అవసరమైన భూములను తీసుకోవటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంగీకారం తెలిపినట్టు సమాచారం. మిగిలిన భూములను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం తర్వాత తీసుకోవాలని చూస్తున్నారు. అయితే భూ సమీకరణ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతిని పరిపాలనా కేంద్రంగానే కాకుండా సమాంతరంగా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ప్రపంచ బ్యాంక్ సూచించిన విధంగా ఆర్థికాభివృద్ధిని తీసుకురావటానికి వీలుగా అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీలను అభివృద్ధి చేయాలని భావిస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రాంట్లతో కలిపి రూ.45 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఇదికాకుండా బ్యాంకుల మిగతా 6లో..

బఫర్ జోన్ రగడ!

జిల్లాలో రాతి నిక్షేపాలకు నెలవైన పరిటాలలో క్రషర్స్, రియల్ ఎస్టేట్ వెంచర్ల నిర్వాహకుల మధ్య బఫర్ జోన్ రగడ నడుస్తోంది. నలభై సంవత్సరాలుగా రాతి క్వారీలను లీజులకు తీసుకుని క్రషింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసి రోడ్డు మెటల్, బిల్డింగ్ మెటల్ ఉత్పత్తి చేస్తున్న ప్రాంతంలోకి వచ్చి మరీ కొందరు లే అవుట్లు వేస్తుండటంతో వివాదం తలెత్తింది. మైనింగ్ బఫర్ జోన్ పరిధిలో వేసిన లే అవుట్లను తొలగించాలని క్రషర్స్ యజమానులు చేసిన విజ్ఞప్తులను వెంచర్ల నిర్వాహకులు పెడచెవిన పెడుతున్నారు. దీంతో క్రషర్స్ యజమానులు మైనింగ్, రెవెన్యూ, సీఆర్‌డీఏ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

క్రషర్స్ వర్సెస్ వెంచర్స్!

స్టోన్ క్రషర్స్ సమీపంలో నాన్ లే అవుట్లు

అభ్యంతరం వ్యక్తం చేసిన క్రషర్స్ యజమానులు

- బేఖాతరు చేసిన వెంచర్ల నిర్వాహకులు
- సీఆర్‌డీఏ, రెవెన్యూ, మైనింగ్‌లకు ఫిర్యాదు
- మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని డిమాండ్



పరిటాల స్టోన్ క్రషింగ్ ప్రాంతంలో వేసిన అనుమతిలేని లేఅవుట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): దశాబ్దాలుగా పరిటాల ప్రాంతంలో స్టోన్ క్రషింగ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లే అవుట్లు వెలుస్తున్నాయి. నాన్ లే అవుట్లు కావటంతో తక్కువ ధరకే ప్లాట్లు సొంతం చేసుకోండంటూ వాటి నిర్వాహకులు బంపర్ ఆఫర్ ఇస్తున్నారు. అయితే ఇక్కడ కొనసాగుతున్న స్టోన్ క్రషింగ్, క్వారీలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతాన్ని మైనింగ్ జోన్‌గా ప్రకటించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. మైనింగ్ కార్యకలాపాలు, స్టోన్ క్రషింగ్‌కు అనుమతించిన ప్రాంతాల పక్కనే నివాస ప్రాంతాలకు అనుమతులు ఇవ్వకూడదు. సీఆర్‌డీఏ నుంచి అనుమతులు రావు. అయినా కొంత మంది బడా వ్యక్తులు నాన్ లే అవుట్లు వేస్తున్నారు. ప్రజలను మభ్యపెట్టి ప్లాట్ల వ్యాపారం చేస్తున్నారు. అనధికార వెంచర్ల దెబ్బతో మైనింగ్ జోన్‌కు డిమాండ్ చేస్తున్న పారిశ్రామికవేత్తలు, స్టోన్ క్రషింగ్స్ యూనిట్ల యజమానులు తమ దుకాణాలను సర్దుకునే పరిస్థితి రానుంది. ఈ ప్రమాదాన్ని గ్రహించిన స్టోన్ క్రషింగ్ యూనిట్ల నిర్వాహకులంతా సంఘటితమయ్యారు. స్టోన్ క్రషర్స్ అసోయేషన్ తరపున నాన్ లే అవుట్లపై చర్యలు తీసుకోవాల్సిందిగా సీఆర్‌డీఏ, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు తాజాగా ఫిర్యాదులు చేయటం సంచలనం సృష్టిస్తోంది.

మైనింగ్ జోన్ పరిధి ఏమిటి?

మైనింగ్ జోన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 153ని కూడా జారీ చేసింది. ఈ జీవో ప్రకారం చూస్తే.. క్వారీలు, స్టోన్ క్రషర్లను నిర్వహించటానికి అవసరమైన భూమిని మైనింగ్ జోన్‌గా వర్గీకరించాల్సి ఉంటుంది. మైనింగ్ జోన్‌లో క్వారీయింగ్, స్టోన్ క్రషింగ్ మినహా ఇతర కార్యకలాపాలను అనుమతించరు. మైనింగ్ జోన్ చుట్టూ ఒక కిలోమీటరు పరిధిలో బఫర్ జోన్ ఉంటుంది. ఈ బఫర్ జోన్‌లో ఎలాంటి రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్‌కు అనుమతించరు.

1300 ఎకరాల్లో క్వారీలు

నందిగామ నియోజకవర్గం పరిటాల గ్రామంలోని సర్వే నెంబర్ 801లో 1300 ఎకరాల రెవెన్యూ భూముల్లో నాలుగు దశాబ్దాలుగా పారిశ్రామికవేత్తలు రోడ్డు మెటల్, గ్రావెల్ క్వారీలను అధికారికంగా లీజుకు తీసుకున్నారు. వ్యాపార సౌలభ్యం కోసం చాలా మంది పారిశ్రామికవేత్తలు తాము లీజు పొందిన క్వారీల చెంతనే భూములను కూడా కొనుగోలు చేశారు. ఇలా కొనుగోలు చేసిన భూములలో పారిశ్రామికవేత్తలు స్టోన్ క్రషింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఈ యూనిట్లను కూడా పూర్తిగా కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు తీసుకుని ఏర్పాటు చేయటం జరిగింది. అన్ని రకాల అనుమతులు తీసుకున్న తర్వాతే ఈ స్టోన్ క్రషింగ్ యూనిట్లను ప్రారంభించారు. ఈ స్టోన్ క్రషింగ్ యూనిట్లలో రోడ్డు మెటల్, బిల్డింగ్ మెటల్ తయారవుతోంది. పరిటాల క్రషింగ్ యూనిట్ మిగతా 6లో..

800 మీటర్ల బఫర్ జోన్‌కు డిమాండ్

పరిటాల గ్రామం పరిధిలోని సర్వే నెంబర్ 801లో క్రషర్స్ యూనిట్ల ప్రాంతం 500 మీటర్ల పరిధిలో ఉంది కాబట్టి కనీసం 800 మీటర్ల లోపు ఎలాంటి అభివృద్ధి ప్రణాళికలను ఆమోదించకుండా చర్యలు తీసుకునేలా ఖనిజాభివృద్ధి సంస్థకు స్టోన్ క్రషర్స్ అసోసియేషన్ లేఖ ఇవ్వటం జరిగింది. అదేవిధంగా సీఆర్‌డీఏ అధికారులను కూడా జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో మైనింగ్ జోన్‌గా గుర్తించి వ్యవసాయభూములను కన్వర్షన్ చేయటానికి అనుమతులు ఇవ్వవద్దని కోరారు. కానీ, ఏ శాఖలు కూడా వీరి విజ్ఞప్తిని పట్టించుకోలేదు.

తాగుతున్నారు.. తన్నుకుంటున్నారు!



బార్‌ను తలపిస్తున్న పాతపాడు వైన్ షాపు

బార్‌లను తలదన్నేలా మద్యం షాపుల వద్ద ఏర్పాట్లు

నగర శివారు ప్రాంతాల్లోని మద్యం షాపుల వద్ద ఏర్పాటు చేసిన అనధికారిక పర్మిట్ రూముల్లో మందుబాబులు తప్పతాగి తన్నుకుంటున్నారు. దీంతో ఆయా పరిసర ప్రాంతాల్లో నిత్యం భయానక వాతావరణం నెలకొంటోంది. మద్యం అమ్మకాలు మాత్రమే జరపాల్సిన షాపుల నిర్వాహకులు వ్యాపారం పెంచుకునేందుకు చేసిన ఏర్పాట్లు గొడవలకు కారణమవుతున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన ఎక్సైజ్, పోలీసు అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

- అనధికార పర్మిట్ రూముల్లో నిత్యం ఘర్షణలు
- భయానకంగా పరిసర ప్రాంతాలు
- పట్టించుకోని ఎక్సైజ్, పోలీసు అధికారులు



నున్నలో పాకతో పాటు బెంచీలు వేసి మరీ మద్యం తాగిస్తున్న వైన్ షాపు నిర్వాహకులు

పాయకాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాయకాపురం ప్రాంతంతో పాటుగా నున్న, పాతపాడు, అంబాపురం గ్రామాల పరిధిలో సుమారు ఆరు వరకు వైన్ షాపులు ఉన్నాయి. అయితే వీటిని చూసిన వారెవరూ వైన్ షాపులు అనుకోరు. బార్‌లను తలదన్నేలా ఇక్కడ కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు సకల సదుపాయాలు ఉంటాయి. కేవలం వైన్ షాపుల్లో మద్యం మాత్రమే అమ్మకాలు జరపాల్సి ఉన్నా పక్కనే షెడ్లు వేసి మరీ మందుబాబులకు సోడాలు, స్టఫ్ వగైరాలు అందిస్తున్నారు. దీని వలన వైన్ షాపులే కాక సమీపంలోని రోడ్లు, పొలాలు కూడా తిరునాళ్లను తలపిస్తున్నాయి.

నిత్యం ఘర్షణలే!

స్థానిక వైన్ షాపుల వద్ద నిత్యం ఏదో ఒక ఘర్షణ జరుగుతూనే ఉంటోంది. రెండు రోజుల క్రితం ప్రకాష్‌నగర్ సెంటర్‌లోని ఓ వైన్ షాపులో కొందరు యువకులు ఫూటుగా మద్యం తాగి అకారణంగా మరో యువకుడిపై దాడి చేశారు. ఈ ఘటనలో గణేష్ అనే యువకుడు తల, మొహం, చేతి భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి.



ప్రకాష్‌నగర్ వైన్ షాపులో జరిగిన గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన యువకుడు (ఫైల్)

- నున్న గ్రామంలోని ఓ వైన్ షాపులో వారం రోజుల క్రితం రెండు వర్గాలు బాహాబాహీకి దిగి రోడ్లపై తన్నుకున్నాయి. ఈ ఘటనలో ఓ వర్గంపై స్థానిక పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అదే రోజు మద్యం తాగిన మరో రెండు వర్గాలు తన్నుకున్నాయి. ఈ పంచాయితీ కూడా సంబంధిత స్టేషన్‌కు వచ్చింది. సదరు వైన్ షాపు పరిసర ప్రాంతాలు మొత్తం గాజు సీసాలు, గ్లాసులతో నిండిపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది.
- పాతపాడు వైన్ షాపు వద్ద పరిస్థితులు మరీ అధ్వానంగా ఉంటున్నాయి. ఇక్కడ ఏకంగా నిర్వాహకులు మూడు అనధికారిక పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసి మందుబాబులను మిగతా 6లో..

12 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలు

నేడు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదానం ● నాటక రంగ కళాకారులకు అరుదైన గౌరవం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నాటక రంగ అభివృద్ధికి విశేషంగా సేవలందించిన కళాకారులను గౌరవించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మక కందుకూరి విశిష్ట పురస్కారాలను ప్రకటించింది. ఈ ఏడాదికి గాను రాష్ట్రస్థాయిలో ముగ్గురికి, జిల్లాస్థాయిలో 110 మందికి ఈ అవార్డులు దక్కాయి. రాష్ట్ర అవార్డు గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున, జిల్లాస్థాయి అవార్డు గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున బహుమానాన్ని అందజేస్తారు. ఈ పురస్కారాల ఎంపికకు నాటకరంగ ప్రముఖులతో కమిటీని ప్రభుత్వం నియవించింది. బుర్రా సాయిమాధవ్ అధ్యక్షతన, గుమ్మడి గోపాలకృష్ణ, పాటిబండ్ల ఆనందరావు, చిక్కాల బాలాజీ, కేకేఎల్ స్వామి, బాలాజీ నాయక్, దాసరి చలపతిరావు (గంగోత్రి సాయి), జి.పద్మజ, బుద్దాల వెంకటరామారావు సభ్యులుగా ఉన్నారు. ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్ల సభ్యుడిగా, సమన్వయకర్తగా వ్యవహరించారు. పురస్కారాలను తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం ప్రదానం చేయనున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి శ్యామనపూడి వెంకటేశ్వరరావు, అగురు త్రినాథ్, వీర్ల వరప్రసాద్‌రావు, సుఖమంచి కోటేశ్వరరావు, హెచ్‌వీఆర్‌ఎస్ ప్రసాద్, బొర్రా నరేన్ ఎంపికయ్యారు. కృష్ణాజిల్లా నుంచి జొన్నలగడ్డ జగన్మోహన్‌రావు, బెత్తిన శివప్రసాద్, గాజులపల్లి కృష్ణ, బి.జయప్రకాష్, ఎన్.ఉదయభాస్కర్, తీట్ల రాజబాబును ఎంపిక చేశారు.

కేంద్ర 16వ ఆర్థిక కమిషన్ బృందం నేడు నగరానికి రాక

- హరిత బెరంపార్క్‌లో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు 8లో



దుర్గగుడి ఘాట్‌రోడ్డులో చోరీ

- కారులో ఉన్న 241 గ్రాముల బంగారం అపహరణ 8లో

అమరావతిలో రహదారులు.. రయ్.. రయ్!

- ఏడీసీఎల్ నేతృత్వంలో రాజధానిలో 38 ప్యాకేజీలతో అభివృద్ధి పనులు
- ఇప్పటివరకు 14 ప్యాకేజీలకు టెండర్లు ఖరారు 6లో
- విశాలమైన రోడ్లు, పచ్చటి చెట్లు, పూల సోయగాలు, పార్కుల అభివృద్ధి

ప్రతి బంగారు కుటుంబానికి బాసట

- ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రణాళికలు
- సమగ్ర సమాచారం ఆధారంగా రూప కల్పనకు కసరత్తు : కలెక్టర్ లక్ష్మీశ 6లో

మే 15 నుంచి బీచ్ కబడ్డీ, జలక్రీడలు

- విస్తృత ఏర్పాట్లపై శాప్ చైర్మన్ రవినాయుడు సమీక్ష 6లో

రైతులతో సయోధ్య!

విజయవాడ వెస్ట్ బైపాస్ వ్యవహారం కొలిక్కి!

- రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే వసంత .. ప్రభుత్వ పెద్దల హామీల వివరాల వెల్లడి
- టవర్ల ఎత్తు పెంపునకు ఓకే, రెండుచోట్ల సింగిల్ టవర్ల ఏర్పాటు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది. ల్యాంకో అలైన్‌మెంట్ వ్యవహారంలో రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టేలను పొందిన సంగతి తెలిసిందే. దీంతో విజయవాడ వెస్ట్ బైపాస్ పనుల్లో స్తబ్దత నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఉన్నతాధికారుల సమావేశంలో బైపాస్ పనులను వేగంగా పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. రైతులు కోర్టుకెళ్లిన అంశాలు కూడా ఈ సందర్భంగా ప్రధానంగా చర్చకు వచ్చాయి. రైతులతో మాట్లాడి వారి సమస్యలు ఏమిటో తెలుసుకుని వారు కోరుకున్న విధంగానే చర్యలు తీసుకుని సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాలని సీఎం ఆదేశించారు. ఈ బాధ్యతలను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు అప్పగించారు. వసంత కృష్ణ ప్రసాద్ ఇటీవల అమెరికా నుంచి తిరిగి వచ్చారు. జక్కంపూడి, నున్న, నైనవరం రైతులను పిలిపించి మాట్లాడారు. తొలగించాల్సిన లైన్‌కు సంబంధించి అలైన్‌మెంట్ మార్చటంపై రైతులు విస్మయం వ్యక్తం చేశారు. ఆ వివాదాల జోలికి మీరెళ్లవద్దని వసంత రైతులకు సూచించారు. ఆ వ్యవహారాలన్నీ న్యాయస్థానాల పరిధిలో ఉన్నందున.. అవి చూసుకుంటాయని స్పష్టం చేశారు. రైతుల పరంగా ఉన్న ఇబ్బందులేమిటని అడగ్గా.. అలైన్‌మెంట్ మార్చవద్దని, జక్కంపూడి దగ్గర టవర్లను ఎత్తు పెంచితే సరిపోతుందని.. ఎవరికీ ఇబ్బందులు లేవని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సుముఖంగా ఉందని తెలిపారు. సాధారణ టవర్లు కాకుండా.. సింగిల్ టవర్లను రెండు చోట్ల ఏర్పాటు చేయాలని మిగతా 6లో..

టాయ్ లైబ్రరీ!

23న సర్వోత్తమ గ్రంథాలయంలో ప్రారంభం

జూన్ 10 వరకు సాయంత్రం 4.00 నుంచి 6.00 గంటల వరకు..

నాలుగు నుంచి 12 ఏళ్ల వయస్సు వారి కోసం ఏర్పాటు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో రోజురోజుకు తగ్గిపోతున్న పఠనాసక్తిని పెంచి గ్రంథాలయాల వైపు వారిని ఆకర్షితులను చేసేందుకు సర్వోత్తమ గ్రంథాలయం నడుం బిగించింది. బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ గ్రంథాలయ భవనంలో ఈ నెల 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా టాయ్ లైబ్రరీని ప్రారంభించనుంది. చిన్నారులు వేసవి సెలవుల్లో ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపేందుకు టాయ్ లైబ్రరీ దోహదపడుతుంది. ఇందులో చిన్నారుల కోసం 25 రకాల ఇన్‌డోర్ గేమ్స్‌ను ఉచితంగా టాయ్స్ రూపంలో ఉంచనున్నారు. డ్రాప్ గేమ్, సార్ట్ గేమ్, కలర్‌ఫుల్ గేమ్, గో ఫ్రాగ్గీ గో గేమ్, రైడ్ విత్ రామా, క్యాచ్ ఏ ఫిష్ తదితర మొత్తం 25 రకాల గేమ్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. ఈ టాయ్ లైబ్రరీలో ఈ నెల 23 నుంచి జూన్ 10వ తేదీ వరకు నాలుగు సంవత్సరాల నుంచి 12 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులు ప్రతిరోజు సాయంత్రం 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు టాయ్స్‌తో ఆడుకోవచ్చు. మిగిలిన రోజుల్లో ప్రతి శనివారం, ఆదివారం సాయంత్రం 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు టాయ్ లైబ్రరీకి వచ్చి ఇన్‌డోర్ గేమ్స్‌ను ఆడుకోవచ్చు. కాగా, తల్లిదండ్రులు తమ పిల్లలను టాయ్ లైబ్రరీకి పంపి గ్రంథాలయాలకు వచ్చే అలవాటును పెంచాలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద ఈ సందర్భంగా కోరారు.



అధికారులతో సమీక్షిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

మే 15 నుంచి బీచ్ కబడ్డీ, జలక్రీడలు

» విస్తృత ఏర్పాట్లపై శాప్ చైర్మన్ రవినాయుడు సమీక్ష

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడిలో మే15 నుంచి 18వరకు మంత్రి కొల్లు రవీంద్ర పర్యవేక్షణలో జరిగే బీచ్ ఫెస్టివల్‌లో క్రీడాస్ఫూర్తి ప్రతిబింబించేలా జాతీయస్థాయి కబడ్డీ, జలక్రీడలను నిర్వహించాలని అధికారులకు శాప్ చైర్మన్ రవినాయుడు సూచించారు. శాప్ కార్యాలయంలో మంగళవారం వివిధ జిల్లాల డీఎస్డీవోలు, కబడ్డీ, కెనాయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ల నిర్వాహకులతో క్రీడల నిర్వహణపై సమీక్షసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాపోటీలను సమర్థవంతంగా, పక్కా ప్రణాళికతో నిర్వహించాలని, దానికోసం క్రీడా అసోసియేషన్లతో పాటు డీఎస్డీవోలందరూ సమష్టి కృషితో పనిచేయాలన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. బీచ్ లో క్రీడాకోర్టులకు అనువైన ప్రాంతాలను తక్షణమే గుర్తించాలని, క్రీడా పరికరాలు, టెక్నికల్ టీమ్, కోచ్‌లు, రిఫరీలు, వలంటీర్లను సన్నద్ధం చేయాలని, ముఖ్యంగా ట్రాన్స్‌పోర్ట్, పోలీసింగ్, ఫైర్, మెడికల్ క్యాంపులపై దృష్టి సారించాలన్నారు. ఫెస్టీవల్ విజయవంతానికి విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు.

● క్రీడల్లో అత్యుతమ ప్రదర్శన కనబరిచి దేశఖ్యాతిని పెంపొందించడమే క్రీడాకారులు అజెండాగా పెట్టుకోవాలని, తద్వారా లక్ష్యాలను వేగంగా చేరుకోగలరని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. మంగళవారం తనను కలిసిన పలువురు క్రీడాకారులను శాప్ చైర్మన్ ప్రత్యేకంగా అభినందిస్తూ సత్కరించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక రుణాల దరఖాస్తుకు ఆన్‌లైన్ సేవలు ప్రారంభమయ్యాయని అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 10 వరకు ఆన్‌లైన్‌లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. లబ్ధిదారుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారై కులధ్రువీకరణ పత్రం ఉండాలి. రాష్ట్రానికి చెంది ఉండి వయస్సు 21 నుంచి 50 మధ్య ఉండాలి. లబ్ధిదారుడు దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. జనరిక్ ఫార్మసీ పథకాలకు సంబంధిత ఫార్మసీ సర్టిఫికెట్లు ఉండాలి. ఆధార్, రేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రవాణా కోసం డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని అధికారులు తెలిపారు.

చంద్రబాబు ఆలోచనా విధానం మారాలి



» మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రాజధాని విస్తరణకు మళ్లీ 44 వేల ఎకరాల భూసమీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తప్పుబట్టారు. ఇప్పటికే 58 వేల ఎకరాలు ఉండగా మరలా భూసేకరణ ఎందుకని ప్రశ్నించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. సామాన్య ప్రజల అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూరేలా వ్యవహరించడం వల్ల ప్రజల్లో అసంతృప్తి చెలరేగి మరలా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదే జరిగితే రాష్ట్రం బీహార్ కంటే దారుణంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రాధాన్యతా అంశాలపై చంద్రబాబు తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలన్నారు. 1996 నుంచి 2004 వరకు చంద్రబాబు పరిపాలన బాగుందని, ఆయన తీసుకున్న నిర్ణయాలు స్పష్టంగా ఉండేవని ఆ పరిస్థితి ప్రస్తుతం లేదని విమర్శించారు.

అన్ని విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్స్

కలెక్టరేట్ : మాదకద్రవ్యాల రహిత ఎన్టీఆర్ జిల్లా సాకారానికి సమన్వయ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమష్టి కృషి అవసరమని, మాదకద్రవ్యాల దుష్పరిణామలపై అవగాహన కల్పించేందుకు మత్తు పదార్థాలు వినియోగిస్తున్న వారిని గుర్తించి, సక్రమ మార్గంలో నడిపించేందుకు అన్ని విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటయ్యేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. నషా ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలు తదితరాలపై మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో, విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు విద్యాసంస్థల్లో క్యాంపస్ అంబాసిడర్లను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, సమన్వయ శాఖల అధికారులతో కలిసి ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.

బఫర్ జోన్ రగడ!

(5వ పేజీ తరువాయి)

మీద ఉమ్మడి కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల నిర్మాణ రంగం ఆధారపడి ఉంది. ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మంది జీవనోపాధి పొందుతున్నారు. పరిటాలలో రాతి క్వారీలు ఎక్కువగా ఉన్నాయి. వీటి లీజుదారులు రాతిని తవ్వటం కోసం బ్లాస్టింగ్స్ చేస్తారు. ఆ తర్వాత క్రషింగ్ జరుగుతుంది. ఇలాంటి క్వారీలను కానీ, క్రషింగ్ యూనిట్లను చట్టబద్ధంగా సురక్షిత ప్రాంతాలలోనే నిర్వహించాలి. ఈ ప్రాంతాన్ని సురక్షితమైన ప్రాంతంగా ఆనాడు గుర్తించటం ద్వారా అప్పట్లో క్వారీ లీజులకు, స్టోన్ క్రషింగ్ యూనిట్లకు అనుమతులు ఇవ్వటం జరిగింది. కాలక్రమంలో సమస్యలు వస్తాయన్న ఉద్దేశ్యంతో ఈ ప్రాంతాన్ని మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని ఎప్పటి నుంచో స్టోన్ క్రషర్స్ నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు.

గతంలోనూ వివాదాలు.. హైకోర్టుకు క్రషర్స్ నిర్వాహకులు


క్వారీలు, క్రషర్స్ యూనిట్లను ఆనుకుని ఉన్న భూములను నివాస ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు గతంలో కూడా కొంతమంది వ్యక్తులు ప్రయత్నించారు. ఆ సందర్భంలో జీవోఎంఎస్ నెంబర్ 74 ప్రకారం మినరల్ బేరింగ్ ప్రాంతాలను పరిరక్షించాలని సీఆర్‌డీఏను ఆదేశించాలని కోరుతూ క్వారీ యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై క్వారీ, క్రషింగ్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించవద్దని మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేయటం జరిగింది.

బడా వ్యక్తుల నాన్ లే అవుట్లు

పరిటాల సర్వే నెంబర్ 801, దాని పరిసర ప్రాంతాల్లో మైనింగ్, క్రషింగ్ అధికారమైనపుడు.. వాటి పక్కనే వెంచర్లకు ఎవరూ అనుమతులు ఇవ్వకూడదు. అలా ఇస్తే.. ఇక్కడ ప్లాట్లు కొన్నవారు కాలుష్యం బారిన పడతారు. ఏశాఖ కూడా పట్టించుకోకపోవటంతో మైనింగ్ బఫర్ జోన్ పరిధిలో ఇటీవల కాలంలో వెంచర్లు వెలుస్తున్నాయి. కొంతమంది బడా వ్యక్తులు అధికార బలంతో నాన్ లే అవుట్లు వేస్తున్నారు. క్రషర్స్‌కు అత్యంత సమీపంలో ఈ వెంచర్లు వేస్తున్నారు. వీటికి సీఆర్‌డీఏ అనుమతి కూడా లేదని తెలుస్తోంది. సీఆర్‌డీఏ అనుమతి లేకుండా కేవలం నాన్ లే అవుట్లుగా వీటిని అభివృద్ధి చేస్తున్నారు.

నిర్మాణ రంగంపై ప్రభావం

పరిటాలలో క్రషర్స్ యూనిట్ల ద్వారా ఉత్పత్తి అవుతున్న రోడ్డు మెటల్, బిల్డింగ్ మెటల్ కోస్తా జిల్లాల నిర్మాణ రంగ అవసరాలను తీర్చుతోంది. సీఆర్‌డీఏ పరిధిలో ఎక్కడ నిర్మాణానికైనా ఇక్కడి నుంచే ఎగుమతులు జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో అమరావతి రాజధాని నిర్మాణ పనులకు కూడా ఇక్కడి నుంచే కంకర సరఫరా అవుతుంది. క్వారీల పక్కన నివాసాలకు అనుమతిస్తే.. రేపు ప్రజలు కాలుష్యమంటూ వాటిని తరలించాలని తిరుగుబాటు చేసే పరిస్థితి వస్తుంది. అప్పుడు బిల్డింగ్, రోడ్డు మెటల్‌ను అందించే క్రషర్స్ సంస్థలు మూసివేసుకోవాల్సి వస్తుంది. ఇదే జరిగితే మెటల్‌ను దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి దుస్థితి ఏర్పడుతుంది.



అమరావతిలో రహదారులు..

రయ్.. రయ్!

» ఏడీసీఎల్ నేతృత్వంలో రాజధానిలో 38 ప్యాకేజీలతో అభివృద్ధి పనులు

» ఇప్పటివరకు 14 ప్యాకేజీలకు టెండర్లు ఖరారు


» విశాలమైన రోడ్లు, పచ్చటి చెట్లు, పూల సోయగాలు, పార్కుల అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) నేతృత్వంలో రాజధానిలో మొత్తం 38 ప్యాకేజీలలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. వీటిలో ప్రస్తుతం 14 ప్యాకేజీలలో టెండర్లు పిలవటం జరిగింది. మిగిలిన 24 ప్యాకేజీల పనులు ఇంకా ప్రణాళిక దశలో ఉన్నాయి. ఏడీసీఎల్ పిలిచిన 14 టెండర్లకు సంబంధించి చూస్తే.. తొలి మూడు ప్యాకేజీలు వరద నియంత్రణకు సంబంధించి పనులు చేపడుతుండగా.. మిగిలినవన్నీ మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాజధానిలో నిర్మిస్తున్న రోడ్లన్నీ సువిశాలమైన ఆరు వరుసల రహదారుల స్థానంలోనే ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులు కూడా కలిసి ఉన్నాయి. వీటిలో సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, అవెన్యూ ప్లాంటేషన్ అభివృద్ధి, తాగునీటి సదుపాయం కోసం వాటర్ సప్లై నెట్‌వర్క్, మురుగునీటి నిర్వహణ కోసం సీవరేజ్ నెట్‌వర్క్, ఎక్కడ పడితే అక్కడ విద్యుత్, ఇంటర్‌నెట్, కేబుల్ వైర్లు కనిపించకుండా భూగర్భంలోనే యుటిలిటీ డక్ట్స్, రీయూజ్ వాటర్ లైన్లు, స్ట్రీట్ ఫర్నిచర్ వంటివి చేపట్టాల్సి ఉంటుంది.

ప్యాకేజీల వారీగా ఖర్చు ఇలా..

ప్యాకేజీ-7లో భాగంగా ఈ-6 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 452.96 కోట్లు, ప్యాకేజీ-8లో భాగంగా ఈ-8 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 522.92 కోట్లు, ప్యాకేజీ-9లో భాగంగా ఎన్-11 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 419.85 కోట్లుప్యాకేజీ-10లో భాగంగా ఈ-9 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ.490.87 కోట్లు, ప్యాకేజీ-11లో భాగంగా ఈ-14 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ.350.07 కోట్లు, ప్యాకేజీ-12లో భాగంగా ఎన్-12 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 614.56 కోట్లు, ప్యాకేజీ-13లో భాగంగా ఎన్-6 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ.232.86 కోట్లు, ప్యాకేజీ-14లో భాగంగా ఈ-5 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 807.75 కోట్లతో నిర్మిచేందుకు ఏడీసీఎల్ టెండర్లు పిలవటం జరిగింది. ఇవికాకుండా ప్యాకేజీ-4 పనులకు నిర్మాణ వ్యయం రూ.522.39 కోట్లు, ప్యాకేజీ-5 పనులకు నిర్మాణ వ్యయం రూ.98.17



కోట్లు, ప్యాకేజీ-6లో భాగంగా ముఖ్యమైన మౌలిక సదుపాయాలతో ఎన్-15 రహదారి నిర్మాణ వ్యయం రూ.482.12 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు పిలిచింది.

పచ్చదనం అభివృద్ధి..

రాజధానిలో పచ్చదనం అభివృద్ధికి ఒక్కో రహదారికి రూ.5 కోట్ల చొప్పున మొత్తం 35 రోడ్లకు గాను రూ.175 కోట్లను ఖర్చు చేయాలని ఏడీసీఎల్ నిర్ణయించింది. అమరావతిలో రోడ్లపై సెంట్రల్ డివైడర్‌తో పాటు రెండు వైపులా అత్యద్భుతమైన పూల మొక్కలు కనిపించేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. అమరావతిలో రూ.25 కోట్ల వ్యయంతో ఆధునిక థీమ్ పార్కులను నిర్మించటానికి సీఆర్‌డీఏ సన్నద్ధమౌతోంది.

ఇసుక కొరత రానీయకండి

» స్టాక్ యార్డ్‌ల్లో 10 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు సిద్ధం చేయాలి

» సరఫరాలో అలసత్వం వహించే ఏజెన్సీలను బ్లాక్‌లిస్టులో పెడతాం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజావసరాలను, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో వున్న ఇసుక స్టాక్ యార్డ్‌ల్లో 10 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలను సిద్ధం చేసి, కొరతకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలో ఇసుక సరఫరా, నిల్వలపై మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాజధాని పనులు వేగవంతం కావడంతో చుట్టుపక్కల గ్రామాలతో పాటు జిల్లావ్యాప్తంగా ప్రజలు నిర్మాణ పనులను చేపట్టం జరిగిందన్నారు. ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని రానున్న వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా స్టాక్ యార్డుల్లో 10లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలను సిద్ధంగా వుంచాలన్నారు. జిల్లాలోని అలూరుపాడు, ఏటూరు, కంచెల్ల, కీసర, ఇబ్రహీంపట్నం వద్ద వున్న స్టాక్ యార్డుల్లో ఇసుక నిల్వలను వుంచేలా అధికారులు, సరఫరా ఏజెన్సీలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. మే 31వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో ఇసుక నిల్వలు వుంచాలన్నారు. ఇందుకుగాను ప్రతి రోజు 200లకు పైగా లారీలు ఇసుకను స్టాక్ పాయింట్‌లకు సరఫరా చేయాల్సి వుంటుందన్నారు. స్టాక్ పాయింట్ వద్ద ఇసుక నిల్వలను సంబంధిత తహసీల్దార్లు ప్రతిరోజు పర్యవేక్షించి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాలో రావిరాల, మల్కాపురం, ఏటూరు, మున్నలూరు, సైదాపురం, గని ఆత్కూరు, దాములూరు ప్రాంతాల్లో మరో ఏడు రీచ్‌లను గుర్తించడం జరిగిందని ఆయా రీచ్‌ల్లో ఇసుకను సేకరించేలా పర్యావరణ అనుమతులకు ప్రతిపాదనలు పంపాలని మైనింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. స్టాక్ యార్డులలో ఇసుక సరఫరా, నిల్వల వివరాలు ప్రదర్శించడంతో పాటు ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్లలో ఎటువంటి అనధికార కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్టు తన దృష్టికి వస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇటీవల అధిక వర్షం కారణంగా జగ్గయ్యపేట ప్రాంతంలో రైతుల భూముల్లో వరద నీరు ప్రవేశించి ఇసుక మేటలు వేయడం జరిగిందని, వాటిని తొలగించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదికను సమర్పించాలని నందిగామ రెవెన్యూ అధికారి ఎం.బాలకృష్ణను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గనులశాఖ డీడీ ఎ.శ్రీనివాసరావు, ఏడీ కె.వీరాస్వామి, ఆర్ఐ కె.శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ కె.ఖ్యాతి, ఎం.బాబురావు, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, వత్సవాయి, చందర్లపాడు, నందిగామ, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఉల్లాస్ లక్ష్యాలపై దృష్టి పెట్టండి

» మే 5 నుంచి సెప్టెంబరు వరకు అక్షరాస్యత కార్యక్రమాలు



కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పదిహేనేళ్లకు పైబడిన వారిలో నిరక్షరాస్యులను గుర్తించి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత పెంపొందించేందుకు ఉద్దేశించిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమ లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉల్లాస్ కార్యక్రమ అమలుపై కలెక్టర్ అధ్యక్షతన పాఠశాల, వయోజన విద్య, డీఆర్‌డీఏ, గ్రామ-వార్డు సచివాలయాలు, ఐసీడీఎస్, సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉల్లాస్ పథకం లక్ష్యాల సాధనకు అధికారులు కృషిచేయాలని సూచించారు. నిరక్షరాస్యులైన స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయాలు, కుక్‌లు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్వాడీ సహాయకులు తదితరులను గుర్తించి, అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఉల్లాస్ కార్యక్రమం కింద ఈనెల 16 నుంచి ఆరురోజుల పాటు సర్వేచేసి నిరక్షరాస్యులను గుర్తించాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో మండల అధికారులకు, మండల స్థాయిలో వాలంటీర్ ఉపాధ్యాయులకు శిక్షణ అనంతరం మే 5వ తేదీ నుంచి సెప్టెంబరు వరకు అక్షరాస్యత కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. సమావేశంలో ఉల్లాస్ నోడల్ అధికారి జి.ప్రసాదరావు, డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

22 వరకు పోషణ్ పఖ్వాడా

కలెక్టరేట్ : ఈనెల 8 నుంచి 22 వరకు నిర్వహించనున్న 7వ పౌష్టికాహార పక్షోత్సవం (పోషణ్ పఖ్వాడా) సందర్భంగా స్పెషల్ డ్రైవ్ కింద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ వివిధ శాఖల అధికారుల తో కలిసి పోషణ్ పఖ్వాడా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులు, మహిళల్లో ఆరోగ్యకరమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ప్రత్యేక బృందాలు ఇంటింటికీ సందర్శించాలని, పోషకాహారంపై ర్యాలీలు, సమావేశాలు తదితరాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి బంగారు కుటుంబానికి బాసట

» ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రణాళికలు

» సమగ్ర సమాచారం ఆధారంగా రూపకల్పనకు కసరత్తు

» కీలక ప్రక్రియల్లో జిల్లా అధికారుల పాత్ర కీలకం : కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీ4 సర్వే ఆధారంగా గుర్తించిన ప్రతి బంగారు కుటుంబానికి ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు కృషిచేయడం జరుగుతోందని, ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో సమాచారాన్ని సేకరించడంలో జిల్లాస్థాయి, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బంగారు కుటుంబాలు-మార్గదర్శుల అనుసంధానం, బంగారు కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా పీ-4 విధానం అమల్లో భాగంగా గుర్తించిన బంగారు కుటుంబాల సమగ్రాభివృద్ధికి మార్గదర్శులతో అనుసంధానం చేయాల్సిన అవసరముందని ప్రతి బంగారు కుటుంబ స్థితిగతులు, అందుబాటులో వున్న వనరులు, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయం, మార్గదర్శుల నుంచి అవసరమయ్యే వనరుల మద్దతు తదితరాలతో ప్రతి బంగారు కుటుంబానికి స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించి, అమలు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో తొలిదశలో గుర్తించిన సచివాలయాల పరిధిలోని 2,260 బంగారు కుటుంబాల్లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ప్రతి బంగారు కుటుంబాన్ని సందర్శించి 18 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని తీసుకోవాలని, వీటి ఆధారంగా అధికారులు నివేదికలు రూపొందించి, సమర్పించాలన్నారు. డీఎల్‌డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. తర్వాతి దశలో తలసరి ఆదాయం (పీసీఐ), జిల్లా స్థూల రాష్ట్రీయోత్పత్తి (జీడీడీపీ), ప్రతి రంగంలోనూ స్థూలవిలువ జోడింపు (జీవీఏ)లో వృద్ధికి ప్రణాళికాయుత చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, విజయవాడ, తిరువూరు డీఎల్‌డీవోలు హాజరయ్యారు.

భూ సమీకరణ!

(5వ పేజీ తరువాయి)

నుంచి, ఇతర ఆర్థిక సంస్థలు కలిపి మొత్తంగా మరో రూ.55 వేల కోట్ల వరకు నిధులు సమీకరించాలని భావిస్తోంది.

విమానాశ్రయంతో సత్వర ఆర్థికాభివృద్ధి!

రాజధాని నగరంలో సత్వర ఆర్థికాభివృద్ధి సాధించే ప్రాజెక్టుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధానమైంది. దీనివల్ల వ్యాపార, వాణిజ్యాభివృద్ధి జరుగుతుంది. మల్టీనేషన్ కంపెనీల కార్యాలయాలు, కర్మాగారాలు ఏర్పాటు చేయటానికి దోహదపడుతుంది. ఎగుమతి, దిగుమతులను పెంపొందిస్తుంది. విమానాశ్రయం వల్ల మౌలిక సదుపాయాలు కూడా గణనీయంగా అప్‌గ్రేడ్ అవుతాయి. రోడ్లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు వంటివి అభివృద్ధి చెందుతాయి. కార్గో, లాజిస్టిక్ హబ్‌గా, పండ్లు, పూలు, ఔషధాల ఎగుమతులకు దోహదపడుతుంది. స్థానికంగా రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతుంది. భూములు 300 నుంచి 500 శాతం వరకు పెరుగుతాయన్నది అంచనా. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఐదు వేలఎకరాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీతో అనేక ప్రయోజనాలు

టెక్నాలజీ ఆధారిత పారిశ్రామిక నగరాన్ని స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ అంటారు. ఇందులోని పరిశ్రమలు డిజిటల్‌గా ఇంటిగ్రేట్ అయి ఉంటాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) ద్వారా ఉత్పాదకతను పెంచడం, గ్రీన్ ఎనర్జీ అంటే సౌర, పవన శక్తి, వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలు ఉంటాయి. అలాగే, ఇవన్నీ కూడా రోడ్లు, రైల్వేస్టేషన్, విమానాశ్రయానికి అనుసంధానం (మల్టీమోడల్ కనెక్టివిటీ)గా ఉంటాయి. స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ వల్ల భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించవచ్చు. తద్వారా ఉద్యోగాల సృష్టి ఎక్కువగా జరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు మంచి ప్రోత్సాహం ఇస్తుంది. అందుకే ఈ ప్రాజెక్టు కోసం 2,500 ఎకరాలను సమీకరించాలని నిర్ణయించింది.

స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుతో పర్యాటక రంగ అభివృద్ధి

స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుకు కూడా భూములను సమీకరించాలని నిర్ణయించింది. స్పోర్ట్స్ సిటీ వల్ల కూడా అమరావతి సత్వరాభివృద్ధికి దోహదపడుతుంది. స్పోర్ట్స్ సిటీ అనేది క్రీడలు, ఫిట్‌నెస్, వినోద కేంద్రంగా ఉంటుంది. ప్రపంచ స్థాయి క్రీడా స్టేడియాలు, ట్రైనింగ్ అకాడమీలు, స్పోర్ట్స్ మ్యూజియాలు, ఫిట్‌నెస్ సెంటర్లు, హోటళ్ల రిటైల్ మాల్స్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, ఆటగాళ్లు, కోచ్‌ల రెసిడెన్షియల్ జోన్లు ఉంటాయి. ఈ స్పోర్ట్స్ సిటీ వల్ల కూడా పర్యాటక రంగం, రియల్ ఎస్టేట్ బూమ్, స్థానిక వ్యాపారం పెరగటం, ఉద్యోగాల కల్పన పెద్ద ఎత్తున జరుగుతుంది.

అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతం పరిశీలన

ఈ మూడు ఎకనమిక్ బూస్ట్ ప్రాజెక్టులకు ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్యన భూములు సమీకరిస్తేనే సార్థకత ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మల్టీ మోడల్ కనెక్టివిటీ సాధించాలంటే.. ఈ ప్రాంతమే మంచిదని యోచిస్తోంది. అమరావతి నూతన రైల్వే లైను కూడా మంజూరైన సంగతి తెలిసిందే. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు రైల్వేలైన్ వెళ్తుంది. దీనికోసం 800 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. ఈ భూములను కూడా అమరావతిలో వైకుంఠపురం, ఎంద్రాయి, కర్లపూడి, తాడికొండ గ్రామాల్లో సేకరించాల్సి ఉంటుంది. సీఆర్‌డీఏ ద్వారా ఇక్కడి భూములను సమీకరించి ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఎయిర్‌పోర్టు కోసం భూములు ఎక్కడ తీసుకోవాలన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. ఎయిర్‌పోర్టు ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఏఏఐ అధికారులతో చర్చించాక కానీ ఓ స్పష్టత రాదు. ఎయిర్‌పోర్టు అవసరాల కోసం తుళ్లూరు మండలంలోని వడ్డమాను, పెద్దపరిమి, హరిశ్చంద్రపురం, తాడికొండ మండలంలోని మోతడక గ్రామాల్లో భూ సమీకరణ ద్వారా భూములను తీసుకోవాలనుకుంటున్నారు.

మరో 30 వేల ఎకరాలపై దృష్టి

అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులన్నీ పూర్తయ్యాక రాజధాని విస్తరణ ప్రక్రియను ప్రారంభించాలన్నది ప్రభుత్వ ఆలోచన. గవర్నమెంట్ కాంప్లెక్స్ పనుల్లో ఐకానిక్ టవర్లు మినహా మిగిలినవన్నీ రెండేళ్లలో పూర్తవుతాయి. మిగిలిన 30 వేల ఎకరాలను రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల కోసం, అనేక భాగస్వామ్య సంస్థలకు కేటాయించేందుకు వీలుగా సమీకరించాలన్న ఆలోచన జరుగుతోంది. దేశంలోనే పేరెన్నికగన్న రియల్ ఎస్టేట్ అండ్‌డెవలపింగ్ సంస్థలను కూడా ఇప్పటికే ఆహ్వానించారు.ఇలాంటి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల న్నిం టికీ అవసరమైన భూములను సమీకరించాలని, నిధులను కూడా సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

తాగుతున్నారు..

(5వ పేజీ తరువాయి)

ఆకర్షించేందుకు బల్లలు, ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ మద్యం తాగడానికి వచ్చే వారి వాహనాలతో కండ్రిక, పాతపాడు రోడ్డు తిరునాళ్లను తలపిస్తోంది.

● అంబాపురం పంచాయతీ పరిధిలోని పైపుల రోడ్డు వద్ద ఉన్న వైన్ షాపు వద్ద రోజు ఘర్షణ వాతావరణమే కనిపిస్తోంది. గత నెల పాయకాపురం శాంతినగర్‌కు చెందిన రెండు వర్గాలు బాహాబాహీకి దిగి బీరుబాటిళ్లతో దాడులు చేసుకున్నాయి. ఇదే ఘటనలో ఓ యువకుడు తన ద్విచక్రవాహనం నుంచి కత్తిని తీసి హల్‌చల్ చేయడంతో ఇన్నర్ రింగ్ రోడ్డపై ప్రయాణికులు సైతం హడలిపోయారు. ఇది జరిగిన వారానికి మద్యం తాగడానికి వచ్చిన కొందరు స్నేహితులు మద్యం మత్తులో రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు భీకరంగా దాడులు చేసుకున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు!

మద్యం షాపుల వద్ద ఇంత జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు మాత్రం తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఐదు నెలలుగా ఈ తతంగం జరుగుతున్నా అధికారులకు తెలియకపోవడం గమనార్హం. షాపుల నిర్వాహకులే సీసీ కెమెరాలు పెట్టి మరీ మద్యం తాగించడం ఇక్కడ విశేషం. అదే సీసీ కెమెరాల ఫుటేజ్‌లు తీసుకుని మరీ ఘర్షణలు పడినవారిపై పోలీసులు కేసులు నమోదు చేయడం మరో విశేషం. సీసీ కెమెరాల్లో స్పష్టంగా మద్యం తాగిస్తున్నట్లు కనిపిస్తున్నా అవేమి పట్టించుకోకుండా కేవలం కేసుల నమోదుకు మాత్రమే సీపీ ఫుటేజ్‌లను వాడుకోవడం గమనార్హం.

షాపుల వద్ద మద్యం తాగిస్తే చర్యలు : ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరెడ్డి

వైన్ షాపుల వద్ద మద్యం తాగకూడదని బోర్డులు ఏర్పాటు చేశాం. నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాపుల నిర్వాహకులు మద్యం తాగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

మునేటిలో మునిగి బాలుడు మృతి



మృతుడు శివ సాయికృష్ణారెడ్డి

నందిగామ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకూ స్నేహితులతో సరదాగా ఆడుకుంటున్న బాలుడు మునేటిలో దిగి మృతి చెందిన ఘటన నందిగామలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం.. పట్టణానికి చెందిన సాంబుల శివసాయి కృష్ణారెడ్డి(10) స్థానిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాల నుంచి ఇంటికి వస్తూ స్నేహితులతో కలిసి ఆడుకుంటూ మునేటి వద్దకు వెళాడు. నలుగురు విద్యార్థులు నీటిలోకి దిగారు. మునేటిలో ఇసుక గుంతలో శివసాయి కృష్ణారెడ్డి పడిపోగా మిగిలిన ముగ్గురు కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకొని శివసాయి కృష్ణను నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. బాలుడి తండ్రి రామకృష్ణారెడ్డి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బాలుడి మృతి ఆ ఇంట తీవ్ర విషాదాన్ని నింపింది.

చెరువులో పడి ..

పామర్రు : మంచినీటి చెరువులో మునిగి వ్యవసాయ కూలీ మృతిచెందిన ఘటన జుజ్జవరంలో చోటుచేసుకుంది. మచిలీపట్నం-విజయవాడ ప్రధాన రహదారి పక్కన జుజ్జవరం గ్రామ పంచాయతీ మంచినీటి చెరువులో ప్రమాదవశాత్తు పడి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ దనికొండ నాంచారయ్య (60) మంగళవారం దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య ఉన్నారు.

రైతులతో సయోధ్య!

(5వ పేజీ తరువాయి)

రైతులు కోరగా.. ఎమ్మెల్యే దీనికి కూడా అంగీకరించారు. దీంతో రైతులు తాము సహకరిస్తామని చెప్పారు. దీంతో సమస్య పరిష్కారమైంది. ల్యాంకో లైన్ వివాదంలో ఉన్న సంగతి తెలిసిందే. దీని పనులు ఎవరు చేస్తారన్నది ఆసక్తిగా ఉంది. సహజ న్యాయసూత్రం పరంగా చూస్తే ల్యాంకో లిక్విడేటర్ దీనికి ప్రస్తుతం బాధ్యతగా ఉన్నారు. ఈ లైన్‌ను కొన్న మయన్మార్ కంపెనీ పూర్తిగా ల్యాంకో లిక్విడేటర్‌కు డబ్బులు చెల్లించకపోవటంతో .. అది యజమాని కాదు. రాధా అనే సంస్థకు దీనికి ఎలాంటి సంబంధం లేదు. ఇలాంటపుడు సింగిల్ టవర్లను ఏ సంస్థ ద్వారా చేయిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

రామాలయం వద్ద అన్నదానం

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మారుతీనగర్ కోకోకోలా స్ట్రీట్ రామాలయం వద్ద మంగళవారం భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ భక్తులకు భోజనం వడ్డించారు. ఈకార్యక్రమంలో డివిజనల్ అధ్యక్షుడు పడాల గంగాధర్, కార్యదర్శి పునుగుమాటి మోహన్‌రావు, వడ్డేపల్లి కేశవ్, దుర్గారావు, గురునాథం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చంద్రబాబుది సంక్షేమ సర్కార్

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



బడ్డీకొట్టు అందిస్తున్న ఎమ్మెల్యే గద్దె

కృష్ణలంక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అంటేనే సంక్షేమ సర్కార్ అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం తూర్పు పరిధి 21వ డివిజన్ కృష్ణలంక పాత పోలీసు స్టేషన్ రోడ్డులో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. స్థానికులతో మాట్లాడి అక్కడ వున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. డివిజన్‌లోని ఇద్దరికి బడ్డీకొట్టు, ప్లాట్‌ఫాం రిక్షా బండిని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ 4 పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామిక వేత్తలు గ్రామాల్లోని పేద కుటుంబాలను దత్తత తీసుకొనేలా చేస్తున్నారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర బీసీ నాయకుడు గొరిపర్తి నామేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ గత 15 ఏళ్లుగా నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా వుంటూ ఆ పీ4 పథకాన్ని తూర్పులో ఎప్పటి నుంచో అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగారావు, కేశనం భావన్నారాయణ, నిమ్మల జ్యోతిక, పి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి మెరుగు

స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్



ప్రసంగిస్తున్న ఎంఎస్‌ఎంఈ జిల్లా కో-ఆర్డినేటర్ మాడగని గురునాథ్

బెంజిసర్కిల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని మారిస్ స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింత క్వాడ్రస్ అన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఆధ్వర్యంలో కృత్రిమ మేధపవర్ బీఐ అనే అంశంపై మూడు రోజులపాటు విద్యార్థినులకు జరిగే శిక్షణ కార్యక్రమం మంగళవారం మారిస్ స్టెల్లా కళాశాలలో ప్రారంభమైంది. ఈశిక్షణ తరగతులను ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థినులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఎంఎస్ఎంఈ జిల్లా కో-ఆర్డినేటర్ మాడగని గురునాథ్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కళాశాలల్లో కూడా ఈ విధంగా శిక్షణ ఇప్పిస్తామని, అందరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మార్పు ట్రస్ట్ డైరెక్టర్ సుయాజ్, రిసోర్స్‌పర్సన్ రామ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 8గంటల నుంచి 10.30 వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, రామలింగేశ్వర నగర్ విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ రామలింగేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. రఘురోడ్, అయ్యప్ప రోడ్, వి.ఎం.రంగ రోడ్, గాంధీ కాలనీ, ఎర్రపోతుల వారి వీధి, సాయిరాం కటేపీసెస్ రోడ్, నీలవేణి రోడ్, వీఎంఆర్ రోడ్, కృష్ణవేణి రోడ్, కృష్ణవేణి రోడ్, దారా సుధాకర్ శాస్త్రి వీధి, గాయత్రి రోడ్, సాయిస్ట్రీట్, భవానీ రోడ్, రామలింగేశ్వరనగర్, నాగేంద్ర నగర్, 10ఎంజీడీ రోడ్, కళానగర్, ఎలిసమ్మ హోటల్, పూర్ణచంద్రనగర్, పటమటలంక ప్రాంతం, రుత్విక్ అపార్ట్‌మెంట్, జీ-3 అపార్ట్‌మెంట్, శ్రీహర్ష అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు నిల్

- పటమట అంబేడ్కర్‌నగర్ యూపీహెచ్‌సీలో ఆరు బయటే రోగులు
- హాల్లో పేర్చిన మందుల బాక్సులు
- రక్తనమూనాలు సేకరించి ప్రభుత్వాస్పత్రికి పంపుతున్న వైనం



పటమట యూపీహెచ్‌సీ బయట కూర్చున్న రోగులు , ఇరుకుగా మందుల స్టోర్

పటమట,ఆంధ్రజ్యోతి: పటమట అంబేడ్కర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి రోజూ రోగులు పెద్ద సంఖ్యలో వైద్య సేవల కోసం వస్తూ ఉంటారు. పటమట చుట్టు పక్కల పరిధిలో ఇది ఒక్కటే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం. వైద్య సేవల కోసం వచ్చే రోగులకు లోపల స్థలం చాలక బయటే కూర్చుంటున్నారు. స్టోర్ రూంలో ఖాళీ లేక మందుల బాక్స్‌లు ల్యాబ్ పక్కనే హాల్లో పెట్టారు. రక్త నమూనాలు సేకరించి వాటిని కొత్త ప్రభుత్వాసుపత్రికి పంపుతారు. రిపోర్టు కోసం అర్బన్ హెల్త్ సెంటర్‌కు పంపుతారు.



భ్రమరాంబపురంలోని మలేరియా ఆస్పత్రి

అందుబాటులో మలేరియా, అర్బన్ హెల్త్ సెంటర్లు

కృష్ణలంక: కృష్ణలంకలోని 20, 22 డివిజన్లలో వున్న అర్బన్ హెల్త్ సెంటర్లు, మలేరియా ఆస్పత్రి డివిజన్‌లోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో వున్నాయి. 20వ డివిజన్‌లో నిర్మలా శిశుభవన్ వద్ద కొడాలి పున్నయ్య అర్బన్ హెల్త్ సెంటర్‌కు 20, 21 డివిజన్లలో వుండే గర్భిణులు, చిన్నారులు వస్తుంటారు. గర్భిణులకు రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేస్తారు. ఇది ఐదు పడకల ఆస్పత్రి. పిల్లలకు అన్ని రకాల టీకాలను ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వేస్తుంటారు. ఇక్కడ ఒక వైద్యురాలు ఉన్నారు.

సర్కిల్ - 3 పరిధిలో తాగునీటి సరఫరా బంద్ రేపు

వన్‌టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని గవర్నర్‌పేటలో ఉన్న 1137 కేఎల్ సామర్థ్యం కలిగిన తాగునీటి సరఫరా రిజర్వాయర్ - 2 ఔట్‌లెట్ వాల్వ్ పనుల నిమిత్తం గురువారం సాయంత్రం పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఉండదని వీఎంసీ ఇంజనీరింగ్ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ -3 పరిధిలోని 19వ డివిజన్ లబ్బీపేటలోని అమెరికన్ హాస్పటల్ రోడ్డు, అన్నమయ్య రోడ్డు, పున్నమ్మతోట, ఆశ్రమం రోడ్డు, పోలీసు క్వార్టర్స్ ఏరియా ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని తెలిపారు. సర్కిల్ -2 పరిధిలోని 23వ డివిజన్ గవర్నర్‌పేట, సూర్యారావుపేట, 24వ డివిజన్‌లోని న్యూగిరిపురం, కస్తూరిబాయి పేట ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని తెలిపారు. 18న ఉదయం నుంచి యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు నగర పాలక సంస్థ అధికారులకు సహకరించాలని అధికారి కోరారు.

మొబైల్ వ్యసనంతో పిల్లల్లో నిద్రలేమి

ఆరోగ్య సదస్సులో డాక్టర్ టీవీ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సమరం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో మొబైల్ వాడకం వ్యసనంగా మారి వారి వ్యక్తిత్వం దెబ్బతీస్తోందని ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ టీవీ విజయ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక బెంజిసర్కిల్‌లోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో మంగళవారం పిల్లల్లో డిజిటల్ డీ-అడిక్షన్ అనే అంశంపై ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ సమావేశానికి డాక్టర్ జి. సమరం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ మొబైల్ వ్యసనం వల్ల పిల్లల్లో స్థూలకాయం పెరుగుతోందని, ఆటలు తగ్గిపోతున్నాయని, నిద్రలేమి ఏర్పడుతోందని, అనేక రకాలైన ప్రవర్తనా లోపాలు వస్తున్నాయని పేర్కొన్నారు. దీని నివారణకు పెద్దవాళ్లు కూడా మొబైల్ వాడకం తగ్గించుకొని పిల్లలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. పిల్లలకు పుస్తక పఠనాశక్తి చిన్నప్పటి నుంచే పెంపొందించాలని, మెమరీ గేమ్స్ ఆడించాలని, మ్యూజిక్, డ్యాన్సు వంటి వాటిని ప్రోత్సహించాలని డాక్టర్ విజయ్‌కుమార్ సూచించారు.

నలందలో వరల్డ్ ఆర్ట్ డే పోటీలు



గవర్నర్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచకళల దినోత్సవాన్ని పురస్కరించుకుని నలంద విద్యానికేతన్ సెకండరీ విభాగంలో మంగళవారం ఆర్ట్ పోటీలు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ ఆర్ట్ గ్యాలరీ ప్రారంభించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పోటీల్లో పాల్గొన్నారు. స్పాట్ పెయింటింగ్, క్రాఫ్టింగ్, క్లే మౌల్డింగ్ అంశాలలో జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా పోటీలు జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ జి. శ్రీనివాస్ వ్యవహరించారు. విజేతలైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు (డ్యూయల్ జోడీ) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. స్కూల్ ఆర్ట్ టీచర్ చంద్రాని పాల్, వైస్ ప్రిన్సిపాల్ మిసెస్ కుసుమ, ఏవో గౌరి తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లో పార్కింగ్ రుసుము వసూలొద్దు

నగర కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో షాపింగ్ చేయటానికి వెళ్లినా, సినిమా చూడటానికి వెళ్లినా వాహనాలు పార్కింగ్ రుసుము వసూలు చేయరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మొదటి గంట వరకు వాహనదారుల వద్ద ఎటువంటి పార్కింగ్ రుసుము వసూలు చేయరాదని, అరగంటకు మించి గంటలోపు పార్కింగ్ చేసిన వాహనదారుడు, అతను మాల్‌లో షాపింగ్ చేసినట్లు బిల్లు చూపించినట్లయితే పార్కింగ్ రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. గంటకు పైబడి పార్కింగ్ చేసినట్లయితే, షాపింగ్ చేసినా, సినిమా చూసినా ఆ టిక్కెట్, లేదా బిల్లును చూపించినట్లయితే వాహనాల పార్కింగ్ రుసుము చెల్లించనవసరం లేదని వివరించారు.

తాగునీటి పైపులైన్‌లకు సత్వరమే మరమ్మతులు చేయండి

తాగునీటి పైపులైన్‌లకు సత్వరమే మరమ్మతులు చేసి నీటిసరఫరా పునరుద్ధరించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి గుణదల బూస్టర్ వద్ద పైపులైన్ పగలటం వలన విజయనగర కాలనీ, రామాలయం వీధి, ఇంద్రలోక్ ఎస్టేట్, ఈఎస్ఐ హాస్పటల్, పరిసర ప్రాంతాలు, కుమ్మరిబజార్, 1వ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా తాత్కాలికంగా నిలిచిందని కమిషనర్ అన్నారు. పైపులైన్లు సత్వరమే మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయించండి

జిల్లా అధికారులకు ఎంపీ కేశినేని సూచన

వన్‌టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా తడిసిన ధాన్యంతో పాటు తేమ శాతం ఎక్కువ ఉన్న ధాన్యాన్ని నూకలకు మినహాయింపు ఇచ్చి కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం సూచించిన మద్దతు ధర ప్రకారమే సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ.2,300లు, గ్రేడు ఎ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320లు చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. రైతుల వద్ద నుంచి చివరి గింజ వరకు తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

మెకానిక్‌లు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

ఆటోనగర్ మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు



గంధం వెంకటేశ్వరరావుతో వాల్వోలైన్ ఇంజన్ ఆయిల్స్ ప్రతినిధులు

ఆటోనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రంగంలో ఊహించని మార్పులు వస్తున్నాయని, మెకానిక్‌లు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని ఆటోనగర్ మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆటోనగర్‌లోని శ్రీవెంకటేశ్వర మెకానిక్ గ్యారేజీలో మోటారు ఇండియా మ్యాగజైన్, వాల్వోలైన్ ఇంజన్ ఆయిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాపినెస్ ట్రక్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలు ఇంజన్లు బీఎస్ 6లో వస్తున్నాయన్నారు. కృష్ణాజిల్లా లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు నాగమోతు రాజా మాట్లాడుతూ ఇటువంటి మీట్‌ల వల్ల మెకానిక్, డ్రైవర్లలో సమర్థత, భద్రత వంటి అంశాలు మెరుగుపడుతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ మాజీ కార్యదర్శి ఎం.ఎ ఖాలిక్, వి. రాఘవులు, మాధవ లూబ్రికెంట్స్ ప్రతినిధి మేకా రామ్‌లక్ష్మణకుమార్, వాల్వోలైన్ ఇంజన్ ఆయిల్స్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై చంద్రబాబుకు వినతిపత్రం

గాంధీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రా పెన్షనర్ల పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్ పాలంకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్న రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఆర్/పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. పెండింగ్‌లోని మెడికల్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు. క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పాత నిష్పత్తి ప్రకారం 10, 15 శాతం ఇచ్చేందుకు జీవోను విడుదల చేయాలని సీఎంను కోరారు. సీఎస్ ఛైర్మన్‌గా పెన్షనర్ల సమస్యల పరిష్కార కౌన్సిల్ ఏర్పాటుచేసి ప్రతి ఆరు నెలలకోసారి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని సుబ్బరాయన్ కోరారు. ఆయా సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ పురుషోత్తమ నాయుడు, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

చెత్త, వ్యర్థాలతో సైడు కాల్వ



భారతీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సెంటినీ హాస్పటల్ నుంచి లయోలా కళాశాలకు వెళ్లే రోడ్డులో సైడు కాల్వ పలు చోట్ల చెత్త, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో నీరు ప్రవహించే దారి లేకపోవడంతో రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు వల్ల దోమలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా విజృంభిస్తున్నాయి. ఎక్కడ ప్రజలు అనారోగ్యానికి గురవుతారోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సెంటినీ హాస్పిటల్ సమీపంలో చెత్త, వ్యర్థాలతో కాల్వ

డ్రెయినేజీపై రక్షణ ఏదీ?



భారతీనగర్, ఆంధ్రజ్యోతి: భారతీనగర్ నోవాటెల్ సమీపంలోని సర్వీస్ రోడ్డులోని డ్రెయినేజీ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డులో డ్రెయినేజీకి రక్షణగా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలు డ్రెయిన్లో పడిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో రాత్రి సమయంలో రోడ్లో ప్రయాణించడానికి ద్విచక్ర వాహనదారులు భయపడుతున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య

- పిల్లల కోసం వచ్చే వాహనాలు రోడ్డు మధ్యలో నిలిపివేస్తున్న వైనం
- సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వద్ద ట్రాఫిక్ జామ్



రోడ్డు మధ్యలో వాహనాలు

మొగల్రాజపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వద్ద ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మదర్‌థెరెస్సా జంక్షన్ నుంచి సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ మీదుగా జమ్మిచెట్టు, పీవీపీ మాల్ వైపు వెళ్లే వాహనదారులు ఈ రోడ్డు మీదుగా వెళుతుంటారు. ఈ స్కూలుకు వచ్చే విద్యార్థులను ఉదయం వదలడానికి, మధ్యాహ్నం పాఠశాల వదిలినపుడు తీసుకెళ్లడానికి వచ్చే తల్లిదండ్రుల వాహనాలు, ఆటోలు రోడ్డుమీదే రెండు మూడు వరసల్లో నిలిపేస్తుంటారు. పిల్లలను తీసుకెళ్లడానికి వచ్చే తల్లిదండ్రులను, ఆటోవాలాల కోసం ప్రధాన గేటు పక్కనే ఉన్న గేటు నుంచి అనుమతి ఇస్తారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు రోడ్డుమీదే నిలిపేస్తుంటారు. దీంతో ఆటుగా వెళ్లే వారి వాహనాలకు దారి లేక అడ్డుగా ఉన్న వాహనాలు తీసే వరకు నిలిచిపోతున్నాయి. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ జాం అవుతోంది.

పట్టించుకోని పాఠశాల నిర్వాహకులు

ప్రతి రోజు పాఠశాల ముందు ఉత్పన్నమవుతున్న ఈ సమస్యను పాఠశాల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. పిల్లలను దించడానికి, తీసుకెళ్లడానికి వచ్చే వారి వాహనాలను లోపలకు అనుమతించడం లేదు. కనీసం ఉదయం పాఠశాల తెరచినపుడు, మధ్యాహ్నం వదిలినపుడు సిబ్బందిని కూడా ఉంచడం లేదు. వాహనాలకు లోపలికి రావడానికి ఒక మార్గం, బయటకు వెళ్లడానికి ఒక మార్గం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


అమ్మవారికి కానుకగా నెక్లెస్‌ను సమర్పిస్తున్న దాత కుటుంబ సభ్యులు.

దుర్గమ్మకు 30 గ్రాముల బంగారు నెక్లెస్

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : లండన్‌లో స్థిరపడిన తెలుగు కుటుంబానికి చెందిన వి.సీతారామిరెడ్డి పేరిట మంగళవారం ఆయన కుటుంబ సభ్యులు విచ్చేసి 30.500 గ్రాముల బంగారు నెక్లెస్‌ను దుర్గమ్మకు కానుకగా సమర్పించారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి, వేద పండితుల ఆశీస్సులు అందజేశారు. అధికారులు లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం బహూకరించారు.

అన్న వితరణకు రూ.1.60 లక్షల విరాళం



అనంతపురం జిల్లా రుద్రంపేటకు చెందిన వి.నందిని కుటుంబ సభ్యులతో మంగళవారం దుర్గగుడిలో నిత్యాన్నదాన పథకానికి రూ. 1,60,000లను విరాళంగా అందజేశారు. దాతకు, కు టుంబీకులకు అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, వేద పండితుల ఆశీస్సులు అందజేశారు. లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం బహూకరించారు.



నీలిమకు గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థిని పి.నీలిమ కూచిపూడి నృత్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సాధించింది. 2023లో భారత్ ఆర్ట్స్ అకాడమీ తెలంగాణలో నిర్వహించిన కూచిపూడి నృత్యంలో పాల్గొన్న 4218 మందిలో నీలిమ ఒకరు. గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ నీలిమకు రావడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తెలిపారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, సెక్రటరీ పి.లక్ష్మణ్, కళాశాల కన్వీనర్ సిహెచ్.కృష్ణారావు, అధ్యాపకులు నీలిమను అభినందించారు.

మరోసారి భూసమీకరణ ఉపసంహరించుకోవాలి

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుష్పరాజు

గాంధీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గతంలో రాజధాని అమరావతికి రైతుల నుంచి వేలాది ఎకరాలు సమీకరించిన సీఎం చంద్రబాబు ఐదేళ్ల పాటు తాత్కాలిక భవనాల పేరుతో కాలం గడిపారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకుర పుష్పరాజు విమర్శించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని నిర్మాణం చేపట్టకపోగా ఇప్పుడు మరలా రాజధాని విస్తరణ పేరుతో మరో 44 వేల ఎకరాల భూసమీకరణకు సిద్ధమవడాన్ని తప్పుబట్టారు. పేదలు, రైతు వ్యతిరేక చర్యలు మానుకోవాలని హితవుపలికారు. గతంలో మాజీ సీఎం జగన్ మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం కార్పొరేట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచి పెట్టేందుకే భూసమీకరణ రణ చేయాలని నిర్ణయించారని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్య క్షులు వై.ఉదయ్‌కుమార్, డి.శామ్యూల్ కు మార్, కె.వి.రత్నం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహాత్ముడి ఆలోచన మేరకే అంబేడ్కర్‌కు రాజ్యాంగ రచన బాధ్యతలు

● ప్రధాని వ్యాఖ్యలకు కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఖండన



గాంధీనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ సరిగ్గా రాయించలేదని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ ఖండిం చారు. మహాత్మాగాంధీ ఆలోచన మేరకు రాజ్యాంగాన్ని రాసే అవకాశాన్ని అంబేడ్కర్‌కు కాంగ్రెస్ పార్టీ కల్పించిందన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ నీతి, నిజాయితీ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రాజ్యాంగాన్ని రచించి భారతదేశానికి ఇచ్చారన్నారు. ఇటీవల ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో రూ.500 కోట్లు పట్టుబడిన విషయాన్ని ఏ మీడియాలో రాకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. అంత పెద్ద మొత్తంలో డబ్బు ఎక్కడి నుంచి ఆయనకు వచ్చిందనే విషయాన్ని 48 గంటల్లో ప్రధానీ మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రజలకు వివరించాలని, లేదంటే వారు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చీమకుర్తి గ్రానైట్ గనులు, టీటీడీలో షాపుల కేటాయింపులు, బ్యాంకుల్లో రుణాల మంజూరు, ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో దళితులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వం కాంట్రాక్టు పనుల్లో 24 శాతం ఎస్సీ, ఎస్టీలకు 15 శాతం ఓబీసీలకు ఇస్తుందని, ఇదే విధానాన్ని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వీజీఎఫ్ విధానంలో బెజవాడలో సీ ప్లేన్ ప్రాజెక్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రకాశం బ్యారేజీ దగ్గర సీ ప్లేన్ ప్రాజెక్టు కార్యరూపం విషయంలో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. సీ ప్లేన్ ప్రాజెక్టు ఇప్పటికే అనుకున్న సమయానికంటే జాప్యమౌతోంది. ఈ ఏడాది జనవరి నెల నుంచే ప్రారంభం కావాల్సి ఉండగా.. అంతులేని జాప్యం జరుగుతోంది. కిందటేడాది నవంబరు నెలలో విజయవాడ నుంచి శ్రీశైలానికి ట్రయల్ రన్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ట్రయల్ రన్ సందర్భంగా సీ ప్లేన్ నిర్వహణకు ఎక్కువ ఖర్చు అవుతోందని తెలుస్తోంది. దీనిని బట్టి టిక్కెట్ ధరలు కూడా భారీగా ఉంటున్నాయి. ట్రయల్ రన్ సక్సెస్ కావటంతో ప్రజలలో కూడా ఆసక్తి నెలకొనటంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లోకేషన్లలో సీ ప్లేన్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి ముందుగా అనుకున్నట్టుగా శ్రీశైలం కాకుండా విజయవాడ - హైదరాబాద్ మధ్యన సీ ప్లేన్ నడపటానికి ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది. ప్రకాశం బ్యారేజీ దగ్గర వాటర్ డ్రోమ్ ఏర్పాటుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా టెండర్లు కూడా పిలిచినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత నుంచి స్తబ్దత నెలకొంది. ఈ ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకురావటానికి ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానాన్ని అవలంబించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. వీజీఎఫ్ విధానం లో ఈ ప్రాజెక్టు అతి త్వరలో సాకారమౌతుందని భావించాల్సి వస్తోంది.

అప్రమత్తత అవసరం

● అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత ● నివారణ చర్యలపై అవగాహన ఉండాలి

చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి కారణం..అగ్గి రగిలితే అంతా బుగ్గే.. భద్రత మన జీవన విధానం కావాలి.. ఇలా అనేక చోట్ల పెద్ద పెద్ద అక్షరాలతో బోర్డులు, గోడల మీద రాతలు కనిపిస్తుంటాయి. వేసవిలో తరచూ అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయి. వాటి నివారణకు అగ్నిమాపకశాఖ ముందస్తు ప్రణాళికలతో జాగ్రత్తలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. వేసవి లోనే కాదు అన్ని వేళలా అగ్ని ప్రమాదాల బారిన పడకుండా కొద్ది పాటి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాల్సి అవసరం ఎంతైనా ఉంది.

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)





అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపకశాఖ ఆసుపత్రులు, దుకాణ సముదాయాలు, పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కొవాలో అవగాహన కల్పించేందుకు మాక్ ఫైర్ డ్రిల్స్ నిర్వహించడం జరుగుతోంది. అగ్ని నుంచి భద్రత అనేది కేవలం ఒక వారం కార్యక్రమం కాదని అది మన నిత్య జీవన విధానంలో ఒక భాగమని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అగ్నిమాపక వారోత్సవాలను ప్రధానంగా అగ్ని ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించడానికి, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై చైతన్యం కల్పించేందుకు నిర్వహిస్తుంటారు. ఈనెల 14 నుంచి 20 వరకు ఆంధ్రప్రదేశ్ విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ వారు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తోంది. ప్రజలకు అనేక సందేశాలు అందించడమే ప్రధాన ఉద్దేశం. అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలి. అసలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, జరిగిన వెంటనే ఎలా స్పందించాలో వివరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● ఇంటిలోని వస్తువులను అల్మారాలో, షెల్ఫులలో సక్రమంగా ఉంచుకోవడంతో పాటు ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చిన్న పిల్లలకు అగ్గి పెట్టెలు, లైటర్లు, టపాకాయలు ఇతర మండే పదార్థాలను అందుబాటులో ఉంచరాదు. కాల్చిన సిగరెట్టు, బీడీలు, అగ్గి పుల్లలు పారవేసే ముందు ఆర్పి వేసి యాష్ ట్రేలో వేయాలి. బీఎస్‌ఐ మార్క్ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలనే ఉపయోగించాలి.

ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం



ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం. మేం ఎంత అవేర్‌నెస్ తెచ్చినా ప్రజలు జాగ్రత్తలు పాటించి తీరాలి. కాల్చి పారవేసే సిగరెట్ల వల్ల సుబాబుల్ తోటలకు, పంట పొలాల కంపలకు మంటలు అంటుకుంటాయి. వరిగడ్డి వాములు దగ్ధమవుతుంటాయి. సిగరెట్, బీడీ కాల్చిన తర్వాత పారేసే ముందుకు వాటిని పూర్తిగా ఆర్పి వేయాలి. అలాగే ప్రతి చోట విధిగా అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. వాటిని ఎలా వినియోగించాలో సిబ్బందికి అవగాహన కల్పించాలి.

గౌతమ్, మైలవరం అగ్నిమాపకాధికారి

ఇంటి నుంచి ఎక్కువ రోజులు సెలవులకు బయటకు వెళ్లినప్పుడు మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే ఆర్పడానికి ఎల్లవేళలా నీటిని ఇంటిలో నిల్వ చేయాలి.

● వంట ఇంటిలో: వంటింటి క్రింది పై భాగాల్లో గాలి వెలుతురు ఉండేటట్లు చూడండి. చెడిపోయిన గ్యాస్ ట్యూబ్‌ను బి.ఎస్.ఐ మార్క్ గల రబ్బరు ట్యూబ్‌తో వెంటనే మార్చండి. ఎల్‌పీజీ వాడకం పూర్తయిన తర్వాత సిలెండర్ వద్ద గల రెగ్యులేటర్‌ను వాల్వ్‌ను ఆపేయాలి. గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపి వేయండి. ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయవద్దు. తలుపులు పూర్తిగా తెరవాలి. వంటగదిలో డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలెండర్ వంటివి ఉంచకండి. వంట చేసేటప్పుడు సరైన నూలు వస్త్రాలు, ఎప్రాన్ గాని ధరించాలి.

● దుస్తులకు నిప్పు అంటుకున్నట్లయితే పరుగెత్తవద్దు. నేలపై దొర్లండి లేదా దుప్పటి చుట్టుకోండి. దీని వలన మంటలు ఆరిపోతాయి. కాలిన శరీర భాగం మీద చల్లని నీరు పోయండి. పొగతో నిండిన గదులలో మోచేతులు, మోకాళ్లపై పాకండి. ముక్కు, నోటికి అడ్డంగా తడి గుడ్డ నుంచి గాలి పీల్చడం ద్వారా పొగ, కార్బన్ డయాక్సైడ్‌ని పీల్చకుండా ఆపవచ్చు.

● కర్మాగారాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ఉద్యోగులందరిని అగ్ని ఉనికి ప్రదేశాలు గుర్తించే విధంగా చైతన్యవంతం చేయాలి. అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా ఎదుర్కోవాలో తగిన శిక్షణ ఇవ్వాలి

● ఇంటిలో, కార్యాలయాలలో లేదా పబ్లిక్ ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలను నివారించడానికి అగ్నిమాపక యంత్రాలువినియోగించడంతో పాటు విద్యుత్ పరికరాలను సరిగ్గా నిర్వహించారు.

● అగ్నిమాపకశాఖ సేవలపై అవగాహన ఉండాలి. ప్రజలు అగ్ని ప్రమాద సమయంలో 101 నంబరుకు కాల్ చేయాలి.

● స్థానిక సంఘాలతో కలిసి అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన.

● అగ్నిమాపకశాఖ యొక్క త్యాగాలు, సాహసాన్ని గౌరవించడం. ప్రజలు వారితో సహకరించడం.

దుర్గగుడి ఘాట్‌రోడ్డులో చోరీ

● కారులోని 241 గ్రాముల బంగారం మాయం ● పనిచేయని సీసీ కెమెరాలు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఘాట్‌రోడ్డులో పార్కింగ్ చేసిన హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడి కారులో బంగారు ఆభరణాలు, నగదు చోరీ అయిన సంఘటన మంగళవారం జరిగింది. హైదరాబాద్‌లోని బృందావన్ కాలనీకి చెందిన బిల్డర్ ఆచంట దుర్గారావు కుటుంబ సభ్యులతో కలిసి కారులో అమలాపురంలో జరగనున్న బంధువుల శుభకార్యానికి బయల్దేరారు. మార్గ మధ్యలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి దర్శనం నిమిత్తం దుర్గగుడికి విచ్చేశారు ఆయన తన కారును ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద పార్కింగ్ చేసి, కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం మధ్యాహ్నం 1.15 గంటలకు కారు వద్దకు వచ్చి చూసుకోగా, కారులో భద్రపరిచిన బ్యాగ్‌లోని 241 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు చోరీకి గురయ్యాయి. బాధితుడు దేవస్థానంలోని అధికారులకు, పోలీసులకు సమాచారం తెలియపరిచాడు. వారు ఘటనాప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం పోలీసులు వారిని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు పంపించారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ, క్రైమ్ అధికారులు ఘటనాప్రదేశానికి వెళ్లి పరిశీలించి బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భద్రతా వైఫల్యానికి నిదర్శనం

ఇంద్రకీలాద్రిపై భద్రతా వైఫల్యానికి ఈ చోరీ ఘటన నిదర్శనంగా నిలిచింది. ఘాట్‌రోడ్డులోని చోరీ ఘటనా ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవటంతో దేవస్థానం అధికారులు హడావిడిగా కొత్తవి ఏర్పాటు చేశారు. కొండ పైన, దిగువన సుమారు 200లకు పైగా సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిలో ఎన్ని సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి, ఎన్ని పనిచేయటం లేదనే పర్యవేక్షణ కొరవడింది. గతంలో సీసీ కెమెరాలపై పర్యవేక్షణ ఉండేది. ఎప్పటికప్పుడు పనిచేయని కెమెరాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసేవారు. కొన్ని నెలల నుంచి పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీసీ కెమెరా విభాగంలో అనుభవం లేని సిబ్బంది ఉండటం, సరిపడినంత సిబ్బంది కూడా లేకపోవడం కూడా దీనంతటికీ కారణంగా చెప్పొచ్చు.


భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ ఎస్.వి.రాజశేఖర్‌బాబు

కేంద్ర 16వ ఆర్థిక కమిషన్ బృందం విజయవాడకు రాక నేడు

● హరిత బెరంపార్క్‌లో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు

విద్యాధరపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర 16వ ఆర్థిక కమిషన్ బృందం బుధవారం విజయవాడకు రానున్నది. భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఆర్థిక కమిషన్ బృందం పాల్గొంటుంది. ఈ నేపథ్యంలో హరిత బెరంపార్క్‌లో బందోబస్తు, ఇతర ఏర్పాట్లను మంగళవారం విజయియవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి కె.శ్రీనివాసులు పరిశీలించారు. భద్రతా పరంగా ఎటువంటి చిన్న లోపాలు కూడా లేకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. డీసీపీలు కె.జి.వి.సరిత, కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి ప్రసాద్, ఏడీసీపీ జి.రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, ఇతర ఏసీపీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆరోగ్య సదస్సు 20న

గవర్నర్‌పేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 20న ఎంజీ రోడ్డులోని ఎంబీవీకె భవన్‌లో రాష్ట్రస్థాయి ఆరోగ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కెవీఎస్ సాయిప్రసాద్ తెలిపారు. ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో మంగ ళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైద్యం ఖరీదుగా మారిన నేటి పరిస్థితుల్లో నాణ్యమైన ఉచిత వైద్యం ప్రజలందరికీ అందుబాటులో ఉంచడానికి ప్రజలతో పాటు ప్రభుత్వాల బాధ్యత తెలియజేసే లక్ష్యంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో మేధావులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య రంగ ఉద్యోగులు, మెడికల్ పారా మెడికల్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. ప్రజా రోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య అధ్యక్షతన జరిగే సదస్సులో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మాజీ కార్యదర్శి డాక్టర్ పి.వి.రమేష్, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య బడ్జెట్-విశ్లేషణ అంశంపై ప్రముఖ బడ్జెట్ విశ్లేషకులు డాక్టర్ డేవిడ్ సుధాకర్ మాట్లాడతారని తెలిపారు. సదస్సులో ఐఎంఏ మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. సమరం, మాజీ అధ్యక్షుడు డాక్టర్ వి. రాంప్రసాద్, ప్రముఖ వైద్యులు పాల్గొంటారని వివరించారు. ప్రజారోగ్య వేదిక ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్‌ప్రకాష్, ఎంబీవీకె బాధ్యు లు కె. స్వరూపరాణి, జన విజ్ఞాన వేదిక నాయకుడు బి.రవికుమార్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ

వన్‌టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగుతుల సంక్షేమ శాఖ సంచాలకు లు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కె.లక్ష్మీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) అర్హత సాధించిన అభ్యర్థులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈ బీసీ కేటగిరిలకు చెందిన అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు టెట్ అర్హత మార్కుల పత్రం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డుతో పాటు పాస్‌పోర్టు సైజు ఫోటో దరఖాస్తుకు జతపరచి డైరెక్టర్ ఏపీ బీసీ స్టడీ సర్కిల్, విజయవాడ, డోర్ నెం.74-2-1/5, ప్లాట్ నెం.34ఎ, పండరీపురం, అశోక్‌నగర్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా చిరునామాకు దరఖాస్తులు పంపించాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9966849937, 9505094349, 8688855255 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నూతన సాంకేతిక ఆవిష్కరణలపై వికాస్‌లో జాతీయ సదస్సు ప్రారంభం

విజయవాడ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నున్నలోని వికాస్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం నూతన సాంకేతికత ఆవిష్కరణలపై ఎన్‌సీశక్తి-2025 పేరుతో రెండు రోజుల జాతీయ సదస్సును నమీబియా యూనివర్శిటీ ప్రొఫెసర్ కె. వెంకటే శ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సాంకేతిక ఆవిష్కరణలు, పరిజ్ఞానం తదితర అంశాలపై ప్రసంగించారు. రాకెట్ ఇంజన్‌లో వాడే నూతన సాంకేతిక విధానాలతో పాటుగా భారతదేశం స్వయం సమృద్ధిని సాధించడంతో పాటు పరిశోధనల ఫలాలు విదేశాలకు అందించడంలో ముందంజలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు, సాంకేతిక నిపుణులు 117 పరిశోధన పత్రాలను ఆవిష్కరించారు. కళాశాల ఛైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి, డైరెక్టర్ కీర్తి, కాన్ఫరెన్స్ కన్వీనర్ పవన్ సాయి, తదితరులు పాల్గొన్నారు.




జ్యోతి ప్రకాశనం చేస్తున్న మంత్రి రవీంద్ర, ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల, సుజనా అకాడమీ విలీనం సందర్భంగా ఒప్పంద ప్రతాలు సమర్పించుకుంటున్న సుజనా చౌదరి, కొనకళ్ల నారాయణరావు

ఎడ్యుకేషన్ హబ్‌గా మచిలీపట్నం

● ఎస్‌వీహెచ్ విలీన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుదామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల సుజనా గ్రూప్‌లో విలీనం ఒప్పందం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి రవీంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇకపై ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల పేరు యలమంచిలి జనార్ధనరావు, ద్రైతా మధుసూధనశాస్త్రి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌గా మారబోతుందన్నారు. మెంటార్‌గా వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. ఈ సందర్భంగా సుజనా గ్రూప్ ఛైర్మన్, ఎమ్మెల్యే సుజనా చౌదరికి హిందూ విద్యా సంస్థల గ్రూప్ అధ్యక్షుడు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు విలీనపత్రాలు అందజేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, బందరు ఇంజనీరింగ్ కళాశాలకు పూర్వవైభవం వస్తుందన్నారు. మచిలీపట్నం ఓడరేవు నిర్మాణం పూర్తయిన తరువాత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. మాజీ కేంద్ర మంత్రి, విజయవాడ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ, ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా కళాశాలలో కొత్త కోర్సులు ప్రవేశపెడతామన్నారు. లెక్చరర్ల నియామకాలు, విద్యా విషయక అంశాలు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం పరిశీలిస్తుందన్నారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆర్టీసీ ఛైర్మన్, హిందూ కళాశాల అనుబంధ సంస్థల ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ, బందరు ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల కొన్ని సమస్యల్లో ఉండటం వల్ల పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు విలీనం కార్యక్రమం చేపట్టామన్నారు. ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్ ముడా ఛైర్మన్ మట్టా ప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, కొనకళ్ళ జగన్నాధరావు, మోటమర్రి బాబాప్రసాద్, బత్తిన దాసు, గోపు సత్యనారాయణ, ఇలియాస్ పాషా, వాలిశెట్టి తిరుమలరావు, ఎస్పీ ఆర్. గంగాధర రావు, కార్యదర్శి డి.జి. శాస్త్రిలు పాల్గొన్నారు.

తమ్ముడి మరణం తట్టుకోలేక సోదరి మృతి.. దొండపాడులో విషాదం


రామాంజనేయులు, అంజలి (ఫైల్)

గుడివాడ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గద్దె రామాంజనేయులు (54) అనారోగ్య కారణాలతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మంగళవారం మరణించారు. సోదరుడి మృ తదేహాన్ని చూసి బయటకు వచ్చి తట్టుకోలేక ఆయన సోదరి ముక్తినేని అంజలి మరణించారు. విజయవాడలో వీరి మృ తదేహాలను ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉం చారు. రామాంజనేయులు భార్య గద్దె పుష్పరాణి ప్రస్తుతం ఎంపీపీగా ఉన్నారు. ఈయనకు ఐదుగురు అక్కలు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమ్ముడు మరణ వార్త తట్టుకోలేక అక్క కూడా మరణించటంతో గుడివాడ, దొండపాడు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, టీడీపీ, వైసీపీ నాయకులు వారి భౌతిక కాయాలను సందర్శించి నివాళులర్పించారు.


తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ధనలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు వీర వెంకట నాగ బెనర్జీ

అక్రమంగా మట్టి తవ్వుతున్నారని ఫిర్యాదు చేస్తే దాడి

● చర్యలు కోరుతూ టీడీపీ సీనియర్ నాయకుడు ఫిర్యాదు

పెదపారుపూడి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పెదపారుపూడి గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వుతున్నారని ఫిర్యాదు చేసిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ పునుకొల్లు వీర వెంకట నాగ బెనర్జీపై గ్రామసర్పంచ్ భర్త చప్పిడి కిషోర్ వర్గం దాడి చేశారు. బెనర్జీ మంగళవారం తన నివాసం వద్ద రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బేతవోలు - పెదపారుపూడి పొలిమేర డొంక తవ్వటానికి ప్రయత్నం చేస్తున్నారని తె లిసి ముందుగానే ఫిర్యాదు చేశామన్నారు. దానిని తవ్వటం వల్ల వర్షాకాలంలో చంద్రయ్య కాల్వ నీళ్ల పొంగి రైతులకు పంట నష్టం జరుగుతుందన్నారు. తాను ఫిర్యాదు చేయటంతో శనివారం రాత్రి చెరువు గట్టు సెంటర్‌లో సాంబయ్య హోటల్‌లో ఒంటరిగా ఉన్న సమయంలో చప్పిడి కిషోర్, చప్పిడి మాణిక్యాలరావు, పీకా రత్నరాజు మరో ఐదుగురు వ్యక్తులు తన పై దాడి చేశారన్నారు. ఇదే విషయాన్ని మండల నాయకులు, నియోజకవర్గ నాయకులు దృష్టికి తీసుకెళ్లగా, ఎటువంటి స్పందన లేకపోవటం బాధాకరమన్నారు. రైతు భాను మాట్లాడుతూ పార్టీ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు పార్టీని నమ్ముకున్న వ్యక్తి బెనర్జీపై దాడి చేసిన వాళ్లని కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు కోరుతూ డీటీ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గారపాటి వీర వెంకట నాగబాబురావు, చెరుకూరి మల్లిఖార్జునరావు, వెనిగళ్ల వెంకటేశ్వరరావు, శిఖ గోవర్ధన, పీక ఫణి, సోలి రక్తందాసు, బొల్లవరపు శారాబంది, గోగినేని పున్నయ్య, పాలడుగు గణేష్, పూనుకొల్లు మురళీకృష్ణ, అడుసుమిల్లి శ్రీనివాస్ కుమార్, ఎర్ర బాబు, సీతారామయ్య పాల్గొన్నారు.

అన్ని సన్‌గ్లాసెస్ ఒకటి కావు





ఫ్యాషన్

సన్ గ్లాసెస్ ఎందుకంటే...

- కంటి చుట్టూరా ఉండే చర్మానికి రక్షణ దక్కుతుంది
- అతినీలలోహిత వెలుగు కళ్లలోకి చొరబడకుండా ఉంటుంది

పోలరైజ్‌డ్ లెన్స్‌లు

ప్రతిఫలించే కాంతి మెరుపును తగ్గించడానికి సహాయపడతాయి. సముద్రతీరాలు సందర్శించే సమయంలో నీటి మీద ప్రతిఫలించే ఎండ వెలుగు నుంచి కళ్లకు రక్షణ దక్కుతుంది.

నాన్ పోలరైజ్‌డ్ లెన్స్‌లు

తీవ్రమైన వెలుగును అడ్డుకుంటాయి. ఆరుబయట ఎండ వెలుగుకు కంటిచూపు స్పష్టత కోల్పోకుండా సహాయపడతాయి

యువి బ్లాకర్స్

అతినీలలోహిత కిరణాల నుంచి కళ్లకు రక్షణ కల్పిస్తాయి. రోజంతా ఎండలో తిరిగే సమయంలో ఈ కళ్లజోడు పెట్టుకోవాలి

కూలింగ్ గ్లాసెస్ కొనేటప్పుడు...

- లెన్స్‌లో యువి ఫిల్టర్స్ ఉన్నాయని సూచించే లేబుళ్లను కలిగిన సన్ గ్లాసెస్ ఎంచుకోవాలి
- అవసరాలకు తగిన సన్‌గ్లాసెస్ ఎంచుకోవాలి
- కంటి చుట్టూరా చర్మాన్ని కప్పే ఫ్రేమ్ కలిగిన సన్‌గ్లాసెస్ ఎంచుకోవాలి



యువి వెలుగు హానికరం. ఎందుకంటే...

- కంటిచుట్టూరా ఉండే చర్మం దెబ్బతింటుంది. ముడతలు ఏర్పడి, చర్మపు క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది
- కంటి శుక్లాలు ఏర్పడే అవకాశాలు పెరుగుతాయి
- రంగులనూ, సూక్ష్మ వివరాలనూ కనిపెట్టే కంట్లోని మాక్యులా దెబ్బతింటుంది



గ్రామీణ మహిళల ప్రస్తావన వచ్చినప్పుడు చాలామంది వారు పొలం పనులకే పరిమితం అనుకుంటారు. కానీ అవకాశాలు లభిస్తే వారు కూడా ఎవరికీ తీసిపోరు. దీనికి ఉదాహరణ మహబూబ్‌నగర్ దివిటిపల్లిలో ఉన్న అమర్‌రాజా గిగా ప్లాంట్‌లో పని చేసే మహిళలు. అక్కడ సుమారు 430మంది సిబ్బంది ఉంటే వారిలో 350 మంది గ్రామీణ యువతులే! వారిలో కొందరిని 'నవ్య' పలకరించింది.

అక్కడ సిబ్బంది అందరూ మహిళలే!

మన గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించే పెద్ద పరిశ్రమలు తక్కువ. పరిశ్రమలు తక్కువ కావటం వల్ల ఇంటర్ దాకా చదువుకున్న అమ్మాయిలు కూడా కూలి పనులకే వెళ్తూ ఉంటారు. కూలి పనికి వెళ్లటం వల్ల ఆదాయం తక్కువగానే వస్తుంది. వారు కుటుంబానికి చేసే సాయం కూడా తక్కువే.. పైగా వారికి పెళ్లి అయి పిల్లలు పుడితే మరిన్ని సమస్యలు పెరుగుతాయి. ఇదంతా ఒక విషవలయంలా తయారవుతుంది. దీని నుంచి వీలైనంత మందిని బయటపడేయాలనే ఉద్దేశంతో అమర్‌రాజా సంస్థ పేదరికం ఎక్కువగా ఉండే మహబూబ్‌నగర్‌లో విడిభాగాలను బిగించి.. బ్యాటరీలను తయారుచేసే గిగా ప్లాంట్‌ను నెలకొల్పింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా ప్లాంట్‌లను నెలకొల్పినప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటారు. "మేము ఈ ప్లాంట్‌ను ప్రారంభించినప్పుడు- చుట్టుపక్కల ప్రాంతాలలో చదువుకున్న యువతులకు ఉపాధి కల్పించాలని నిర్ణయించుకున్నాం. అందులో ఎక్కువ మంది పదోక్లాసు, ఇంటర్ దాకా చదువుకున్నవారే. వారికి సాంకేతిక పరిజ్ఞానం కూడా ఉండదు. ముందు వారికి శిక్షణ ఇచ్చాం.." అని కంపెనీ ప్రతినిధి వివరించారు. ఈ శిక్షణ ఇవ్వటానికి కూడా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందంటారు ఆమె. "మొదట్లో ఇక్కడ ఉన్న కుటుంబాలలో అనేక అనుమానాలు ఉండేవి. కంపెనీకి పంపించటానికి సంశయించేవారు. ముందు కొద్ది మంది చేరారు. ఆ తర్వాత వారిని చూసి ఇతరులు వచ్చారు. మా దగ్గర చాలా సురక్షితమైన వాతావరణం ఉంటుందనే విషయాన్ని తెలియజేయటానికి వీరందరినీ చిత్తూరులో ఉన్న మా ప్లాంట్‌కు తీసుకువెళ్లాం. అక్కడ కూడా అందరూ మహిళలే పనిచేస్తూ ఉంటారు. దానితో వీరందరికీ నమ్మకం వచ్చింది. ఇప్పుడు కంపెనీపై పూర్తి భరోసా వచ్చింది" అంటారు ఆ ప్రతినిధి.



> బ్యాటరీలు బిగించేటప్పుడు చేతులతో చేసే పనులు కొన్ని ఉంటాయి. కొన్ని యంత్రాలు మాత్రమే చేయగలుగుతాయి. ఈ పనులు మగవాళ్లే కాదు. మహిళలు కూడా సులభంగా చేయవచ్చు.
> \- శైలజ



జీవన ప్రమాణాలు మెరుగ్గా..

సాధారణంగా పెళ్లి అయ్యి.. పిల్లలు పుట్టిన తర్వాత ఖర్చులు పెరుగుతాయి. ఈ సమయంలో అదనపు సంపాదన మార్గాల కోసం అన్వేషిస్తూ ఉంటారు. ఈ ప్లాంట్‌లో పనిచేస్తున్న సౌజన్యది కూడా ఇదే కథ. "నేను ఇంటర్ దాకా చదివా. తర్వాత పెళ్లి అయిపోయింది. నేను గృహిణి పాత్రకు పరిమితయిపోయా. ఇంటర్ దాకా చదువుకున్నా మంచి ఉద్యోగాలు ఏమి రాలేదు. పొలం పనికి వెళ్తే రోజుకు మూడొందలే వచ్చేది. పైగా అన్ని సీజన్లలోను పని దొరకదు. ఇలాంటి పరిస్థితుల్లో నేను ప్లాంట్‌లో చేరా. ప్రస్తుతం స్థిరమైన ఆదాయం వస్తోంది. పిల్లల చదువుకు భరోసా వచ్చింది.." అంటారు ఆమె. ప్లాంట్‌లో చేరి ఆదాయం పెరిగిన తర్వాత కూడా రకరకాల అపోహలు వెంటాడుతూ ఉంటాయి. ఇవి తప్పని ఎవరో ఒకరు ఉదాహరణగా నిలిస్తే మిగిలిన వారిలో సైర్థ్యం పెరుగుతుంది. ఈ ప్లాంట్‌లో పనిచేసే మల్లీశ్వరి అలాంటి ఉదాహరణే. "సాధారణంగా బ్యాటరీలు తయారీ ప్లాంట్ అంటే కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయనే అపోహలు ఉండేది. నేను ఉద్యోగంలో చేరటానికి చాలా భయపడ్డా. చేరిన తర్వాత ముడిపదార్థాల నాణ్యతను పరిశీలించి ప్లాంట్‌కు ఇచ్చే బాధ్యతను నాకు అప్పగించారు. పైగా షిఫ్టులు కూడా ఉంటాయి. మొదట్లో ఇబ్బంది అనిపించేది. కానీ నా కుటుంబ సభ్యులు సహకరిస్తూ ఉండటంతో ఇబ్బంది లేకుండా సాఫీగా సాగిపోతోంది" అంటారు మల్లీశ్వరి.

వ్యాపారవేత్త రామచంద్ర గల్లా 1985లో అమర రాజా గ్రూపును స్థాపించారు. 1990లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ ప్లాంటును ప్రారంభించినప్పుడు, స్థానిక మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. ప్రస్తుతం చిత్తూరులోని ఫ్యాక్టరీలో 85% మహిళలు పని చేస్తున్నారు. ఇదే వారసత్వాన్ని కొనసాగించాలనే దృక్పథంతో దివిటిపల్లిలో గిగా ప్లాంట్‌ను నెలకొల్పారు.

చేయి చేయి కలిపి..

ఈ ప్లాంట్‌లో పనిచేస్తున్న సిబ్బంది జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో చుట్టు పక్కల ఉన్న గ్రామ ప్రజల దృక్పథంలో మార్పు వచ్చింది. ఇదే సమయంలో ప్లాంట్‌లో పని చేసే మహిళలకు బస్సు సౌకర్యం, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. మన దేశంలో ఇప్పటికీ సరైన ఉపాధి అవకాశాలు లేని గ్రామాలెన్నో ఉన్నాయి. వాటిలో కూడా ఈ తరహా ప్లాంట్స్ నెలకొల్పితే గ్రామీణ మహిళలకు ఉపాధి లభిస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

• గోగుమళ్ల కవిత

వేసవి ఉపశమనం 'సోడా టీ'



వేసవిలో జ్యూస్‌లు మాత్రమే కాదు.. చల్లటి టీ కూడా ఉపశమనాన్ని ఇస్తుంది. ఈ టీని ఎలా చేయాలో చూద్దాం...

తయారీ విధానం

- టీ పొడి లేదా టీ ఆకులను బాగా మరిగించాలి. డికాక్షన్‌ను తీసి ఒక గిన్నెలో పోసి చల్లార్చాలి. దానిలో తేనె కలపాలి.
- దీనిలో తగినంత నిమ్మరసం వేయాలి. బాగా కలపాలి. ఆ తర్వాత దానిలో చల్లటి సోడాను పోయాలి. ఐస్ ముక్కలను వేయాలి.
- టీ పౌడర్ కన్నా టీ ఆకులను ఉపయోగిస్తే మంచి రుచి వస్తుంది.
- కొందరు తేనెకు బదులుగా బెల్లం పొడిని కూడా వాడతారు. ఇది కూడా చాలా రుచిగా ఉంటుంది.
- నిమ్మ రసంతో పాటుగా నిమ్మకాయ ముక్కలను వేస్తే అదనపు రుచి వస్తుంది.

పిల్లలు మీ మాట వినట్లేదా..?



పిల్లలు... చెప్పిన మాట వినట్లేదని తరచూ తల్లిదండ్రులు బాధపడుతూ ఉంటారు. ఇలాంటప్పుడు చిన్న చిట్కాలతో పిల్లలు మాట వినేలా చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

- పిల్లలు ఏదైనా మంచి పని చేస్తే మనస్ఫూర్తిగా ప్రశంసించాలి. సంతోషాన్ని వ్యక్తపరచాలి. దీనివల్ల పిల్లలతో అనుబంధం పెరుగుతుంది.
- పిల్లలతో సున్నితంగా మృదు స్వరంతో మాట్లాడాలి. వాళ్లమీద ప్రేమని, ఇష్టాన్ని వ్యక్తం చేసేలా మాట తీరు ఉండాలి. అప్పుడే పిల్లలు మీ మాట వినడానికి సుముఖంగా ఉంటారు.
- పిల్లలను ఆజ్ఞాపించవద్దు. వాళ్లకి అర్థమయ్యేలా చిన్న సూచన చేస్తే చాలు.
- పిల్లలతో మాట్లాడేటప్పుడు తేలిక పదాలు మాత్రమే ఉపయోగించాలి. చెప్పదలచుకున్నది సూటిగా చిన్న వాక్యాల్లో చెప్పేయాలి.
- హోమ్ వర్క్, స్క్రీన్ టైమ్‌లకు సంబంధించిన నియమ నిబంధనలను స్పష్టంగా పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలి.
- పిల్లలు ఏదైనా పొరబాటు చేసినప్పుడు వాళ్లమీద అరవడం, కోపాన్ని ప్రదర్శించడం, కొట్టడం లాంటివి చేయకూడదు. వాళ్లు చేసిన తప్పు గ్రహించేలా వివరంగా మాట్లాడాలి..
- పిల్లల మీద శ్రద్ధ చూపించాలి. వాళ్లవైపు చూస్తూ ప్రతి విషయమూ అర్థమయ్యేలా చెప్పాలి.

ఐరన్ తక్కువైందని తెలిసేదెలా..?

జీవక్రియలు సజావుగా జరగడానికి ఐరన్ అత్యవసరం. పోషకాహార లోపం వల్ల ఒక్కోసారి శరీరంలో ఐరన్ మోతాదు తగ్గుతూ ఉంటుంది. దీనివల్ల రోగనిరోధక శక్తి తగ్గి పలు ఆరోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. శరీరంలో ఐరన్ స్థాయి తగ్గిందని తెలిపే సంకేతాల గురించి నిపుణులు ఇలా చెబుతున్నారు.

- సాధారణంగా కాళ్లు, చేతులు కొద్దిగా వేడిగా ఉంటాయి. శరీరంలో ఐరన్ లోపిస్తే కాళ్లు, చేతులు చల్లగా అనిపిస్తాయి.
- చిన్న పని చేసినా అలసట వస్తుంది. ఎప్పుడూ నీరసంగా ఉంటుంది. ఏ పనీ చేయాలనిపించదు. ఏకాగ్రత లోపిస్తుంది. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. సుద్ద, సబ్బు, బలపాలు తినాలనే కోరిక ఏర్పడుతుంది.
- శరీరంలో ఐరన్ తగినంత పరిమాణంలో లేని పక్షంలో ఊపిరి సరిగా ఆడదు. బలంగా ఊపిరి తీసుకోవాల్సి వస్తుంది.
- తరచూ తలనొప్పి వస్తూ ఉంటుంది. ఎక్కువసేపు పడుకున్నప్పటికీ నిద్ర మబ్బు వదలదు
- గోర్లు త్వరగా విరిగిపోతూ ఉంటాయి. కండరాలు పట్టేసినట్లు ఉంటాయి.
- శిరోజాలు అధికంగా రాలిపోతూ ఉంటాయి. చర్మం పొడిబారుతుంది. పెదవులు పగిలిపోతాయి. కళ్లలో నీళ్లు తిరుగుతూ ఉంటాయి.
- శరీరంలో ఐరన్ స్థాయి తగ్గితే రక్త హీనత ఏర్పడుతుంది. దీంతో మెదడుకి ఆక్సిజన్ సరఫరా తగ్గి తల తిరుగుతున్నట్లు అనిపిస్తుంది. శరీరం వణుకుతూ ఉంటుంది. నిలబడడం కష్టమవుతుంది.
- ఐరన్ లోపం వల్ల గుండెలోని కండరాల పనితీరు మందగిస్తుంది. గుండె దడగా అనిపిస్తుంది. గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది.



అడవి బిడ్డలకు ఆసరా..!

"సుందర్‌బన్స్... పేరుకు తగినట్టు ప్రకృతి సౌందర్యంతో అలరారే ఈ అడవులు... ప్రపంచంలోనే అతి పెద్ద మడ అడవులుగా, యునెస్కో వారసత్వ సంపద ప్రదేశంగా గుర్తింపు పొందాయి. ఈ అందం వెనుక భయానకమైన ఒక వాస్తవం ఉంది. బతుకుతెరువు కోసం తేనె సేకరించడానికి వెళ్లినవారు క్రూరమృగాల బారిన పడి మరణించడం అక్కడ సర్వసాధారణం. మూడువేలకు పైగా ఉన్న ఆ బాధిత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకొని, ఆత్మవిశ్వాసంతో జీవించడానికి కృషి చేస్తున్నారు ముంబయికి చెందిన 48 ఏళ్ల నీతి గోయెల్.



"నేను పుట్టి పెరిగింది, చదువుకున్నది చండీగఢ్‌లో. మా నాన్న ఎస్.కె.గుప్తా ప్రసిద్ధ పారిశ్రామికవేత్త. ఆయన బాటలోనే నేను కూడా నడిచాను. ముంబయిలో రెస్టారెంట్స్ నడుపుతున్నాను. నా భర్త కూడా వ్యాపార రంగంలోనే ఉన్నారు. మా పిల్లలిద్దరూ విదేశాల్లో చదువుతున్నారు. ఇదీ నా నేపథ్యం. మనకు ఉన్నదానిలో కొంత సమాజానికి ఇవ్వాలనే నిబద్ధత నా తల్లితండ్రుల నుంచి వచ్చింది. ముంబయి మురికివాడల్లోని పిల్లల కోసం, పేద విద్యార్థుల కోసం పలు కార్యక్రమాలు చేశాను. కొవిడ్ సమయంలో... ప్రముఖ నటుడు సోనూసూద్‌తో కలిసి పని చేశాను. పేదలకు, వలస కార్మికులకు 80 లక్షలకు పైగా భోజనాలను అందించాను. 32 మంది అనాథలను దత్తత తీసుకున్నాను. 800 మందికి పైగా సెక్స్‌వర్కర్లకు ఆసరాగా నిలిచాను. నిసర్గ తుపానువల్ల మహారాష్ట్రలోని రాయ్‌గడ్‌లో నిరాశ్రయులైన వారికోసం వెయ్యి ఇళ్ళ నిర్మాణానికి సాయపడ్డాను. 'నారి నిట్టి' అనే ప్రాజెక్ట్ ద్వారా గృహహింస బాధిత మహిళలు సొంత వ్యాపారాలు పెట్టుకోవడానికి సాయపడ్డాను. ఒకవైపు వ్యాపారంలో, మరోవైపు సామాజిక కార్యక్రమాల్లో బిజీగా ఉండే నాకు... కొత్త ప్రదేశాలు చూడడం అంటే ఆసక్తి. సుందర్‌బన్స్ పర్యటన కూడా అలాంటిదే. మన దేశంలోని పశ్చిమబెంగాల్ నుంచి బంగ్లాదేశ్ వరకూ ఈ అడవులు విస్తరించి ఉన్నాయి. వాటి అందాన్ని ఆస్వాదించడానికి 2022లో పశ్చిమబెంగాల్ వెళ్ళాను. అప్పుడే భయానకమైన వాస్తవాలెన్నో నాకు తెలిశాయి.

వెళ్తే పులులతో... లేదంటే ఆకలితో...

సుందర్‌బన్స్ నేషనల్ పార్క్, సాగర్ ఐలాండ్ తదితర ప్రాంతాల సందర్శన సందర్భంగా బంగ్లాదేశ్‌కు చెందిన టైగర్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.ఎ.అజీజ్ పరిచయమయ్యారు. ఆయన గత మూడు దశాబ్దాలుగా సుందర్‌బన్స్‌లో వన్యప్రాణుల సంరక్షణ కోసం పని చేస్తున్నారు. పదివేల చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణం కలిగిన సుందర్‌బన్స్ సుమారు వంద దీవుల సముదాయం. రాయల్ బెంగాల్ టైగర్స్‌కు, అరుదైన జంతు, వృక్ష జాతులకు నిలయం. ఇక్కడ నివసించే ప్రజలు అటవీ ఉత్పత్తులను... ప్రధానంగా తేనెను విక్రయించి జీవిస్తూ ఉంటారు. ఇక్కడి తేనెకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. దాని కోసం స్థానికులు పులులు, సర్పాలతో నిండిన అడవుల్లో.. ప్రాణాలను పణంగా పెట్టి సాహసం చేస్తారు. ఈ క్రమంలో ప్రాణాలు కోల్పోయేవారు కూడా ఎక్కువే. పులుల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకున్నవారి వితంతువుల సంఖ్య మూడువేలకు పైనే అని తెలుసుకొని దిగ్భ్రాంతి చెందాను. వారిని 'టైగర్ విడోస్' అని వ్యవహరిస్తూ ఉంటామని డాక్టర్ అజీజ్ చెప్పారు. స్థానికులతో మాట్లాడే అవకాశం కూడా కల్పించారు. "పులులు ఉంటాయని మీకు తెలుసు కదా! అయినా ఎందుకు అడవుల్లోకి వెళ్తారు?" అని వారిని అడిగాను. "అడవుల్లోకి వెళ్లకపోతే తేనె సేకరణ ఎలా జరుగుతుంది? తేనె అమ్మకపోతే మాకు ఆదాయం ఉండదు. పులుల చేతిలోనైనా చావాలి లేదా ఆకలితోనైనా చావాలి. ఇవే మా బతుకులు" అని చెప్పారు. అడవిలోకి వెళ్ళినవారు ఒక రోజు తరువాత కూడా తిరిగి రాకపోతే... వారు ప్రాణాలు కోల్పోయినట్టేనని స్థానికులు భావిస్తారు.



శాశ్వత పరిష్కారం కోసం...

గంగా నది ఎగువ నుంచి కొట్టుకువచ్చే మృతదేహాల ద్వారా ఈ ప్రాంతంలోని పులులు నరమాంస భక్షణకు అలవాటుపడ్డాయి. ఆ నది మీద ఆనకట్ట కట్టడంతో.. మృతదేహాలు కొట్టుకురావడం ఆగిపోయింది. దీంతో పులులు నరమాంసం కోసం వెతుక్కుంటూ దీవుల మీదకు వచ్చి పడుతున్నాయి. దీవుల్లోని తెగలకు భద్రత కరువయింది. పైగా లోతట్టు ప్రాంతాల్లో సంచారంపై ఆంక్షలు ఉండడంతో... ఇక్కడ మరణించినవారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కూడా రాదు. సంపాదించే వ్యక్తిని కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగానే కాదు, సామాజికంగా కూడా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వారికి అండగా నిలవాలని, బతికే దారి చూపించాలని అనుకున్నాను. వారి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఉపాధి మార్గాలను చూపించాలని నిర్ణయించుకున్నాను.

వారి శ్రమ ఫలించింది...

ముందుగా స్థానికులతో, కొందరు స్వచ్ఛంద సేవకులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశాను. వారు బాధితుల వివరాలతో ఒక జాబితా తయారు చేశారు. ఆ కుటుంబాల అవసరాలు, వారికి కలిగిన నష్టం తీవ్రతలను పరిగణనలోకి తీసుకొని... వందమంది మహిళలను ఎంపిక చేశాం. వారి ఇళ్ళ ముందే చేపల మడుగుల ఏర్పాటుకు, మేకలు, గొర్రెల పెంపకానికి ఆర్థిక సాయం చేశాం. మడుగుల తవ్వకం, వెదురుతో ఆక్సిజన్ పైపుల్ని తయారు చేసి, వాటిని కొలనుల్లో ఉపయోగించడం లాంటివి నేర్పించాం. కొద్ది నెలల్లోనే ఆ మహిళల శ్రమ ఫలితాన్ని ఇచ్చింది. స్థిరమైన ఆదాయం సంపాదించడం మొదలయింది. ఇప్పటికి 500 మందికి పైగా మహిళలు చేపలు, పశువుల పెంపకంతో ఉపాధి పొందుతున్నారు. వాటి మార్కెటింగ్ బాధ్యతలను కూడా మేమే చూస్తున్నాం. ఇప్పుడు ఆ కుటుంబాల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. గౌరవమైన జీవితం గడుపుతున్నామనే సంతృప్తి వారిలో కనిపిస్తోంది."

టారిలీఫ్..!

ట్రంప్ సుంకాల నష్టాల నుంచి పూర్తిగా కోలుకున్న భారత మార్కెట్

- మళ్లీ 23,300 ఎగువకి నిఫ్టీ
- ఒక్కరోజే రూ.10.57 లక్షల కోట్ల లాభం
- 2 సెషన్లలో రూ.18.42 లక్షల కోట్ల వృద్ధి



సెన్సెక్స్ మరో 1,577 పాయింట్లు అప్

ముంబై: వరుసగా రెండో రోజూ భారీగా లాభపడిన భారత స్టాక్ మార్కెట్.. ట్రంప్ సుంకాల నష్టాల నుంచి పూర్తిగా కోలుకుంది. వాహన, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రియల్టీ సహా అన్ని రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జర పడంతో మంగళవారం సెన్సెక్స్ 1,577.63 పాయింట్ల (2.10 శాతం) లాభంతో 76,734.89 వద్దకు చేరింది. ఒకదశలో సూచీ 1,750.37 పాయింట్లు ఎగబాకి 76,907.63 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ సైతం 500 పాయింట్ల (2.19 శాతం) వృద్ధితో 23,328.55 వద్ద ముగిసింది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను సుంకాల నుంచి మినహాయించిన ట్రంప్ సర్కారు.. వాహన రంగానికి టారిఫ్‌ల నుంచి తాత్కాలిక ఊరట కల్పిస్తామని సంకేతాలిచ్చారు. దాంతో అంతర్జా తీయ మార్కెట్లతో పాటు దేశీయ సూచీలూ ర్యాలీ తీశాయి. ఆర్‌బీఐ రెపో తగ్గింపుతో బ్యాంకులు రుణాలపై వడ్డీ రేట్లు తగ్గిస్తుండటం దేశీయంగా వినియోగం పెరగ డానికి దోహదపడనుందన్న ఆశాభావం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగు పరిచాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.10.57 లక్షల కోట్లు పెరిగి రూ.412.24 లక్షల కోట్ల(4.81 లక్షల కోట్ల డాలర్లు)కు చేరింది. గడిచిన రెండు సెషన్లలో మదుపరుల సంపద రూ.18.42 లక్షల కోట్లు పెరిగింది.

- సెన్సెక్స్ నమోదిత 30 కంపెనీల్లో హెచ్‌యూఎల్, ఐటీసీ మినహా అన్నీ రాణించాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ షేరు 6.84 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, ఎల్ అండ్ టీ స్టాక్ 4.50 శాతం చొప్పున పెరిగాయి. యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ కూడా 4 శాతానికి పైగా ఎగబాకాయి. మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.23 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.69 శాతం పెరిగాయి.
- బీఎస్‌ఈలో 3,266 కంపెనీల షేర్లు లాభపడగా.. 833 నష్టపోయాయి. మరో 157 యథాతథంగా ముగిశాయి. 91 కంపెనీల స్టాక్స్ సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని తాకాయి.
- ఫారెక్స్ ట్రేడింగ్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 30 పైసలు పెరిగి రూ.85.80 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటం తోపాటు ఈక్విటీ మార్కెట్లో లాభాలు మన కరెన్సీకి బలం చేకూర్చాయి.
- ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర రూ.50 పెరుగుదలతో ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.96,450 వద్దకు తిరిగి చేరుకుంది. కిలో వెండి రూ.2,500 ఎగబాకి రూ.97,500 ధర పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 3,224 డాలర్లు, సిల్వర్ 32.32 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

టారిఫ్ నష్టాలు భర్తీ

ఈ నెల 2న సెన్సెక్స్ 76,617.44 వద్ద, నిఫ్టీ 23,332.35 వద్ద ముగియగా.. బీఎస్‌ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.412.98 లక్షల కోట్లుగా నమోదైంది. ఆ రోజు అర్ధరాత్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ సహా ప్రపంచ దేశాలపై అదనపు సుంకాలను ప్రకటించారు. కొన్ని రోజులకే టారిఫ్‌ల అమలును 90 రోజులు వాయిదా వేయడంతో పాటు ఆపై కొన్ని రంగాలకు మినహాయింపులు కల్పించారు. దాంతో గడిచిన రెండు వారాల్లో మార్కెట్ సూచీలు తొలుత భారీ పతనాలను, ఆపై భారీ లాభాలనూ చవిచూశాయి. మొత్తానికి సూచీలు సుంకాలతో తొలుత ఏర్పడిన నష్టాలను దాదాపుగా పూడ్చుకోగలిగాయి. ఈ నెల 2 నాటి ముగింపు స్థాయితో పోలిస్తే, మంగళవారం నాటికి సెన్సెక్స్ 117.45 పాయింట్ల (0.15 శాతం) లాభంతో 76,734.89 వద్దకు చేరింది. నిఫ్టీ మాత్రం మరో 5 పాయింట్ల చేరువలో ఉంది. బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ కూడా రూ.74,000 కోట్ల మేర పెరగాల్సి ఉంది.

ఏడాది చివరి నాటికి సెన్సెక్స్ @ 82,000

ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికి సెన్సెక్స్ 82,000 స్థాయికి చేరుకో వచ్చని అంతర్జాతీయ బ్రోకరేజీ సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. సూచీ ప్రస్తుత స్థాయితో పోలిస్తే, 9 శాతం అధికమిది. అయితే, ఇదే బ్రోకరేజీ సంస్థ సెన్సెక్స్ ఈ ఏడాది చివరినాటికి 93,000 స్థాయికి ఎగబాకవచ్చని అంచనా వేసింది. ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో సెన్సెక్స్ టార్గెట్‌ను 12 శాతం మేర తగ్గిస్తున్నట్లు మోర్గాన్ స్టాన్లీ అనలిస్టులు రిధమ్ దేశాయ్, నయంత్ పరేఖ్ తాజా నోట్‌లో పేర్కొన్నారు.

దూసుకుపోయిన వాణిజ్య లోటు

2024-25లో రూ.24.04 లక్షల కోట్లు.. మార్చి ఎగుమతుల్లో స్వల్ప వృద్ధి



న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం నాలుగు నెలల వరుస క్షీణతకు తెర దించింది. మార్చి నెలలో ఎగుమతులు 0.7% పెరిగి 4,197 కోట్ల డాలర్లకు (రూ.3.57 లక్షల కోట్లు) చేరాయి. వాణిజ్య లోటు 2,154 కోట్ల డాలర్లకు (రూ.1.83 లక్షల కోట్లు) పెరిగింది. మార్చి నెలలో దిగుమతులు నాలుగు నెలల గరిష్ఠ స్థాయి 11.3% వృద్ధితో 6,351 కోట్ల డాలర్లకు (రూ.5.40 లక్షల కోట్లు) చేరాయి. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఎగుమతులు 0.08 శాతం పెరిగి 43,742 కోట్ల డాలర్లకు (రూ.37.18 లక్షల కోట్లు) చేరాయి. ఇదే కాలంలో దిగుమతులు 6.62% పెరిగి 72,024 కోట్ల డాలర్లకు (రూ.61.22 లక్షల కోట్లు) చేరడంతో వాణిజ్య లోటు 28,282 కోట్ల డాలర్లుగా (రూ.24.04 లక్షల కోట్లు) నమోదయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇది 24,114 కోట్ల డాలర్లు (రూ.20.50 లక్షల కోట్లు)గా ఉంది.

వస్తుసేవల ఎగుమతులన్నింటినీ కలిపితే 2024-25లో వాటి విలువ రికార్డు స్థాయిలో 82,093 కోట్ల డాలర్లకు (రూ.69.80 లక్షల కోట్లు) చేరాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 77,813 కోట్ల డాలర్లతో (రూ.66.14 లక్షల కోట్లు) పోల్చితే ఇది 5.5% అధికం. ప్రపంచ స్థాయిలో పలు సవాళ్లు ఎదురైనప్పటికీ 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తంలో వస్తు ఎగుమతులు జీవితకాల గరిష్ఠ స్థాయిని నమోదు చేశాయని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భరత్‌వాల్ అన్నారు. ప్రధానంగా ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, రెడీమేడ్ గార్మెంట్లు, బియ్యం, పత్తి, కాటన్ యార్న్/ఫ్యాబ్రిక్స్, ప్లాస్టిక్, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, టీ, పొగాకు ఎగుమతులకు ఉత్తేజంగా నిలిచాయి.

ఆరేళ్ల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మార్చి నెలలో ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 3.34 శాతానికి దిగి వచ్చింది. కూరగాయలు, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార వస్తువుల ధరలు తగ్గడం ఇందుకు కారణం. 2019 ఆగస్టులో నమోదైన 3.28% తర్వాత రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయికి దిగి రావడం ఇదే ప్రథమం. ఇది ఫిబ్రవరిలో 3.61% ఉండగా గత ఏడాది మార్చిలో 4.85% ఉంది. మార్చిలో ఆహార ద్రవ్యోల్బణం 3.75 శాతానికి దిగి వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ రెపోరేటు నిర్ణయించేందుకు రిటైల్ ద్రవ్యోల్బణాన్నే పరిగణనలోకి తీసుకుంటుంది గనుక రాబోయే రోజుల్లో వడ్డీ రేట్లు మరింతగా తగ్గించేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ఇదిలా ఉండగా టోకు ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) కూడా మార్చి నెలలో 6 నెలల కనిష్ఠ స్థాయి 2.05 శాతానికి దిగి వచ్చింది. కూరగాయలు, బంగాళాదుంపలు, ఇతర ఆహార వస్తువుల ధరలు గణనీయంగా తగ్గడం ఇందుకు దోహదపడింది.

అకౌంటింగ్ తప్పుల భారం రూ.1,979 కోట్లు

ఇండస్ఇండ్ బ్యాంక్

న్యూఢిల్లీ: డెరివేటివ్ పెట్టుబడుల విలువ లెక్కింపులో జరిగిన తప్పులు ఇండస్ఇండ్ బ్యాంక్‌ను బాగానే దెబ్బకొట్టింది. ఈ తప్పుల ఫలితంగా గత ఏడాది జూన్ నెలాఖరు నాటికి తమ నెట్‌వర్త్‌కు రూ.1,979 కోట్ల మేర గండి పడినట్టు బ్యాంక్ తెలిపింది. ఇది బ్యాంకు మొత్తం నెట్‌వర్త్‌లో 2.35 శాతానికి సమానమని పేర్కొంది. దీనికి సంబంధించి బ్యాంక్ నియమించిన పీడబ్ల్యూసీ ఇప్పటికే తన నివేదికను ఇండస్ఇండ్‌కు సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా దిద్దుబాటు చర్యలు ప్రారంభించినట్టు తెలిపింది.

- ఆసుస్ మార్కెట్లోకి ఏఐ ఆధారిత ఎక్స్‌పర్ట్ బుక్ పీ సిరీస్ ల్యాప్‌ట్యాప్స్‌ను విడుదల చేసింది. ఎక్స్‌పర్ట్‌బుక్ పీ1, పీ3, పీ5 మోడళ్లతో ఈ కొత్త సిరీస్ అందుబాటులో ఉండనుంది. ఈ ల్యాప్‌టాప్స్ ధరలు వరుసగా రూ.39,990, రూ.64,990, రూ.94,990గా ఉన్నాయి. ఈ నెల 21 నుంచి ఈ-కామర్స్ పోర్టల్ ఫ్లిప్‌కార్ట్‌లో ఈ ల్యాప్‌టాప్స్ అందుబాటులో ఉంటాయి.
- గడచిన ఆర్థిక సంవత్సరం (2024-25) ముగిసే నాటికి బ్రోకరేజీ ప్లాట్‌ఫామ్ గ్రో.. యాక్టివ్ క్లయింట్ల సంఖ్య 95 లక్షల నుంచి 1.29 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 36 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇదే సమయంలో గ్రో ప్లాట్‌ఫామ్ మార్కెట్ వాటా కూడా 23.28 శాతం నుంచి 26.26 శాతానికి పెరిగింది.

అమర రాజాతో అతుల్ గ్రీన్‌టెక్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యుత్ వాహనాల (ఈవీ)కు అవసరమైన బ్యాటరీలు, చార్జర్లను పెద్ద ఎత్తున తయారు చేసేందుకు అమర రాజా గ్రూప్ సిద్ధమవుతోంది. ఇందుకోసం అతుల్ ఆటో అనుబంధ కంపెనీ అతుల్ గ్రీన్‌టెక్‌తో అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ (ఏఆర్‌ఈఎం) అనుబంధ సంస్థ అయిన అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (ఏఆర్‌ఏసీటీ), అమర రాజా పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ (ఏఆర్‌పీఎస్‌ఎల్) మధ్య ఒక త్రైపాక్షిక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం అతుల్ గ్రీన్‌టెక్ త్రిచక్ర ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన లిథియం ఐరన్ ఫాస్ఫేట్ (ఎల్ఈపీ) బ్యాటరీలు, చార్జర్లను అమర రాజా గ్రూప్ కంపెనీలు అభివృద్ధి చేసి సరఫరా చేస్తాయి. ఈ ఒప్పందం అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్స్ అభివృద్ధికి కూడా వీలు కల్పిస్తుందని మూడు కంపెనీలు ప్రకటించాయి. ఈ బ్యాటరీలను అమర రాజా.. తెలంగాణలోని దివిటిపల్లి వద్ద ఉన్న తన గిగా కారిడార్‌లో తయారు చేస్తుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,180 ▼	87,200 ▼	1.09.800 ▼
విజయవాడ	96,500 ▼	90,000 ▼	98,000 ▼
విశాఖపట్నం	93,490 ▼	85,700 ▼	95,420 ▲
రాజమండ్రి	95,130 ▼	87,200 ▼	98,200 ▲
ప్రొద్దుటూరు	92,900 ▼	85,470 ▼	97,900 ▲
ముంబై	93,102 ▼	85,281 ▼	95,030 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	130
వరంగల్	130	గుంటూరు	130
కరీంనగర్	130	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	95
కర్నూలు	130	నెల్లూరు	100
విశాఖపట్నం	124	అనంతపురం	100
గోదావరి	130		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	410
చిత్తూరు	460	విశాఖపట్నం	425
		దజను గుడ్లు రూ. 60	

జోస్ అలుక్కాస్ ఆత్మకథ 'గోల్డ్'

ఆవిష్కరించిన కేంద్ర మంత్రి సురేశ్ గోపి



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఆభరణాల రిటైల్ విభాగంలో కేరళలోని త్రిసూర్ స్వర్ణ వారసత్వాన్ని విశ్వవ్యాప్తం చేయటంలో జోస్ అలుక్కాస్ చేసిన కృషి అమోఘమైనదని కేంద్ర మంత్రి సురేశ్ గోపి అన్నారు. త్రిసూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో జోస్ అలుక్కాస్ ఆత్మ కథ 'గోల్డ్'ను మంత్రి లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేశ్ గోపి మాట్లాడుతూ.. బంగారం వ్యాపారంలో త్రిసూర్‌కు ప్రత్యేకమైన చరిత్ర ఉందని, దాన్ని జోస్ అలుక్కాస్ కొనసాగించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం జోస్ అలుక్కాస్ మాట్లాడుతూ.. త్రిసూర్ నుంచి తాను వ్యాపారాన్ని ప్రారంభించి శాఖోపశాఖలుగా విస్తరించినట్లు చెప్పారు. తన 81 ఏళ్ల జీవితం వ్యక్తిగతమైనదే కాదని, భారతీయ ఆభరణాల వ్యాపార చరిత్ర కూడా అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోజోస్ అలుక్కాస్ ప్రచారకర్త ఆర్ మాధవన్, కేరళ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కే రాజన్, ఉన్నత విద్యా శాఖ మంత్రి ఆర్ బిందు సహా జోస్‌అలుక్కాస్ ఎండీలు వర్ఘీస్ అలుక్కాస్, పాల్ జే అలుక్కాస్, జాన్ అలుక్కాస్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

సన్నీ.. ఎంత మంచి మనసో!



కాంబ్లికి నెలకు రూ. 30వేల ఆర్థిక సాయం

ముంబై: మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీకి సునీల్ గవాస్కర్ చాంప్స్ ఫౌండేషన్ బాసటగా నిలిచింది. ఈ ఏప్రిల్ నుంచి ప్రతి నెలా కాంబ్లీకి రూ.30 వేల ఆర్థిక సాయం, వైద్య ఖర్చుల నిమిత్తం ఏటా మరో రూ.30 వేలు ఇవ్వనున్నట్టు ఫౌండేషన్ తెలిపింది. మాజీ క్రీడాకారులకు సాయం చేసేందుకు ఈ స్వచ్ఛంద సంస్థను 1999లో గవాస్కర్ స్థాపించాడు. గత జనవరిలో జరిగిన వాంఖడే స్టేడియం 50వ వార్షికోత్సవం సందర్భంగా గవాస్కర్‌ను కాంబ్లీ కలిశాడు. అప్పుడు కాంబ్లీకి సాయం చేస్తానని ఇచ్చిన మాటను గవాస్కర్ నెరవేర్చాడు. ఇక, గత డిసెంబరులో మూత్రపిండాల ఇన్‌ఫెక్షన్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలతో కాంబ్లీ రెండు వారాల పాటు ఆస్పత్రిలో చికిత్స తీసుకొని, కోలుకోవడం తెలిసిందే.



ఈ వయసులోనూ.. ఇదేం మ్యాజిక్ అన్నా?

ధోనీ త్రోపై నెట్టింట ప్రశంసల జల్లు

లఖ్‌నవూ: ఈ ఐపీఎల్‌లో వరుస ఓటములతో సతమతమవుతున్న చెన్నై సూపర్‌కింగ్స్‌కు సోమవారం లఖ్‌నవూ జట్టుపై విజయం ఎంతో ఊరటనిచ్చింది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ ఎంఎస్ ధోనీ తనదైన స్టయిల్లో చేసిన మ్యాజిక్ మరోసారి అభిమానులను అలరించింది. లఖ్‌నవూ బ్యాటింగ్ చివరి ఓవర్‌లో అబ్దుల్ సమద్‌ను రనౌట్ చేసిన తీరు.. వహ్వా అనిపించింది. ఆ ఓవర్ రెండో బంతిని బౌలర్ పథిరన వైడ్‌గా వేశాడు. స్ట్రయిక్ ఎండ్‌లో ఉన్న సమద్ నాన్ స్ట్రయిక్ ఎండ్‌లోకి పరుగు కోసం ప్రయత్నించాడు. దీన్ని గుర్తించిన వికెట్‌కీపర్ ధోనీ.. వికెట్ల వెనకాల నుంచి గ్లోవ్స్‌తోనే బంతిని విసిరి నాన్ స్ట్రయికర్ ఎండ్‌లోని వికెట్లను పడగొట్టాడు. స్టంప్స్‌ను సరిగా చూడకుండానే.. వాటికి మహీ గురిపెట్టిన ఈ అద్భుతమైన ఫీట్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరలవుతోంది. '43 ఏళ్ల వయసులోనూ ఇదెలా సాధ్యం?.. గ్లోవ్స్ వేసుకొని కూడా అలా ఎలా రనౌట్ చేశావ్ అన్నా..' అంటూ ధోనీ కీపింగ్ సామర్థ్యంపై నెట్టింట ప్రశంసల జల్లు కురుస్తోంది. మహీ మ్యాజిక్‌కు లఖ్‌నవూ కెప్టెన్ రిషబ్ పంత్ కూడా ఫిదా అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత అలా ఎలా రనౌట్ చేశావు? అని ధోనీని పంత్ సరదాగా అడిగాడు. 'వికెట్లను చూశా. అలా విసిరానంతే..! తగిలితే తగులుతుంది.. లేకపోతే లేదు' అని ధోనీ నవ్వుతూ చెప్పాడు.

మల్లీశ్వరిని చూసి దేశం గర్విస్తోంది

ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ ట్వీట్



న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): వెయిట్‌లిఫ్టర్‌గా కరణం మల్లీశ్వరి సాధించిన విజయాలను చూసి దేశం గర్విస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువ అథ్లెట్లకు మార్గనిర్దేశనం చేసేందుకు ఆమె చేసిన ప్రయత్నాలు ప్రశంసనీయమని మంగళవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. యమునానగర్ పర్యటన సందర్భంగా ఒలింపిక్ పతక విజేత కరణం మల్లీశ్వరితో భేటీ అయినట్టు మోదీ తెలిపారు.

షూటింగ్‌లో సౌరభ్‌కు కాంస్యం

లీమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో షూటర్ సౌరభ్ చౌధరి భారత్‌కు కాంస్య పతకం అందించాడు. మంగళవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో సౌరభ్ 219.1 పాయింట్లతో మూడో స్థానం దక్కించుకొన్నాడు.

ఆగస్టులో బంగ్లా టూర్‌కు..

టీమిండియా షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య ఆగస్టు 17 నుంచి 31 వరకు మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌లు జరుగనున్నాయి. అలాగే బంగ్లాదేశ్ గడ్డపై టీ20 సిరీస్ ఆడడం భారత్‌కిదే మొదటిసారి. మొత్తం 6 మ్యాచ్‌లు మీర్పూర్, చట్టోగ్రామ్‌లో నిర్వహించనున్నారు. మరోవైపు ఈ సిరీస్ కంటే ముందు జూన్‌లో భారత జట్టు ఇంగ్లండ్‌తో 5 టెస్టులు ఆడనుంది. ఈనేపథ్యంలో యువ ఆటగాళ్లకు బంగ్లాతో సిరీస్‌ల్లో ఆడే అవకాశం రావచ్చు. ఇక రెండు జట్లు గతేడాది చివరిసారిగా తలపడినప్పుడు టెస్టు సిరీస్‌ను 2-0తో, టీ20 సిరీస్‌ను 3-0తో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది.

పంజాబ్.. బల్లే బల్లే

స్వల్ప స్కోరును కాపాడుకున్న కింగ్స్

చాహల్ చమక్ ● కోల్‌కతాకు భంగపాటు



చాహల్ (4/28)

1 ఐపీఎల్ చరిత్రలో తక్కువ స్కోరు (111)ను కాపాడుకున్న జట్టుగా పంజాబ్.

చండీగఢ్: ధనాధన్ ఫార్మాట్‌లో నిజంగా ఇది అద్భుతమే. 200కి పైగా స్కోర్లు చేసినా గెలవడంపై సందేహాలు నెలకొన్న వేళ.. లోస్కోరింగ్ థ్రిల్లర్ అభిమానులను ఉర్రూతలూగించింది. తమ చివరి మ్యాచ్‌లో 245 పరుగులు బాదినా పంజాబ్ కింగ్స్ ఓడిన విషయం తెలిసిందే. కానీ మంగళవారం కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 111 రన్స్ మాత్రమే సాధించి.. తమ బౌలర్ల ప్రతిభతో కాపాడుకున్న తీరు మాత్రం ఔరా.. అనిపించక మానదు. భీకర బ్యాటింగ్ లైనప్ కలిగిన కేకేఆర్‌కు ముకుతాడు వేసిన స్పిన్నర్ చాహల్ (4/28) గేమ్‌చేంజర్‌గా నిలిచాడు. చివర్లో రస్సెల్ (17) కాస్త భయపెట్టినా పంజాబ్ 16 పరుగుల తేడాతో అపూర్వ విజయం దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 15.3 ఓవర్లలో 111 పరుగులకు కుప్పకూలింది. ప్రభ్‌సిమ్రన్ (15 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 30), ప్రియాన్ష్ ఆర్య (12 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్‌తో 22), శశాంక్ సింగ్ (17 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 18) మాత్రమే రాణించారు. ఆ తర్వాత ఛేదనలో కోల్‌కతా 15.1 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. రఘువంశీ (37), రహానె (17) ఆకట్టుకున్నారు. జాన్సెన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా చాహల్ నిలిచాడు.

పంజాబ్ మాయ: 112 పరుగుల ఛేదనను కోల్‌కతా సునాయాసంగా ముగిస్తుందనే అంతా భావించారు. కానీ పంజాబ్ బౌలర్లు కూడా అదరగొట్టారు. ముఖ్యంగా స్పిన్నర్ చాహల్ కేకేఆర్‌ను బెదరగొట్టాడు. తొలి రెండు ఓవర్లలో ఓపెనర్లు నరైన్ (5), డికాక్ (2) వికెట్లను కోల్పోవడంతోనే పంజాబ్ విజయంపై ఆశలు పెరిగాయి. కానీ రఘువంశీ, రహానె నిలకడగా ఆడడంతో కోల్‌కతా గెలుపుపై ఎవరికీ సందేహం కలుగలేదు. ఇద్దరూ ఎలాంటి ఇబ్బంది లేకుండా బౌండరీలతో ముందుకు సాగారు. అయితే 8వ ఓవర్‌లో రహానెను చాహల్ ఎల్బీ చేయడంతో ఒక్కసారిగా మ్యాచ్ మలుపు తిరిగింది. వాస్తవానికి రహానె రివ్యూ కోరుకుంటే ఫలితం అతడికి అనుకూలంగానే వచ్చేది. ఇక ఆ తర్వాత పంజాబ్ బౌలర్ల హవా సాగింది. ధాటిగా ఆడుతున్న రఘువంశీని కూడా చాహల్ అవుట్ చేయగా, వెంకటేశ్ అయ్యర్ (7)ను మాక్స్‌వెల్ ఎల్బీ చేయడంతో కేకేఆర్‌లో వణుకు ఆరంభమైంది. దీనికి తోడు చాహల్ ఒకే ఓవర్‌లో రింకూ (2), రమణ్‌దీప్ (0)లను అవుట్ చేసి ఒక్కసారిగా ఆశలు రెట్టింపు చేశాడు. ఓ దశలో కేకేఆర్ 79/8 స్కోరుతో నిలిచింది. అప్పటికి 42 బంతుల్లో 33 పరుగులు కావాల్సి ఉండగా.. 14వ ఓవర్‌లో రస్సెల్ విరుచుకుపడ్డాడు. అప్పటివరకు మూడు ఓవర్లలో నాలుగు వికెట్లు తీసిన చాహల్ ఈ ఓవర్‌లో 6,6,4తో 16 రన్స్ సమర్పించుకున్నాడు. దీంతో కేకేఆర్‌పై ఒత్తిడి తగ్గడంతో పంజాబ్ ఆశలు గల్లంతే అనిపించింది. అయినా పట్టు విడవకుండా 15వ ఓవర్‌లో అర్ష్‌దీప్ మెయిడిన్ వికెట్ తీయగా.. ఆ వెంటనే రస్సెల్‌ను జాన్సెన్ బౌల్డ్ చేయడంతో స్టేడియంలో పంజాబ్ సంబరాలు మిన్నంటాయి.

వికెట్లు టపటపా..: బ్యాటింగ్‌కు అనుకూలిస్తుందనుకున్న పిచ్‌పై కోల్‌కతా బౌలర్లు అద్భుతం చేశారు. భారీ స్కోరు ఆలోచనలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్ జట్టు వీరి ధాటికి ఉక్కిరిబిక్కిరైంది. తమ చివరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌పై 245 రన్స్ సాధించిన కింగ్స్ ఈసారి ఓ దశలో వంద పరుగులకైనా చేరుతుందా? అనిపించింది. మొదట ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య ఆడిన తీరుకు.. ఆ తర్వాత మైదానంలో వికెట్ల జాతరకు సంబంధం లేకుండా పోయింది. ప్రతీ బ్యాటర్ భారీ షాట్లకు వెళ్లి మూల్యం చెల్లించుకున్నారు. 36 పరుగుల వ్యవధిలోనే పంజాబ్ చివరి ఆరు వికెట్లను కోల్పోవడం గమనార్హం. ఎనిమిదో నెంబర్ బ్యాటర్ శశాంక్ సింగ్ (18) కాస్త పోరాడినా అది కూడా కాసేపే అయ్యింది. రెండో ఓవర్‌లో ప్రియాన్ష్ రెండు ఫోర్లతో టచ్‌లోకి రాగా.. తర్వాతి ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ వరుసగా 4,6,4, ఆర్య 4తో పేసర్ వైభవ్ అరోరా 20 పరుగులిచ్చుకున్నాడు. ఆ సమయంలో 3 ఓవర్లలోనే 33 పరుగులతో అత్యంత పటిష్ఠంగా కనిపించిన కింగ్స్ జట్టు ఆ తర్వాత పేకమేడలా కుప్పకూలింది. నాలుగో ఓవర్‌లో ప్రియాన్ష్, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (0)ల వికెట్లు పడగొట్టి పేసర్ హర్షిత్ పంజాబ్‌ను తొలి దెబ్బ కొట్టాడు. ఆ వెంటనే ఇన్‌గ్లిస్ (2)ను వరుణ్ అవుట్ చేయగా.. ఆరో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ రెండు సిక్సర్లతో ధాటిని కనబర్చాడు. కానీ అదే ఓవర్ ఆరో బంతికి హర్షిత్‌కే ప్రభ్‌సిమ్రన్ చిక్కడంతో పవర్‌ప్లేలో పంజాబ్ 55/4తో కష్టాల్లో పడింది. ఆ తర్వాత స్పిన్నర్లు వరుణ్, సునీల్ నరైన్ చకచకా వికెట్లు తీయడంతో ఓ దశలో 86 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. ఇలాంటి పరిస్థితిలో శశాంక్-బార్లెట్ (11) మధ్య తొమ్మిదో వికెట్‌కు 23 పరుగులు జత చేరడంతో స్కోరు వంద దాటింది. కానీ 16వ ఓవర్‌లోనే వీరిద్దరూ అవుట్ కావడంతో పంజాబ్ ఆట ముగిసింది.

నేటి మ్యాచ్

ఢిల్లీ x రాజస్థాన్ — వేదిక: ఢిల్లీ — రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	6	4	2	0	8	1.081
ఢిల్లీ	5	4	1	0	8	0.899
బెంగళూరు	6	4	2	0	8	0.672
పంజాబ్	6	4	2	0	8	0.172
లఖ్‌నవూ	7	4	3	0	8	0.086
కోల్‌కతా	7	3	4	0	6	0.547
ముంబై	6	2	4	0	4	0.104
రాజస్థాన్	6	2	4	0	4	-0.838
హైదరాబాద్	6	2	4	0	4	-1.245
చెన్నై	7	2	5	0	4	-1.276

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్


స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 22, ప్రభ్‌సిమ్రన్ (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 30, శ్రేయాస్ అయ్యర్ (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 0, ఇంగ్లిస్ (బి) వరుణ్ 2, నేహల్ (సి) వెంకటేశ్ (బి) నోకియా 10, మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 7, సూర్యాంశ్ (సి) డికాక్ (బి) నరైన్ 4, శశాంక్ (ఎల్బీ) వైభవ్ 18, జాన్సెన్ (బి) నరైన్ 1, బార్ట్‌లెట్ (రనౌట్) 11, అర్ష్‌దీప్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 15.3 ఓవర్లలో 111 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-39, 2-39, 3-42, 4-54, 5-74, 6-76, 7-80, 8-86, 9-109, 10-111; **బౌలింగ్:** వైభవ్ అరోరా 2.3-0-26-1, నోకియా 3-0-23-1, హర్షిత్ రాణా 3-0-25-3, వరుణ్ చక్రవర్తి 4-0-21-2, నరైన్ 3-0-14-2.

కోల్‌కతా: డికాక్ (సి) సూర్యాంశ్ (బి) బార్ట్‌లెట్ 2, నరైన్ (బి) జాన్సెన్ 5, రహానె (ఎల్బీ) చాహల్ 17, రఘువంశీ (సి) బార్ట్‌లెట్ (బి) చాహల్ 37, వెంకటేశ్ అయ్యర్ (ఎల్బీ) మ్యాక్స్‌వెల్ 7, రింకూ సింగ్ (స్టంప్డ్) ఇంగ్లిస్ (బి) చాహల్ 2, రస్సెల్ (బి) జాన్సెన్ 17, రమణ్‌దీప్ (సి) శ్రేయాస్ (బి) చాహల్ 0, హర్షిత్ (బి) జాన్సెన్ 3, వైభవ్ (సి) ఇంగ్లిస్ (బి) అర్ష్‌దీప్ 0, నోకియా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 15.1 ఓవర్లలో 95 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-7, 2-7, 3-62, 4-72, 5-74, 6-76, 7-76, 8-79, 9-95, 10-95; **బౌలింగ్:** జాన్సెన్ 3.1-0-17-3, బార్ట్‌లెట్ 3-0-30-1, అర్ష్‌దీప్ 3-1-11-1, చాహల్ 4-0-28-4, మ్యాక్స్‌వెల్ 2-0-5-1.

సాత్విక్ జోడీ వచ్చేసింది!

- గాయత్రి జంట దూరం
- 'సుదిర్మన్' ఫైనల్స్‌కు భారత జట్టు



న్యూఢిల్లీ: సుదీర్మన్ కప్ ఫైనల్స్‌కు భారత బ్యాడ్మింటన్ జట్టును మంగళవారం ప్రకటించారు. మెగా టోర్నీ ఈనెల 27 నుంచి చైనాలోని గ్జియామెన్‌లో జరుగనుంది. పీవీ సింధు, లక్ష్య సేన్ సారథ్యంలో మొత్తం 14 మందితో కూడిన భారత జట్టు ఈ పోటీల బరిలోకి దిగనుంది. మహిళల డబుల్స్‌లో ఏస్ జంట పుల్లెల గాయత్రి/ట్రీసా భుజం గాయం కారణంగా టోర్నీకి దూరమైంది. ఈ జోడీ గైర్హాజరుతో మహిళల డబుల్స్ బాధ్యతలను యువ జంట ప్రియ/శ్రుతి మోయనుంది. ఇక, గతనెల ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ సందర్భంగా వెన్నునొప్పికి గురైన పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి మళ్లీ జట్టులోకి వచ్చేసింది. సాత్విక్ జంటకు బ్యాకప్‌గా హరిహరన్/రుబాన్ కుమార్ ద్వయాన్ని ఎంపిక చేశారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్‌తో పాటు వెటరన్ హెచ్ఎస్ ప్రణయ్, మహిళల సింగిల్స్‌లో సింధుతో పాటు అనుపమ, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా బరిలోకి దిగనున్నారు.

కోనోకార్పస్ మొక్కలను రక్షించుకుందాం

- అవి బహుళ ప్రయోజనాలు అందిస్తాయ్
- కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకొని ఆక్సిజన్‌ను ఇస్తాయ్
- ప్రభుత్వం ఈ మొక్కలను నరికితే సుప్రీంకు వెళ్తాం
- పర్యావరణ వేత్తలు, ప్రముఖ వృక్ష శాస్త్రవేత్తల వెల్లడి

పంజాగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రయోజనాలను అందిస్తున్న కోనోకార్పస్ మొక్కలను రక్షించుకుందామని పర్యావరణవేత్తలు, ప్రముఖ వృక్షశాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కోనోకార్పస్ (దుబాయ్) మొక్కలను రక్షించుకుందాం' అనే అంశంపై జరిగిన సమావేశంలో శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు. ప్రముఖ వృక్ష శాస్త్రవేత్త, యోగివేమన వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, కోనోకార్పస్ మొక్కపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో పరిశోధనలు జరిపిన ప్రొఫెసర్ ఏఆర్ రెడ్డి మాట్లాడుతూ... మొక్కలన్నింటిలో అత్యధిక కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకొని అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తున్న మొక్క కోనోకార్పస్ అని తన పరిశోధనలో తేలిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోనోకార్పస్‌పై జరిపిన పరిశోధనలన్నింటిలో మంచి ప్రయోజనాలున్నాయని స్పష్టమైందని చెప్పారు. ఈ మొక్క భూగర్భ జలాలను ఎక్కువ తీసుకుంటుందనే ప్రచారం అవాస్తవమని, నీటి లభ్యతలేని దుబాయ్, సౌదీ అరేబియాలో వీటిని విరివిగా పెంచుతున్నారని వివరించారు. ప్రజలు అపోహలను నమ్మి మంచి ప్రయోజనాలు గల కోనోకార్పస్ మొక్కలను నరక వద్దని కోరారు. ప్రపంచంలో సగటున ఒక మనిషికి 421 మొక్కలు ఉండగా, బ్రెజిల్‌లో 500, అమెరికాలో 470 ఉండగా భారత్‌లో కేవలం 28 మొక్కలు మాత్రమే ఉన్నాయని అన్నారు. సీసీఎంబీ మాజీ పూర్వ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్. మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రతి మొక్క నుంచి అన్ని ప్రయోజనాలు పొందలేమని, కొన్ని పండ్లు ఇస్తాయని, కొన్ని పూలు ఇస్తాయని, మరికొన్ని నీడను, కలపను ఇస్తాయన్నారు. కోనోకార్పస్ చెట్లు అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తాయని పేర్కొన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావు కోనోకార్పస్ మొక్క ఆక్సిజన్ పీల్చుకొని కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేస్తుందని పేర్కొనడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోనోకార్పస్ చెట్లను నరికే కార్యక్రమాన్ని కొనసాగిస్తే సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ బీ.ఎస్.రెడ్డి, జీవశాస్త్ర నిపుణులు గోపాల కృష్ణ, వీ.ఎస్. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క పూటలోనే కెమోథెరపీ

- ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో ఏర్పాట్లు.. మెరుగైన చికిత్స కోసం అత్యాధునిక యంత్రాలు అందుబాటులోకి..

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ బాధితులు కెమోథెరపీ కోసం రోజుల తరబడి ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం లేకుండా ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి డే కేర్ విధానానికి శ్రీకారం చుట్టింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే కేన్సర్ బాధితులు, వారి బంధువులు ఒక్కపూటలో అన్నీ చక్కబెట్టుకుని ఇంటికి వెళ్లేలా ఏర్పాట్లు చేసింది. ఇంతకుముందు ఆస్పత్రిలో అడ్మిషన్ ఒకరోజు, వైద్య పరీక్షలకు మరోరోజు, ఆరోగ్యశ్రీ నుంచి అప్రూవల్‌కు ఇంకో రోజు సమయం పట్టేది. ఆ తర్వాతే కెమోథెరపీ జరిగేది. ఇప్పుడు అన్నీ ఒకే రోజులో పూర్తయ్యేలా, ఉదయం వస్తే సాయంత్రం తిరిగి వెళ్లిపోయేలా ఏర్పాట్లు చేశామని ఎంఎన్‌జే కేన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. డే కేర్ విధానంలో రోజూ 50 నుంచి 60 మందికి కెమోథెరపీ చేస్తున్నామని చెప్పారు. మెరుగైన రేడియేషన్ థెరపీ కోసం నాలుగు అత్యాధునిక లీనియర్ యాక్సిలరేటర్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. శరీరంలోని అంతర్గత భాగాల్లో వచ్చే కేన్సర్లకు రేడియేషన్ చికిత్స చేసే బ్రాకీ థెరపీని కూడా ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వెల్లడించారు.

ఆంధ్రా టు ఆంధ్రా వయా తెలంగాణ!

విశాఖ నుంచి విజయవాడ వెళ్లాలంటే.. రెండు విమానాలు మారాల్సి వస్తోంది

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవేదన



విశాఖపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విమాన సర్వీసులు ఒక్కొక్కటిగా రద్దయిపోతుండటంతో రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖపట్నం విమానాశ్రయం వెలవెలబోతోంది. విశాఖ నుంచి విమాన సర్వీసులకు ఎడాపెడా మంగళం పాడేస్తున్నారంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. విశాఖలో విమాన ప్రయాణికుల దుస్థితిపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సైతం ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా తనకు ఎదురైన అనుభవాన్ని ఆయన 'ఎక్స్'లో పంచుకున్నారు. విశాఖపట్నం నుంచి అమరావతికి విమానంలో వెళ్లాలంటే... హైదరాబాద్ మీదుగా ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. మంగళవారం సాయంత్రం విజయవాడలో సీఎం చంద్రబాబుతో సమావేశం కావడానికి తాను ఉదయం 8 గంటలకు విశాఖలో బయలుదేరి హైదరాబాద్ చేరుకొని, అక్కడి నుంచి గన్నవరం విమానాశ్రయంలో దిగేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయిందని పేర్కొన్నారు. సీఐఐ, ఫిక్కీ తదితర సంస్థలకు చెందిన వ్యాపారవేత్తలు కూడా తనలాగే విశాఖ నుంచి హైదరాబాద్ వచ్చి, అక్కడి నుంచి విజయవాడ చేరుకున్నారని వివరించారు. మంగళవారం వందేభారత్ రైలు కూడా లేకపోవడంతో రెండు విమానాలు మారాల్సి వచ్చిందని తెలిపారు. విశాఖలో విమాన ప్రయాణికులకు ఎందుకు ఈ దుస్థితి వచ్చిందో ఆలోచన చేసి, తగిన చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. తన ట్వీట్‌ను సీఎం చంద్రబాబు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి లోకేశ్‌కు ట్యాగ్ చేశారు. దాంతో పాటు తాను రెండు విమానాల్లో ప్రయాణించేందుకు తీసుకున్న టికెట్లను సైతం గంటా షేర్ చేశారు. కాగా, మొన్నటి వరకూ విశాఖ నుంచి విజయవాడకు ఇండిగో ఎయిర్‌లైన్స్ రోజూ ఉదయం రెండు సర్వీసులు నడిపింది. ఈ నెల 1నుంచి వాటిని నిలిపివేసింది. ఇప్పుడు విశాఖ నుంచి విజయవాడ వెళ్లాలంటే రైళ్లు లేదా బస్సులపై ఆధారపడాల్సి వస్తోంది. అదీకాకుంటే విమానంలో హైదరాబాద్ వెళ్లి అక్కడినుంచి మరో విమానంలో విజయవాడ చేరుకోవాల్సిందే. దీనికి అదనపు ఖర్చుతో పాటు సమయం కూడా ఎక్కువ పడుతోంది.

విమానాశ్రయం కోసమే అదనపు భూ సమీకరణ

రాజధానిలో ఎయిర్ పోర్టు కోసం ఐదు వేల ఎకరాలు అవసరం

- ల్యాండ్ పూలింగ్‌లో తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధుల విన్నపం
- దీంతో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు, ఇతర పనులకు వేల ఎకరాలు అవసరం
- రాజధానిలో క్రీడా నగరం నిర్మిస్తాం
- మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడతో మహా నగరం ఏర్పాటు
- పురపాలక మంత్రి నారాయణ వెల్లడి
- అనంతవరంలో గ్రావెల్ కొండల పరిశీలన



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు క్రీడా నగరం కూడా నిర్మించనున్నట్టు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అదేవిధంగా తాడేపల్లి, మంగళగిరి, విజయవాడ, గుంటూరు ప్రాంతాలను కలిపి మెగా సిటీ(మహా నగరం) ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నట్టు తెలిపారు. ఒక్క విమానాశ్రయాన్నే ఐదు వేల ఎకరాల్లో నిర్మించనున్నట్టు తెలిపారు. అయితే, రైతుల నుంచి భూ సమీకరణ ద్వారా భూమిని తీసుకోవాలని.. స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారని.. ఇదే జరిగితే మరింత భూమి అవసరం అవుతుందన్నారు. రైతులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్లు, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అవసరాలకు 30-40 వేల ఎకరాలు అవసరం అవుతాయని తెలిపారు. ప్రభుత్వం వద్ద 5 వేల ఎకరాలు ఉంటాయని చెప్పారు. అయితే, పూలింగ్ విధానంలో భూములు తీసుకోవాలా? సేకరించాలా? అనే దానిపై కసరత్తు చేస్తున్నామన్నారు. భూసేకరణ విధానంలో అయితే, రిజిస్ట్రేషన్ ధరకు రెండున్నర రెట్లు మాత్రమే ఎక్కువ వస్తుందని, అలా కాకుండా భూసమీకరణ ద్వారా తీసుకుంటే రైతులకు ప్రయోజనం ఉంటుందని.. ఈ ప్రాంత ఎమ్మెల్యేలు తనకు చెప్పారన్నారు. మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడను కలిపి త్వరలో మెగాసిటీగా ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందన్నారు. రాజధానిలోని అనంతవరంలో ఉన్న గ్రావెల్ కొండలను మంగళవారం మంత్రి నారాయణ పరిశీలించారు. అనంతరం, మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడిందని, దీంతో న్యాయ పరమైన సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవడానికే 8 నెలల సమయం పట్టిందని చెప్పారు. ప్రస్తుతం రాజధానిలో పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. గ్రావెల్ కోసం గనుల శాఖ 851 ఎకరాలను సీఆర్డీయేకు కేటాయించిందని మంత్రి చెప్పారు. రాజధానిలో క్రీడా నగరం కూడా నిర్మించనున్నట్టు తెలిపారు.

అమరావతికి టైమ్ లైన్!

- మరో 10 రోజుల్లో 15 వేల మందితో పనుల పరుగు.
- ఏడాదిలోగా అధికారుల భవనాల నిర్మాణం పూర్తి.
- 4 వేల మంది అధికారులకు సకల సౌకర్యాలతో ఏర్పాటు.
- ఏడాదిన్నరలో 350 కిలో మీటర్ల మేర ట్రంక్ రోడ్లు పూర్తి.
- రెండున్నరేళ్లలో రైతుల లేఅవుట్‌లలో రోడ్లు పూర్తి.
- మూడేళ్లలో ఐకానిక్ భవన నిర్మాణాలు.

గవర్నర్‌తో జీవోసీ అజయ్ మిశ్రా సమావేశం

అల్వాల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా(టాసా) జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీవోసీ) మేజర్ జనరల్ అజయ్ మిశ్రా మంగళవారం రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌తో సమావేశమయ్యారు. జాతీయ నిర్మాణంలో సైన్యం పాత్రకు సంబంధించిన అంశాలను చర్చించారు. రాష్ట్ర అభివృద్ధిలో సైన్యం పాత్ర, మాజీ సైనికుల సంక్షేమంతోపాటు వారి సమస్యలను పరిష్కరించడానికి తీసుకోవాల్సిన అంశాలనూ చర్చించారు. 'ఫ్లాగ్ డే ఫండ్'కు సంబంధించిన కీలక అంశాలపై జీవోసీ, గవర్నర్‌తో మాట్లాడారు. అలాగే జీవోసీ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా డీజీపీ బాస్ హరీశ్ కుమార్ గుప్తాతోనూ సమావేశమయ్యారు.

వేసవి సెలవుల్లోనూ మధ్యాహ్న భోజనం

- అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైకోర్టులో పిల్

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కరువు ప్రభావిత మండలాల్లోని స్కూళ్లు, కాలేజీల్లో వేసవి సెలవుల్లోనూ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. కాకినాడకు చెందిన హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ అఖిల్ శ్రీగురుతేజ ఈ పిల్ దాఖలు చేశారు. కరువు ప్రభావిత మండలాల్లో వేసవి సెలవుల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ 2016లో ఆదేశాలు ఇచ్చిందన్నారు. గత ఏడాది 87 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా.. భోజన పథకాన్ని అమలు చేయలేదన్నారు. ఈ నెల 24 నుంచి విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఫుడ్ సెక్యూరిటీ అలవెన్స్ అందించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ పిల్‌పై హైకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ జరపనుంది.

ఆ స్పీడ్ బ్రేకర్లను తొలగించేలా ఆదేశించండి

- నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు: హైకోర్టులో పిల్

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. న్యాయవాది తాండవ యోగేష్ ఈ పిల్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఏపీఆర్‌డీసీ, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్, పంచాయతీరాజ్ కమిషనర్, డీజీపీలను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. 'ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ)-1996 ప్రకారం ప్రతీ స్పీడ్ బ్రేకర్ 3.7 మీటర్ల వెడల్పు, 0.10 మీటర్ల ఎత్తు ఉండాలి. స్పీడ్ బ్రేకర్ బంప్ 17 మీటర్ల వ్యాసార్థం ఉండాలి. అవి స్పష్టంగా కనిపించేలా తెలుపు, పసుపు రంగులు వేయాలి. స్పీడ్ బ్రేకర్ ఉందని అప్రమత్తం చేసేలా 40 మీటర్ల దూరంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను గుర్తించి, సరిదిద్దేలా అధికారులను ఆదేశించండి. నిబంధనలకు అనుగుణంగా కొత్త స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా ఆదేశించండి' అని పిటిషన్‌లో కోరారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ఈ సమ్మర్ బ్లాక్‌బస్టర్ ఇదే




తమన్నా, హెబ్బా పటేల్, వశిష్ఠ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘనవిజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ చిత్రానికి దర్శకుడు సంపత్‌నంది కథను అందించి దర్శకత్వ పర్యవేక్షణ చేశారు. ఈ గురువారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో శర్వానంద్ మాట్లాడుతూ "ఈ సినిమా ట్రైలర్ చూశాను. అద్భుతంగా ఉంది. బాక్సాఫీస్ దగ్గర ఈ సినిమా మ్యాజిక్ చేస్తుందనే నమ్మకముంది. ఈ సమ్మర్ బ్లాక్‌బస్టర్ ఇదే అవుతుందనిపిస్తోంది" అని అన్నారు. "ఓ గొప్ప సినిమాటిక్ అనుభూతిని ఇచ్చే చిత్రమిది" అని సంపత్ నంది చెప్పారు. "ఇందులో నేను పోషించిన పాత్ర నా కెరీర్లోనే ప్రత్యేకమైనది" అని తమన్నా భాటియా తెలిపారు. "మంచికీ చెడుకూ మధ్య జరిగే యుద్ధం ఈ సినిమా. ప్రేక్షకుల అంచనాలను అందుకుంటుంది" అని మధు అన్నారు. "మునుపెన్నడూ చూడని విజువల్స్ ఈ సినిమాలో ఉండబోతున్నాయి" అని అశోక్‌తేజ చెప్పారు.

ఘనవిజయం సాధిస్తుంది



సునీల్ బలుసు, అశోక్‌వర్ధన్ ముప్పా సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కళ్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించారు. ఈనెల 18న విడుదలవుతున్న సందర్భంగా సునీల్ బలుసు, అశోక్‌వర్ధన్ ముప్పా మీడియాతో ముచ్చటించారు. "ఇది కల్యాణ్‌రామ్ బాడీలాంగ్వేజ్‌కు తగ్గ కథ. ఆయన కోసమే ప్రత్యేకంగా మాస్ అంశాలు పుష్కలంగా ఉండేలా తెరకెక్కించిన సినిమా. హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు, మాస్ ప్రేక్షకుల చేత విజిల్స్ వేయించే పోరాట ఘట్టాలు ఈ సినిమాకు ప్రధానాకర్షణ. ఫైనల్ అవుట్‌పుట్ చూశాం, సినిమా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకముంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. నిర్మాణపరంగా ఎక్కడా రాజీపడలేదు. పెట్టిన ప్రతీ రూపాయి తిరిగివస్తుందన్న నమ్మకం ఉంది. ఈ మధ్య కాలంలో వచ్చిన సినిమాల్లో బెస్ట్ క్లైమాక్స్ ఇదే" అని సునీల్ బలుసు అన్నారు. "విజయశాంతి రోల్ ఈ సినిమాకు చాలా కీలకం. ఆమెకూ హీరోకూ మధ్య వచ్చే సన్నివేశాలన్ని అద్భుతంగా వచ్చాయి. ప్రదీప్ చాలా ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్, అజనీష్ లోక్‌నాథ్ సంగీతం, రామ్‌ప్రసాద్ విజువల్స్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తాయి. సెకండాఫ్ చాలా రేసీగా ఉంటుంది. ఒక్క క్షణం కూడా ప్రేక్షకులు చూపు తిప్పరు" అని అశోక్‌వర్ధన్ ముప్పా చెప్పారు.

'వేవ్స్ బజార్' వినోద రంగంలో మన 'లగాన్'!



ముంబైలో ప్రపంచ ఆడియో విజువల్ & ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను వచ్చే నెల 1 నుంచి 4వ తేదీ వరకు- కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటుడు, జ్యూరీ సభ్యుడు ఆమీర్‌ఖాన్ అందించిన వ్యాసం... చిత్రజ్యోతికి ప్రత్యేకం

అమీర్‌ఖాన్

ప్రపంచవ్యాప్తంగా వినోద, మీడియా పరిశ్రమ అభివృద్ధి చెందుతోంది. ఈ అభివృద్ధిలో మన దేశం కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఆకర్షణీయమైన కథనాలతో పాటుగా అత్యాధునిక సాంకేతికత ద్వారా వచ్చే ఆవిష్కరణలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. దీనికి అనుగుణంగానే అనేక స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్ లభ్యమవుతోంది. స్థానిక భాషల్లో కంటెంట్ లభ్యమవడాన్ని కూడా మనం చూస్తున్నాం. వినోదాన్ని అందించే రంగం మాత్రమే కాకుండా సాంస్కృతికంగా, ఆర్థికంగా, అంతర్జాతీయ సంబంధాల విషయంలోనూ కీలక భూమిక పోషించనుంది. ఈ నేపథ్యంలో- వచ్చే నెల 1 నుంచి 4వ తేదీ వరకు- ముంబైలో ప్రపంచ ఆడియో విజువల్ & ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీనిలో 'వేవ్స్ బజార్' ఒక ముఖ్యమైన భాగం.

వేవ్స్ బజార్ అంటే..

నేను బాలీవుడ్‌లో గత కొన్ని దశాబ్దాలుగా పనిచేస్తున్నా. వినోదంతో పాటుగా సాంకేతికతో సంబంధమున్న పరిశ్రమ ఇది. ప్రజలందరికీ ఏకీకృతం చేసి.. ముందుకు నడిపించగలిగిన శక్తి కథలకు మాత్రమే ఉందని నేను నమ్ముతాను. ప్రపంచ వినోద పరిశ్రమకు ఒక దిశను చూపించటంలో వేవ్స్ బజార్ కీలక భూమిక పోషిస్తుందని నేను భావిస్తున్నా. ప్రపంచవ్యాప్తంగా వినోద పరిశ్రమతో సంబంధం ఉన్న సాంకేతిక నిపుణులు, వాణిజ్యవేత్తలు, క్రియేటర్స్ అందరినీ ఒక తాటి మీదకు తీసుకువచ్చే ప్రయత్నమే వేవ్స్ బజార్. వీరందరూ ఆన్‌లైన్ పద్ధతిలో అనుసంధానమవుతారు. ఈ వేవ్స్ బజార్‌ను ఈ ఏడాది జనవరి 27వ తేదీన కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ అధికారికంగా ప్రారంభించారు. ఆర్థిక, వాణిజ్య రంగాలకు ప్రతి ఏడాది దావోస్‌లో జరిగే సమావేశాలు ఎంత కీలకమో.. వినోద రంగానికి ఈ వేవ్స్ సమావేశాలు అంత కీలకంగా మారాలనేది ప్రస్తుత ప్రభుత్వ ఉద్దేశం. దీనిలో సినిమాలకు, టెలివిజన్‌కు, రేడియోకి యానిమేషన్‌కు, గేమింగ్‌కు, ప్రకటనారంగానికి, సంగీత రంగానికి, సౌండ్ డిజైన్‌కు సంబంధించిన నిపుణులు అనుసంధానమవ్వచ్చు. తమ సృజనాత్మక ఉత్పత్తులను విక్రయించవచ్చు. లేదా కొనుగోలు చేయవచ్చు. దీనిని ప్రారంభించి మూడు నెలలు అయింది. దీనిలో సుమారు 5500 కొనుగోలుదారులు, 2000 మంది విక్రయదారులు, 1000కి పైగా ప్రాజెక్టులు నమోదయ్యాయి. దీర్ఘకాలంలో ఇది కంటెంట్‌కు సంబంధించిన ఒక నెట్‌వర్కింగ్ హబ్ అవుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు. ఉదాహరణకు ఒక ఫిల్మ్‌మేకర్ తనకు భాగస్వామి కావాలనుకుంటే దీనిలో వెతుక్కోవచ్చు. గేమ్స్‌ను రూపొందిస్తున్న యువ టెక్నిషియన్స్‌కు ఇందులో పెట్టుబడిదారులు దొరుకుతారు. ఆర్టిస్టులకు తాము నటించిన క్లిప్పింగ్స్ దీనిలో ప్రదర్శించుకొనే సౌలభ్యం ఉంటుంది. భౌగోళిక హద్దులు లేకుండా తమ సృజనాత్మకతను ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శించుకోవటానికి వేదిక లభిస్తుంది.

ప్రత్యక్షంగా చూసే అవకాశం..

వేవ్స్ బజార్ కేవలం ఆన్‌లైన్‌కు మాత్రమే పరిమితం. అయితే ఈ సారి జరుగుతున్న వేవ్స్ సమావేశంలో కొందరికి ఈ బజార్‌లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. భవిష్యత్‌లో వినోద రంగానికి సంబంధించిన నెట్‌వర్కింగ్ ఎలా ఉండబోతోందనే విషయాన్ని ఈ సారి వేవ్స్ బజార్ నిర్దేశిస్తుందనటంలో నాకు ఎటువంటి సందేహం లేదు. ఒక నటుడిగా నా సృజనాత్మకతకు హద్దులు ఉన్నాయని నేను భావించను. ప్రస్తుతం ఉన్న హద్దులను దాటి నన్ను నేను నిరూపించుకోవటానికి ఉన్న వేదికల కోసం అన్వేషిస్తూ ఉంటాను. వేవ్స్‌లో అలాంటి వేదిక లభించనున్నదని నా నమ్మకం. ఈ వేవ్స్ ప్రస్థానంలో నేను కూడా భాగస్వామిని అయినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఒక కథను చెప్పే తీరును వేవ్స్ మార్చేస్తుందని నేను భావిస్తున్నా. లగాన్ సినిమాలో బ్రిటిష్‌వారిపై స్థానికులు పట్టుదలతో ఆడి.. అనేక అడ్డంకులు దాటి విజయం సాధిస్తారు. వేవ్స్ కూడా మన దేశానికి అలాంటి లగాన్ మూమెంట్ అని నేను నమ్ముతున్నా.





రూ.5 కోట్లు పరిహారం చెల్లించాల్సిందే!

- అజిత్‌కుమార్ సినిమాకు ఇళయరాజా నోటీసులు

అజిత్‌కుమార్ హీరోగా రూపొందిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్ర నిర్మాతలు రూ.5 కోట్ల పరిహారం చెల్లించాలని పేర్కొంటూ ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా నోటీసులు జారీ చేశారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించగా, ఈ నెల 10వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. అయితే, గతంలో 'నాట్టుపురపాట్టు', సకలకళా వల్లవన్, 'విక్రమ్' సినిమాలకు తాను స్వరాలు సమకూర్చిన మూడు పాటలను ఈ మూవీలో తన అనుమతి లేకుండా రీ క్రియేట్ చేశారని ఇళయరాజా నోటీసుల్లో పేర్కొన్నారు. అందుకుగాను రూ.5 కోట్ల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేగాక ఆ పాటలను తొలగించడంతో పాటు నిర్మాతలు క్షమాపణ చెప్పాలని ఇళయరాజా పంపిన నోటీసుల్లో పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

సిద్ధార్థ కాలేజీలో కాపీయింగ్‌పై విచారణ

- ఎంబీబీఎస్ పరీక్షల్లో 'చూచిరాత'లపై ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఆగ్రహం
- సమగ్ర విచారణకు డీఎంఈకు ఆదేశం
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సప్లిమెంటరీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ వ్యవహారంపై ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన "సిద్ధార్థలో 'శంకర్‌దాదాలు'" కథనంపై స్పందించిన ఆయన.. కాపీయింగ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని డీఎంఈ డాక్టర్ నరసింహంను ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉంది? ఏ స్థాయిలో అధికారులు సహకరించారు? అన్న అంశాలపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. కాపీయింగ్‌కు దారితీసిన వ్యవస్థాగత, వ్యక్తిగత లోపాలపై దృష్టి సారించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకొనే దిశగా నివేదిక ఉండాలని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం మంత్రి సత్యకుమార్ ఒక ప్రకటన చేశారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీలో గత వారం ఐదుగురు విద్యార్థులు కాపీ కొడుతూ పట్టుబడ్డారు. ఇందులో నలుగురు మంగళగిరిలోని ఓ ప్రముఖ మెడికల్ కాలేజీకి చెందిన వారు ఉన్నారు. కాపీయింగ్‌కు కాలేజీ ఎగ్జామినేషన్ విభాగం ఉద్యోగులు, సిబ్బంది సహకరిస్తున్న వైనంపై 'ఆంధ్రజ్యోతి' గతవారం కథనం ఇచ్చింది.

రాష్ట్రంలో మరో హోమియో కాలేజీ


మరోవైపు ఆయుష్ వైద్య విధానాలను ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో మరో హోమియోపతి కాలేజీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం ముత్తిరేవుల గ్రామంలో ప్రైవేటు హోమియోపతి కాలేజీ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటి వరకూ రాష్ట్రంలోని ప్రైవేటు రంగంలో 4 హోమియోపతి కాలేజీలు ఉండగా.. కొత్త కాలేజీ ఏర్పాటుతో వాటి సంఖ్య ఐదుకు చేరుతుంది. ఈ కాలేజీల్లో బీహెచ్ఎంఎస్ కోర్సులకు సంబంధించి 100 సీట్లు అందుబాటులోకి వస్తాయి.

18 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్‌శాఖలో బదిలీలు చేపడుతూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 18 మంది అధికారులను బదిలీ చేయడంతో పాటు కొందరికి పోస్టింగ్‌లు ఇస్తూ బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చింది.

సెర్ప్‌లోకి వెలుగు కమ్యూనిటీ సర్వేయర్లు

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్వే విభాగంలో పనిచేస్తున్న వెలుగు కమ్యూనిటీ సర్వేయర్లను తిరిగి సెర్ప్ విభాగంలోకి తీసుకొస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వెలుగు కమ్యూనిటీ సర్వేయర్లు సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు పరిధిలో పనిచేస్తున్నారు. వారిని రీపాట్రియేట్ చేస్తూ పంచాయతీరాజ్ ఎక్స్ అఫిషియో సెక్రటరీ కరుణ వాకాటి ఉత్తర్వులు ఇచ్చారు.



నోటీసు బోర్డు

అచ్చ తెలుగు 'అగ్ని'!

ఇంగ్లీషులో చదివి అర్థం చేసుకోగలరు

రాజమండ్రి అగ్నిమాపక కేంద్రం తెలుగు మయం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

తెలుగును ప్రేమించాలి. తెలుగు భాషను కాపాడుకోవాలి. సరైన తెలుగు పదం అందుబాటులో ఉంటే... అన్య భాషా పదాన్ని పరిహరించాలి. అయితే... తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఇన్నీసుపేట అగ్నిమాపక సేవల కేంద్రంలో అడుగు పెడితే... తెలుగు మరీ ఎక్కువగా, పండితులకు కూడా అర్థంకాని స్థాయిలో 'వెలుగుతూ' కనిపిస్తుంది. ఇక్కడ పని చేస్తున్న జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ ఘనత ఇది! సోమవారం నుంచి అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముద్రించిన కరపత్రం, అక్కడి నోటీసు బోర్డు, ఇతర అన్ని చోట్లా అచ్చ తెలుగును ఉపయోగించారు. అక్కడ... 'కాపాడుటయే మా ఉడిగము' అనే నినాదం కనిపిస్తుంది. అర్థమైతే సరే! తెలుగులో అర్థంచేసుకోలేని వాళ్లు అక్కడే ఇంగ్లీషులో చదివి అర్థం చేసుకోవచ్చు. అది... 'వుయ్ సర్వ్ టు సేవ్'కు తెలుగు రూపం! 'అగ్నిమాపక వారోత్సవాలు' అని అర్థమయ్యేలా చెప్పే అవకాశమున్నా 'మంటమాపు ఏడునాళ్ల వేడుకలు' అని అచ్చ తెలుగును ప్రయోగించారు.



కరపత్రం పైభాగం

వెంపైలపు భారతమ్ము-వెలిగింపగ కలిసిరమ్ము అని మరో నినాదం. అగ్నిప్రమాదాలు లేని దేశం కోసం కలిసి కృషి చేద్దాం.. అని దీని అర్థం. ఎల్పీజీని ఈద అని, డీజిల్‌ను 'మంచి చమురు' అని, పెట్రోలును 'వాడ చమురు' అని, లైటర్‌ను 'చిచ్చు గోళ్ల' అని తెనిగీకరించారు. 'అగ్గిపెట్టె' అని అందరికీ అర్థమయ్యే పదాన్ని కూడా 'చిచ్చుపెట్టె' చేసేశారు. అనువెనను(రెగ్యులేటర్), మించుమొన (ఎలక్ట్రికల్ పాయింట్), చదునెనలు(ఇస్త్రీ పెట్టెలు), దంచెనలు (మిక్సీలు), ఉతుకెనలు (వాషింగ్ మిషన్లు), వంచమీట (మెయిన్ స్విచ్), విడివిడి చిరువళి విరుపు(ఎంసీబీ), మించువంచమీట (ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్), మించుపరతి (విద్యుత్ ప్రవాహం), బిరడా (ప్లగ్)లాంటి పదాలనూ ప్రయోగించారు. ఉద్యోగుల డ్యూటీలు తెలిపే బోర్డులో సైతం.. మంట పిలుపులు(ఫైర్ కాల్స్), కాపుగడ పిలుపులు(రెస్క్యూ కాల్స్), చేకావలి ఆగవులు (స్టాండ్‌బై డ్యూటీలు), మంట పిలుపు వెరసు (ఫైర్ కాల్ నెంబరు), చాటింపు పలక (నోటీసు బోర్డు) అని అచ్చంగా తెలుగులో రాసేశారు. తెలుగు భాషాభిమానం, ప్రేమ ఉండటం గొప్ప విషయమే! కానీ... జనం మాత్రం ఈ తెలుగును అర్థం చేసుకోలేక తెప్పరిల్లుతున్నారు. దీని గురించి ప్రశ్నించగా... 'పదాలను మనం పుట్టిస్తే తప్పా? తెలుగు పేరుతో చాలామటుకు సంస్కృత పదాలే వాడుతున్నాం' అని శ్రీనివాస్ పేర్కొన్నారు.

'నైరుతి'లో వర్షాలే వర్షాలు!

- ఈసారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం
- ఏపీలోనూ సమృద్ధిగా వానలు పడే అవకాశం
- భారత వాతావరణ శాఖ వెల్లడి

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశంలోని కోట్లాది మంది రైతులకు భారత వాతావరణ శాఖ మంగళవారం తీపికబురు చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో (జూన్-సెప్టెంబరు) సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. దీర్ఘకాలిక సగటులో 105 శాతం వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. వరుసగా రెండో ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. 'దేశంలో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు మధ్య సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక సగటు 87 సెంటీమీటర్ల వర్షపాతంతో పోల్చుకుంటే.. 105% ఎక్కువగా వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నాం" అని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర చెప్పారు. రుతుపవన వేగాన్ని ప్రభావితం చేసే ఎల్‌నినో పరిస్థితులు ఈ దఫా తక్కువగానే ఉంటాయని తెలిపారు. అధిక వర్షపాతం నమోదు అంచనాల నేపథ్యంలో వ్యవసాయం, దానిపై ఆధారపడిన ఆర్థిక రంగాలు పుంజుకునే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ ఆధారిత స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) 18 శాతంగా ఉన్న నేపథ్యంలో ఇది మరింత పెరగడం లేదా స్థిరంగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇదిలావుంటే, సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురిసినా.. దేశంలోని అన్ని ప్రాంతాలకు సమానంగా ఉండే అవకాశం లేదని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కాగా, గత ఏడాది 106% వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణశాఖ అంచనా వేయగా, 108% నమోదు కావడం గమనార్హం.


అనంతపురం జిల్లా బండ్లపల్లి వద్ద దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

మెజార్టీలో ప్రాంతాల్లో అధిక వానలే

నైరుతి రుతుపవనాల సీజన్‌కు సంబంధించి ఐఎండీ ఈ తొలిదశ దీర్ఘకాలిక అంచనా బులెటిన్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం దేశంలో దక్షిణ, మధ్య, పశ్చిమ, ఉత్తర భారతాల్లోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయి. కోర్ మాన్‌సూన్ ప్రాంతంగా పిలిచే మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమబెంగాల్‌తోపాటు దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదు కానున్నది. జమ్మూకశ్మీర్, బీహార్, తమిళనాడు, ఈశాన్యంలో సాధారణం కంటే తక్కువ నమోదు కానున్నది.

ఈసారి రాష్ట్రంలో మంచి వర్షాలు

వ్యవసాయంపై ఎక్కువగా ఆధారపడే ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది నైరుతి సీజన్‌లో మంచి వర్షాలు కురవనున్నాయి. గత ఏడాది కోస్తాలో శ్రీకాకుళం, ప్రకాశం, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో వర్షాభావం కొనసాగింది. ఈ ఏడాది మాత్రం ఉత్తర కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అత్యంత ఎక్కువగా, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురుస్తాయని, రాయలసీమలోని అన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానున్నదని ఐఎండీ వెల్లడించింది. కృష్ణా, గోదావరి బేసిన్ పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

4 రోజులు ఈదురుగాలులతో వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, అనంతపురం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపరితలద్రోణి, నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, వాయువ్యగాలులతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరిగింది. వీటి ప్రభావంతో మంగళవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఆ తర్వాత నాలుగు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడా ఈదురు గాలులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

అనంతలో రూ.2.28 కోట్ల పంటనష్టం

అనంతపురం జిల్లాలో సోమవారం రాత్రి ఈదురు గాలులు, వర్ష బీభత్సానికి 266.6 హెక్టార్లల్లో రూ.2.88 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి.

మైనార్టీలకు జగన్ మోసం

- రాజ్యసభలో వక్ఫ్‌బిల్లుకు మద్దతు
- ఆపై సిగ్గులేకుండా సుప్రీంలో కేసా?: ముస్తాక్ అహ్మద్

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మైనార్టీలను మభ్యపెట్టి మోసం చేయాలని జగన్ ప్రయత్నిస్తున్నారని, కానీ అది కుదరని పని అని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ విమర్శించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ బిల్లును వైసీపీ ఎంపీలు లోక్‌సభలో వ్యతిరేకించి, రాజ్యసభలో మద్దతుగా ఓటేశారని అహ్మద్ తెలిపారు. గతంలో ఎన్డీయేకు మద్దతు అవసరం లేకున్నా సీఏఏ, ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 వంటి మైనార్టీ వ్యతిరేక బిల్లులకు వైసీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, ఇప్పుడు సిగ్గు లేకుండా వక్ఫ్ సవరణ చట్టంపై వైసీపీ సుప్రీంకోర్టుకు వెళ్లి ముస్లిలను మోసం చేస్తోందని మండిపడ్డారు.

సుప్రీంలో వైసీపీ పిటిషన్ ఓ డ్రామా: ఫరూఖ్ షిబ్లీ

సుప్రీంకోర్టులో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా వైసీపీ పిటిషన్ వేయడం ఒక డ్రామా అని రాష్ట్ర మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫరూఖ్ షిబ్లీ విమర్శించారు. మంగళవారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'వక్ఫ్ బిల్లుపై సీఎం చంద్రబాబు ప్రతిపాదించిన సవరణలను ముస్లిం సమాజం అభినందిస్తోంది. పార్లమెంటు సాక్షిగా జగన్ ముస్లింలకు ద్రోహం చేశారు. వైసీపీ ఎంపీలు రాజ్యసభలో బిల్లుకు మద్దతుగా ఓటు వేసి బయట మాత్రం బిల్లును వ్యతిరేకించినట్లు కబుర్లు చెబుతున్నారు' అని షిబ్లీ అన్నారు.

నేడు విదేశీ పర్యటనకు సీఎం కుటుంబం

ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా విదేశీ పర్యటనకు వెళుతున్నారు. బుధవారం రాత్రి 9 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి చేరుకుంటారు. అక్కడి నుంచి విదేశీ పర్యటనకు వెళ్తారు. చంద్రబాబుతోపాటు ఆయన సతీమణి భువనేశ్వరి, లోకేశ్ దంపతులు వెళుతున్నారు. ఈ పర్యటనలోనే ఈనెల 20న చంద్రబాబు 75వ పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోనున్నారు.

నేడు ఎమ్మెల్సీలుగా బీద, గాదె ప్రమాణస్వీకారం

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన బీద రవిచంద్ర, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా ఎన్నికైన గాదె శ్రీనివాసులు బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు చైర్మన్ మోషేన్ రాజు వీరితో ప్రమాణస్వీకారం చేయించనున్నారు.

మహానాడు విజయవంతం కావాలని పల్లా పూజలు

కడపలో నిర్వహించనున్న మహానాడు టీడీపీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలవాలని ఆకాంక్షిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గుజరాత్‌లోని ద్వారకాలో ద్వారకాధీశుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ద్వారక ఆలయానికి వెళ్లిన ఆయన మహానాడు విజయవంతం కావాలని పూజలు చేశారు.

సలహాదారు ఆర్‌పీ ఠాకూర్‌కు విధులు కేటాయింపు

ఏపీ ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్పీ ఠాకూర్ విధులు, జీతభత్యాల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర విభజన సమస్యలు, మావోయిస్టు వ్యవహారాలు, కేంద్ర హోంశాఖ నుంచి రాష్ట్రాలకు కేటాయించే నిధులు, రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు కేంద్ర సంస్థలతో సహకారం తదితర బాధ్యతలు నిర్వర్తించాలని మంగళవారం విడుదల చేసిన జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఢిల్లీలో విధులు నిర్వర్తించే ఠాకూర్‌కు నెలకు రూ.2.5లక్షల జీతంతోపాటు ఇంటి అద్దె నెలకు రూ.లక్ష, కారు, డ్రైవర్లు, ఇతర అలవెన్సులు, కార్యాలయం, ఐదుగురు ఉద్యోగుల్ని కేటాయించింది. రెండేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు.

ఉపాధి సిబ్బంది పదోన్నతులకు లైన్ క్లియర్

గ్రామీణాభివృద్ధిశాఖలో పనిచేసే ఉపాధి సిబ్బంది సమస్యల పరిష్కారానికి గ్రామీణాభివృద్ధిశాఖ చర్యలు ప్రారంభించింది. ఉపాధి సిబ్బందికి పదోన్నతులకు అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకుంది. వారి డిమాండ్లలో ప్రధానమైన బదిలీలు ఇప్పటికే పూర్తి చేశారు. ఇప్పుడు వారి అర్హత, అనుభవాన్ని బట్టి పదోన్నతులు కల్పించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు కమిషనర్ కృష్ణతేజ మంగళవారం అధికారుల సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. పదోన్నతులకు సీనియారిటీ జాబితా రూపొందించి కసరత్తు ప్రారంభించాలని ఎస్ఆర్‌డీఎస్ మెంబర్ సెక్రటరీ మద్దిలేటికి సూచనలిచ్చారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి సిబ్బంది హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

నేడు కందుకూరి రంగస్థల పురస్కారాల ప్రదానం

అమరావతి, విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకుని బుధవారం నిర్వహించే తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ముగ్గురికి కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగస్థల పురస్కారం, 107 మంది కళాకారులు, సాంకేతిక నిపుణులకు కందుకూరి విశిష్ట పురస్కారాలను అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి పురస్కార గ్రహీతలకు లక్ష నగదు, జిల్లాస్థాయిలో 10 వేల నగదు బహుమతిని అందిస్తామన్నారు. రాష్ట్రస్థాయి అవార్డులకు ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, కందిమళ్ల సాంబశివరావు, గుర్రాల రవికృష్ణ ఎంపికైనట్లు తెలిపారు.

ఉత్తమ సమాజానికి ఉపాధ్యాయుల పాత్రే కీలకం

- ప్రెసిడెన్సీ ఫౌండర్ చాన్సలర్ నిస్సార్ అహ్మద్


ఇన్‌స్పైర్డ్ 2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ నిస్సార్ అహ్మద్

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజానికి విద్యార్థులు ముఖ్యమని, వారిని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రెసిడెన్సీ యూనివర్సిటీ ఫౌండర్ చాన్సలర్ నిస్సార్ అహ్మద్ అన్నారు. ఐదు దశాబ్దాల విద్యారంగంలో ప్రయాణంపై ఇన్‌స్పైర్డ్ 2025 పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ రచయిత్రి అనితా నాయర్, మాజీ ఐపీఎస్ సంజయ్‌సహాయ్, ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్ డైరెక్టర్ నఫీజా అహ్మద్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ, విద్యారంగంలో ఎన్నో మైలురాళ్లు అధిగమించామని, నిర్మాణాత్మకమైన విద్య అందించే లక్ష్యాన్ని కొనసాగించామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఈ సందర్భంగా దీర్ఘ సేవా ప్రశస్తి, అత్యుత్తమ అధ్యాపక పురస్కారం, ఇన్‌స్టిట్యూషనల్ లెగసీ అవార్డులను ప్రదానం చేశారు.


జాతీయ రొయ్యల సమన్వయ కమిటీ ఏర్పాటుపై ఉన్నతస్థాయి సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, ఆనం వెంకట రమణారెడ్డి తదితరులు

ఆక్వా సమస్యలపై దూకుడు

- ఏపీ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఏర్పాటు
- కౌంట్‌ల వారీగా ధరల నిర్ణయం.. ధరల స్థిరీకరణకు కమిటీ ఏర్పాటు
- దేశీయంగా వినియోగం పెంచేలా ప్రచారం
- డిప్యూటీ స్పీకర్ రఘురామ అధ్యక్షతన ఆక్వా భాగస్వామ్య పక్షాల భేటీ

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం దూకుడుగా ముందుకు వెళుతోంది. ఇందుకోసం ఏపీ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కంపెనీ(ఏపీపీపీసీ)ని ఏర్పాటు చేసింది. విజయవాడలోని మత్స్య శాఖ కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అధ్యక్షతన మంగళవారం ఆక్వా రంగ భాగస్వాముల ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. నెక్ ఉపాధ్యక్షుడు సురేశ్‌రాయుడు చిట్టూరి, ఏపీ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ష్రింప్ ఫీడ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీద మస్తాన్‌రావు, మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్, ఆక్వా రైతుప్రతినిధులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. జాతీయ రొయ్యల సమన్వయ కమిటీ ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చించారు. ఎన్‌పీసీసీకి బదులు ఏపీపీపీసీ ఏర్పాటు చేయాలని భాగస్వాములు ప్రతిపాదించారు. ఏపీపీపీసీ విధివిధానాలపై సుదీర్ఘంగా చర్చించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం తరహాలో ఏపీ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సాధించే అంశంపై చర్చించారు. ప్రముఖులు, సినీ నటుల వంటి సెలబ్రిటీలతో ప్రచారం నిర్వహించి, దేశీయంగా రొయ్యల వినియోగాన్ని పెంచడం, రొయ్యల్లోని పోషకాహార విలువలపై ప్రజలకు అవగాహన కల్పించడం, చికెన్ షాపుల ద్వారా 100, 250, 500 గ్రాముల రొయ్యలను వంటకానికి, తినడానికి వీలుగా ప్యాకెట్లలో అమ్మాలన్న సూచనలు చేశారు. ఆక్వా రైతుల అవసరాలు, ఎగుమతులు, దేశీయ వినియోగం, కౌంట్‌ల వారీగా రొయ్యల ధర స్థిరత్వం, ఇన్‌పుట్స్ ఖర్చు నియంత్రణ, తక్కువ ధరకు ఉత్పత్తిచేసే పద్ధతులపై చర్చించారు. రాష్ట్రంతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఆక్వా ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యూహాలను మెరుగుపర్చడం ద్వారా జాతీయ రొయ్యల సమన్వయ కమిటీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, రాష్ట్రస్థాయిలో క్లస్టర్, డివిజనల్, జోన్ల వారీగా ఏపీపీపీసీని ఏర్పాటు చేయాలని, అంతర రాష్ట్ర ఎగుమతులు పెంచాలని నిర్ణయించారు. రొయ్యల ఎగుమతిదారులు గత వారం నుంచి కొనుగోలు ధరల విషయాన్ని వాయిదా వేస్తున్న నేపథ్యంలో.. చర్చల ద్వారా 100కౌంట్ రొయ్యలు రూ.230, 90కౌంట్ రూ.240, 80 కౌంట్ రూ.260, 70కౌంట్ రూ.280, 60 కౌంట్ రూ.305, 50కౌంట్ రూ.325, 40 కౌంట్ రూ.345 చొప్పున రానున్న 10రోజుల వరకు కొనుగోలు చేయడానికి ఎగుమతిదారులు అంగీకారం తెలిపారు. ఈ ధరలపై మళ్లీ ఈ నెల 25న నిర్ణయం తీసుకునేందుకు రైతులు, ఎగుమతిదారులు, అధికారులతో కూడిన ధరల స్థిరీకరణ కమిటీని ఏర్పాటు చేశారు.

'తొక్కిసలాట' ఘటనపై తుది దశకు న్యాయ విచారణ!

- నేడు తిరుమలకు న్యాయవిచారణ కమిషన్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి తొక్కిసలాట' ఘటనపై న్యాయ విచారణ ముగింపు దశకు వచ్చింది. వచ్చే నెల మొదటి వారంలో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన 5వ దశ విచారణలో ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి ఎదుట టీటీడీ తరపున దేవస్థానాల లా ఆఫీసర్(డీఎల్వో) వరప్రసాదరావు హాజరయ్యారు. ఘటనకు సంబంధించిన రికార్డులను కమిషన్‌కు అందజేశారు. ఇక జస్టిస్ సత్యనారాయణమూర్తి బుధవారం తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు క్యూలైన్లను మరోసారి పరిశీలిస్తారు. చివరిగా విచారణకు హాజరు కావాలంటూ టీటీడీ ఈవోకు సమన్లు పంపనున్నట్లు తెలిసింది. భవిష్యత్తులో టీటీడీ ఆలయాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు, సలహాలు, సూచనలతో.. రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందజేయనున్నట్లు తెలిసింది.

6 నెలల్లో పునరావాసం!

పోలవరం తొలి దశలో నిర్వాసితుల కాలనీల పూర్తికి కసరత్తు

- చింతూరు, కేఆర్‌పురం ఐటీడీఏల పరిధిలో 48 గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ
- ఈ నెలాఖరుకల్లా ముసాయిదా సిద్ధం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)


గోకవరం మండలం కృష్ణుడి పాలెంలో పునరావాస కాలనీ

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకోవడానికి ప్రభుత్వం సమాయత్తమైంది. ప్రధానంగా హెడ్‌వర్క్స్ నిర్మాణాలకు సమాంతరంగా పునరావాస కాలనీల నిర్మాణం కూడా చేపట్టి ఆరు నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. చింతూరు, కేఆర్‌పురం ఐటీడీఏల పరిధిలో సహాయ పునరావాస (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీ ముసాయిదాకు రూపకల్పన చేస్తోంది. వేగంగా పనులు జరగని చోట్ల కాంట్రాక్టులు రద్దుచేసింది. కొత్త కాంట్రాక్టర్ల కోసం టెండర్లు పిలిచేందుకు సిద్ధమైంది. ఇటీవల పోలవరం ప్రాజెక్టులో క్షేత్ర స్థాయిలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. ప్రాజెక్టు పూర్తయ్యేలోపు నిర్వాసితులకు పూర్తిస్థాయి సహాయ పునరావాసం అందిస్తామని ప్రకటించారు. ప్రాజెక్టు తొలి దశలో మొత్తం 38,060 కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. ఈ పనులను పరుగులు తీయించడానికి తొలి దశ పనులను ఏ, బీ కేటగిరీలు వర్గీకరించారు. ఫేజ్-1ఏలో 20,946 కుటుంబాలు ఉన్నాయి. వారికోసం ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 75 కాలనీల నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకూ 26 పూర్తయ్యాయి. 14,369 కుటుంబాలను తరలించారు. 49 నిర్మాణంలో ఉన్నాయి. ఇంకా 6,577 కుటుంబాలను తరలించాల్సి ఉంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వివిగతా 49 కాలనీల్లో పనులు వేగవంతంగా జరుగకపోవడం, గత ప్రభుత్వం నిర్వాకం వల్ల సమస్యలు పేరుకుపోవడం, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు మందగించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం జనవరిలో అప్పటి వరకూ ఉన్న పెండింగ్ బిల్లులను విడుదల చేసింది. ఇంకా రూ.120 కోట్ల వరకూ పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ బిల్లులను ఆయా ఈఈలు సమర్పించాల్సి ఉంది. ప్రస్తుతం అదీ పూర్తవుతోంది. అల్లూరి, ఏలూరు జిల్లాల్లో ప్రస్తుతం కాంట్రాక్టు రద్దయిన 49 కాలనీల్లో మొత్తం 13,938 ఇళ్ల నిర్మించాల్సి ఉండగా ఇప్పటికి 11,659 నిర్మించారు. ఈ ప్రాంతాల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భవనాలు పూర్తవలేదు. వీటన్నిటినీ సెప్టెంబరుకు పూర్తి చేసి.. నవంబరుకల్లా 6,577 కుటుంబాలను తరలించాలన్నది లక్ష్యం..

48 గ్రామాలకు ముసాయిదా సిద్ధం

ఫేజ్-1బీ కింద చింతూరు, కేఆర్‌పురం ఐటీడీఏల పరిధిలోని 48 గ్రామాలకు చెందిన 17,114 కుటుంబాలకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయడానికి ఆర్ అండ్ ఆర్ ముసాయిదాను ఈ నెలాఖరులోపు సిద్ధం చేయనున్నారు. కేఆర్‌పురంలో గ్రామసభలు పూర్తి చేశారు. చింతూరు పరిధిలోని 32 గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ భూమికి భూమి ఇవ్వడంతో పాటు నష్టపరిహారం, పునరావాస కాలనీల నిర్మాణం చేయాలి. ముసాయిదాను మే 31కల్లా ప్రచురించి.. జూలైకి అవార్డుకు ఆమోదం పొందే దిశగా కసరత్తుచేస్తున్నారు.

పోలవరం చేరుకున్న కేంద్ర నిపుణులు

పోలవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బృందం మంగళవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుంది. మట్టి, రాతి నాణ్యత నిపుణులు బి.సిద్దార్థ్ హెడావో, సైంటిస్టు ఏఆర్వో విపుల్ కుమార్ గుప్తా వీరిలో ఉన్నారు. ఈ బృందం ప్రాజెక్టులో గ్యాప్-1, గ్యాప్-2, డయాఫ్రం వాల్ ప్రాంతాల్లో బుధవారం నుంచి 18వ తేదీ వరకు పర్యటించనుంది. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో దండంగి, మట్టి డంపింగ్ ప్రాంతాల్లో నాణ్యతా ప్రమాణాల పరీక్షలు నిర్వహిస్తుంది. ఆయా నిర్మాణాల వినియోగానికి ఆ మట్టి ఎంతవరకు అనుకూలమో తేల్చి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, పీపీఏ, కేంద్ర జలసంఘానికి నివేదిక సమర్పిస్తుంది.

ఆర్‌అండ్‌ఆర్ పనులు వేగవంతం



సీఎం చంద్రబాబు ఆదేశాలతో పోలవరం భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ పనులు వేగవంతం చేశాం. 49 పునరావాస కాలనీల పాత కాంట్రాక్టును రద్దు చేశాం. అతి త్వరలోనే కొత్త టెండర్లు పిలిచి ఆరునెలల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తాం. చింతూరు, కేఆర్‌పురం ఐటీడీఏల పరిధిలో నిర్వాసితులకు రెండున్నర ఎకరాల వరకూ భూమికి భూమి ఇస్తాం.

- వి.అభిషేక్, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి, ధవళేశ్వరం.

'గుంటూరు'లోనూ అజయ్ దందా!

- ఆరు క్రషర్లపై కన్నేసిన వైనం
- వ్యాపారుల అప్రమత్తతతో ఫలించని ప్రయత్నం
- ఇక 'మైనింగ్ డాన్'కు కళ్లెం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మైనింగ్ డాన్... కొల్లాం అజయ్ లీలలు మరిన్ని బయటపడుతున్నాయి. రాష్ట్రంలోని మరిన్ని జిల్లాలకు ఆయన దందా విస్తరించినట్లు వెల్లడైంది. 'మైనింగ్ డాన్'పై మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం సంచలనం సృష్టించింది. అజయ్ రచ్చపై ఉన్నతస్థాయిలో దృష్టి సారించి... ఆయనకు కళ్లెం వేసేందుకు రంగం సిద్ధమైంది. మరోవైపు... గుంటూరులోని క్రషర్స్ వ్యాపారులపైనా అజయ్ తన ప్రతాపం చూపించినట్లు తెలిసింది. అమరావతి నిర్మాణం కోసం భారీగా మెటల్ అవసరమవుతోంది. దీంతో... అజయ్ గుంటూరులోని ఆరు ప్రముఖ క్రషర్‌యూనిట్లపై కన్నేశారు. వాటిని తమకు ఇచ్చేయాలని గనుల అధికారి ద్వారా రాయబారం పంపించారు. ఇందుకోసం తొలుత గనుల శాఖలోని కీలక వ్యక్తి వద్ద పని చేసిన ఒక అధికారి ఆయా కంపెనీలకు, గుంటూరు గనుల అధికారికి ఫోన్ చేశారు. "ఆ మైన్‌లు మాకు కావాల్సిన వ్యక్తికి కావాలి. 2 లక్షల టన్నుల రాయిని సరఫరా చేసే కాంట్రాక్టు మేం తీసుకోబోతున్నాం. కాబట్టి మీ యూనిట్లను అజయ్‌కి అప్పగించండి. లేదంటే విజిలెన్స్ దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ఫోన్‌లో హెచ్చరించారు. గుంటూరు వ్యాపారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఇదంతా అజయ్ చేయిస్తున్న మంత్రాంగమని గ్రహించారు. చివరికి... ఈ వ్యవహారంలో గుంటూరు గనుల అధికారి బద్నాం అయ్యారు. దీంతో ఆయన మనస్తాపానికి గురై సెలవుపై వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

గనుల ఆదాయానికి రెక్కలు

» మైనర్ మినరల్-2022 పాలసీలో కీలక సవరణలు

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గనులు, ఖనిజాల తవ్వకం ద్వారా వచ్చే ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మైనర్ మినరల్ పాలసీ-2022లో కీలక సవరణలు చేసింది. వ్యాపారాన్ని మరింత సులభతరం చేసేలా కొత్త విధానాలను పేర్కొంటూ మైనర్ మినరల్ పాలసీ-2025ని రాష్ట్ర మంత్రివర్గం మంగళవారం ఆమోదించింది. ఒకప్పుడు జీడీపీలో మైనింగ్ రంగం వాటా 3.53 శాతంగా ఉండేది. 2023-24లో 2.71 శాతానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఈ రంగాన్ని బలోపేతం చేసి ఆదాయం పెంచడానికి పాలసీలో మార్పులు తీసుకొచ్చారు. జగన్ హయాంలో తీసుకున్న నిర్ణయం కారణంగా 6 వేల దరఖాస్తులు కొరగాకుండా పోయాయి. కొత్త విధానంలో 2022 మార్చి నాటికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 'ఫస్ట్‌కమ్-ఫస్ట్‌సర్వ్'(ఎవరు ముందొస్తే వారికే ముందు) విధానంలో పరిష్కరించాలని నిర్ణయించారు. గృహనిర్మాణం, జలవనరుల ప్రాజెక్టులు, రహదారి అభివృద్ధి, విస్తరణ కోసం అవసరమైన రోడ్‌మెటల్, బిల్డింగ్ మెటీరియల్, గ్రానైట్, సిలికాశాండ్, డోలోమైట్ వంటి ఖనిజాలకు ఉత్పత్తితో అనుసంధానించిన ధరను నిర్ణయించనున్నారు. ఈ ధర ప్రకారమే వేలం విధానాన్ని ప్రవేశ పెట్టనున్నారు. దీనిలో వన్‌టైమ్ ప్రీమియం బదులు సీనరేజీ ఫీజు శాతాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. ప్రస్తుతం 7 ఉమ్మడి జిల్లాల్లోనే సీనరేజీ కాంట్రాక్ట్ అమల్లో ఉంది. ఇకపై రాష్ట్రమంతా అమలు చేయాలని నిర్ణయించారు. దీనివల్ల స్థిరమైన ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అంటే ఇక నుంచి అన్ని జిల్లాల్లో సీనరేజీ కాంట్రాక్ట్ అమలు కానుంది. ఫీజుల వసూళ్లలో గనులశాఖ అధికారుల పెత్తనం ఉండదు.

ఫీజులు సగానికి తగ్గింపు

పెండింగ్ దరఖాస్తులు, కొత్త ప్రాంతాలు, రెన్యువల్స్ ద్వారా లీజులు తీసుకునేవారికి ప్రస్తుతం ఫీజుల భారం ఎక్కువగా ఉంది. ఇకపై కొత్త పాలసీ ద్వారా ఈ ఫీజుల భారాన్ని తగ్గించనున్నారు. 10 రెట్లుగా ఉన్న లీజు స్థిర మొత్తా(డెడ్‌రెంట్)న్ని 5 రెట్లకు తగ్గించారు. ఈ మొత్తాన్ని 2-3 ఏళ్లలో రెండు సులభతర వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. లైమ్‌స్టోన్ శ్లాబ్స్ కోసం ప్రీమియం మొత్తాన్ని 3 రెట్ల డెడ్‌రెంట్‌కు తగ్గించారు. అంతేకాదు.. ఇకపై దీనిని ఏడాదికోసారి నిర్ణయించనున్నారు. డెడ్‌రెంట్లను ఖనిజాల ప్రాతిపదికన సవరించారు. కొత్తగా మంజూరయ్యే గ్రానైట్ లీజు కాలపరిమితిని 20 నుంచి 30ఏళ్లకు పెంచారు. రోడ్‌మెటల్ యూనిట్ లీజు కాలపరిమితిని 15 నుంచి 30 సంవత్సరాలకు పెంచారు. మిగిలిన ఖనిజాల లీజు కాలపరిమితిని 5 నుంచి 10 ఏళ్లకు సవరించారు.

మళ్లీ ఓటీఎస్

గత సంవత్సరాల్లో పెండింగ్‌లో ఉన్న లీజు వివాదాలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్(ఓటీఎస్)ను అమలు చేయనున్నారు. ఈ మేరకు గనుల శాఖ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జరిమానాలను 10 రెట్ల నుంచి 2 రెట్లకు తగ్గించారు. గనుల ముందస్తు అనుమతులకు ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. గనులు, రెవెన్యూ, అటవీ, పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సభ్యులుగా ఉంటారు. కుటుంబ సభ్యులకు లీజు బదిలీ చేసే సమయంలో వసూలు చేసే ఫీజను పూర్తిగా మాఫీ చేయనున్నారు. కాగా.. గత ప్రభుత్వంలో 7 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఏర్పాటు చేసిన సీనరేజీ కలెక్షన్ కాంట్రాక్ట్(ఎస్‌సీసీ)ను మూడు నెలలు పొడిగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అలాగే, సీనరేజీ కాంట్రాక్టర్లకు రూ.190 కోట్ల బకాయిలు మాఫీ చేయాలని గనులశాఖ ప్రతిపాదించింది.

కొవిడ్ లెవీ రద్దు

కొవిడ్ ఖర్చుల నిమిత్తం 2021లో విధించిన కన్సిడరేషన్ అమౌంట్‌ను పూర్తిగా రద్దుచేశారు. ఈ మేరకు గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్త పాలసీలో టన్నేజ్ ఆధారిత సీనరేజ్ ఫీజు విధానం అమలవుతుందని ఆయన తెలిపారు. ప్రత్యేకంగా డోలమైట్, షేల్, స్లేట్‌లపై ఎలాంటి అదనపు భారాలు ఉండవని పేర్కొన్నారు.

అమరావతిలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులను తిరిగి గాడినపెట్టేందుకు ప్రభుత్వం చాలా శ్రమిస్తోంది. అన్ని పనులకు టెండర్లు పిలవడం పూర్తయిందని.. రహదారులు, రైతుల రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక వసతుల కల్పనకు కూడా టెండర్లు పిలిచాం.

ఇన్‌చార్జి మంత్రులు జిల్లాల పర్యటనలకు వెళ్లడం లేదు. వారు తప్పనిసరిగా వెళ్లాలి. మూడు పార్టీల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని సమస్యలపై చర్చించాలి.

- ముఖ్యమంత్రి చంద్రబాబు



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు

2న అమరావతికి మోదీ

» వెలగపూడిలో భారీ సభ: సీఎం చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పనుల పునరుద్ధరణ కార్యక్రమానికి మే 2న ప్రధాని మోదీ వస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రధాని పర్యటన వివరాలను మంత్రివర్గ సహచరులకు ఆయన తెలియజేశారు. తుళ్లూరు మండలం వెలగపూడిలో ఉగాది రోజున పీ4 కార్యక్రమం జరిపిన ప్రదేశంలోనే ప్రధాన మంత్రి కార్యక్రమాన్ని కూడా నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు చెప్పారు. అక్కడ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని మంత్రులను కోరారు. గత ఐదేళ్లలో అమరావతిలో వైసీపీ పాలకులు విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. 'సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల తుది డిజైన్లను ఆమోదించాం. మూడేళ్లలో ఎట్టి పరిస్థితుల్లో వీటి నిర్మాణం పూర్తి చేయాలి. మంత్రుల చాంబర్లు, సంబంధిత హెచ్‌వోడీ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా చూడాలి. అంతర్గత వసతులు ఎలా ఉండాలన్న అంశంపై స్పీకర్‌తోపాటు మంత్రులు పి.నారాయణ, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, లోకేశ్ సభ్యులుగా ఓ కమిటీ ఏర్పడాలి' అని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో మరింత వేగవంతంగా స్పందించాలన్నారు. రెవెన్యూ సమస్యల్లో పోలీసు జోక్యం లేకుండా చూడాలని చెప్పారు. చేపట్టిన సంస్కరణలకు రావలసినంత మైలేజీ రావడం లేదన్నారు. ఇటీవలి కాలంలో ఉన్నతాధికారుల అవినీతి తీవ్ర చర్చనీయాంశమవుతోందని, అవినీతి ఏ రూపంలో ఉన్నా, ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని.. ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంకా ఏమన్నారంటే..

చిచ్చుపెట్టి లబ్ధిపొందాలని..

వైసీపీ కులాలు, మతాలు, ప్రాంతాల నడుమ చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది. పాస్టర్ ప్రవీణ్ మరణంపై క్రైస్తవులను, టీటీడీ గోశాల విషయంలో హిందువులను, వక్ఫ్ బిల్లుపై ముస్లింలను రెచ్చగొట్టే విధంగా కుటిల రాజకీయం చేస్తోంది. పాస్టర్ ప్రవీణ్ విషయంలో సాంకేతిక ఆధారాలతో వైసీపీ ప్రచారానికి చెక్ పెట్టాం. అయినా కోర్టులను ఆశ్రయిస్తున్నారు. పాస్టర్ల ముసుగులో రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు. టీటీడీ గోశాల విషయంలోనూ వైసీపీ హయాంలో జరిగిన అరాచకాలను బయటపెట్టడం ద్వారా వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టగలిగాం. వక్ఫ్ బిల్లు విషయంలో ఆ పార్టీ సెల్ఫ్‌గోల్ వేసుకుంది. లోక్‌సభలో బిల్లును వ్యతిరేకించి.. వైసీపీ, రాజ్యసభలో దానికి మద్దతుగా ఓటేసింది. ఇప్పుడు ముస్లింలను మభ్యపెట్టేందుకు సుప్రీంకోర్టులో కేసు వేసింది. ఈ వ్యవహారం నుంచి బయటపడేందుకు టీడీపీపై దుష్ప్రచారం చేస్తోంది. ఎస్సీ వర్గీకరణ విషయంలోనూ ఇంతే. మనం తీసుకునే రాజకీయ నిర్ణయాల్లో అయోమయం ఉండకూడదు. ఏదైనా నిర్ణయం తీసుకున్నప్పుడు దాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు కార్యకర్తలకు, క్షేత్రస్థాయిలో ప్రజలకు దగ్గరగా ఉండాలి. తక్షణం పీ-2 కార్యక్రమంలో మంత్రులందరూ భాగస్వాములు కావాలి. మీమీ నియోజకవర్గాల పరిధిలో గానీ, రాష్ట్రంలో ఇంకెక్కడైనా గానీ పేద కుటుంబాలను ఎంపిక చేసుకుని వారికి అండగా నిలవాలి. వాటిని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్ది మార్గదర్శకులుగా నిలవాలి. అప్పుడే మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాం. సూర్యఘర్ అమలులో మరింత వేగం పెరగాలి. ప్రభుత్వ భవనాలన్నిటిపై సౌర విద్యుదుత్పత్తికి ప్రాధాన్యమివ్వాలి, పంచాయతీలకు కరెంటు బిల్లుల చెల్లింపు భారంగా ఉన్న నేపథ్యంలో పంచాయతీల పరిధిలో సౌర విద్యుదుత్పత్తికి ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. దీనివల్ల కరెంటు బిల్లుల రూపంలో ప్రస్తుతం చేస్తున్న ఖర్చులో చాలా ఆదా అవుతుంది.

ఇక వర్గీకరణ

(మొదటి పేజీ తరువాయి)

మాదిగలు, రెల్లి కులస్థులు ఆర్థికంగాను, సామాజికంగాను వెనుకబడి ఉన్నారంటూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను ఉమ్మడి ఏపీలో ఆయన చేపట్టారు. అయితే, సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. తిరిగి ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాలతోనే మళ్లీ కార్యరూపం దాల్చింది. ఈ క్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మిశ్రా కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందించింది. ఎస్సీలను గ్రూప్-1, 2, 3లుగా కమిషన్ విభజించింది. గ్రూప్-1లో అత్యంత వెనుకబడిన రెల్లి కులస్థులను చేర్చింది. జనాభా ప్రాతిపదికన వారికి 1 శాతం రిజర్వేషన్ కల్పించింది. జనాభా దామాషాలో రెండోస్థానంలో ఉన్న మాదిగల ఉపకులాలను గ్రూప్-2 కింద చేర్చి, 6.5 శాతం రిజర్వేషన్, జనాభా ఎక్కువగా ఉన్న మాలలను గ్రూప్-3 కింద పరిగణించి 7.5% కేటాయించింది.

మరో నెలపాటు కమిషన్

రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను మరో నెల పాటు.. అంటే మే 11 వరకు కొనసాగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది.

గ్రూపు 1: రెల్లి, ఉపకులాలు 12, రిజర్వేషన్ : 1 శాతం

1. రెల్లి, 2.బాపురి, 3.చాచాటి, 4.చండాల, 5.దండాసి, 6.డోమ్, డోంబారా, పైడి,పానో, 7.ఘాసీ, హడ్డి, చాచండి, 8.గోదగలి, గోదగుల, 9.మెహ్తర్, 10.పాకీ, మోతి, తోటి, 11. పామిడి, 12. సప్రు

గ్రూపు 2: మాదిగ, ఉపకులాలు 18, రిజర్వేషన్ : 6.5శాతం

1.మాదిగ, 2.అరుంధతీయ, 3.బిండ్లా,4.చామర్, మోచి, ముచి, చామర్-రవిదాస్, చామర్-రోహిదాస్, 5. చంబార్, 6.ధక్కల్, డొక్కల్వర్, 7. ధోర్, 8. గోదారి, 9.గోసంగి, 10.జగ్గలి, 11. జంబువులు, 12.కొలుపులవాండ్లు, 13. మాదిగ దాసు, మస్తీన్, 14. మాంగ్, 15. మాంగ్‌గరోడి, 16. మాతంగి, 17. సముగర, 18. సింగోళ్లు, చిందోళ్లు.

గ్రూప్ 3: మాల, ఉపకులాలు 29, రిజర్వేషన్ : 7.5 శాతం

1. ఆదిద్రావిడ 2. అనముక, 3. ఆరాయ్ మాల, 4. ఆర్వా మాల, 5. బరికి, 6. బ్యాగార, బ్యాగారి 7. చాలవడి, 8. ఎల్లమలవారు, ఎల్లమ్మలవాండ్లు, 9.హోలెయ, 10. హోలెయ దాసరి, 11. మాదసీ కురవ, మాదరి కురవ, 12.మహర్ 13. మాల, మాల అయ్యవారు, 14.మాలదాసరి, 15. మాల దాసు, 16. మాల హన్నై, 17. మాలజంగం, 18. మాల మస్తీ, 19.మాల సాలే, నెట్కాని, 20. మాల సన్యాసి, 21.మన్నే, 22. ముండాల, 23. సంబం, 24. యాతాల, 25.వల్లువన్, 26. ఆది ఆంధ్ర, 27.మష్టి, 28.మిథ అయ్యాల్వార్, 29. పంచమ, పరియా.

బలిమెల హైడల్ ప్లాంట్లపై
నిర్ణయం వాయిదా

» పవన్ లేకుండా చర్చ సరికాదన్న సీఎం

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అందుబాటులో లేకపోవడంతో.. బలిమెల (చిత్రకోట) వద్ద 'మెస్సర్స్ ఒరిస్సా పవర్ కన్సార్షియం లిమిటెడ్' చేపట్టదలచిన 2 మినీ హైడల్ ప్రాజెక్టులపై కేబినెట్ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. ఈ అంశాన్ని వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అత్యంత ప్రధానమైన ఈ అంశాన్ని ఉప ముఖ్యమంత్రి లేకుండా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోవడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. బలిమెల ఆనకట్ట వద్ద 30 మెగావాట్ల చొప్పున సామర్థ్యం కలిగిన రెండు పవర్ హౌస్‌లను నిర్మించేందుకు ఒడిసా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విద్యుత్‌ను రెండు రాష్ట్రాలూ చెరిసగం పంచుకోవాలని ఒప్పందం కూడా జరిగింది.

ఏవియేషన్ హబ్‌గా ఏపీ

» పౌర విమానయాన పారిశ్రామికవేత్తలతో మంత్రి బీసీ జనార్దనరెడ్డి భేటీ

» ఏపీలో పెట్టుబడులకు కంపెనీల ఆసక్తి

» ఎయిర్ ట్యాక్సీ మాన్యుఫ్యాక్చరింగ్‌లో 1200 కోట్లు..

» ఎయిర్‌క్రాఫ్ట్ సిమ్యులేటింగ్ ట్రైనింగ్‌లో 600 కోట్ల పెట్టుబడులు

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని మౌలిక సదుపాయాలు, ఆర్ అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి తెలిపారు. సచివాలయంలో మంగళవారం పలువురు పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా పౌర విమానయాన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వారు ఆసక్తి చూపారు. మంత్రితో సమావేశమైన వారిలో మాగ్నమ్ వింగ్స్ సీఈవో అభిరామ్ చావా, అరిస్టాటిల్ ఏవియేషన్ అకాడమీ డైరెక్టర్ కెప్టెన్ శిరీష్, ఈప్లేన్ డైరెక్టర్ కెప్టెన్ దివ్య, భారత్ ఏవియేషన్ డైరెక్టర్ జోసెఫ్ పొన్నుస్వామి తదితరులు ఉన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ సిమ్యులేటింగ్ ట్రైనింగ్ యూనిట్ రంగంలో రూ.600 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అరిస్టాటిల్ ఏవియేషన్ అకాడమీ డైరెక్టర్ కెప్టెన్ శిరీష్ వెల్లడించారు. ఈవీటోల్స్ అండ్ ఎయిర్ టాక్సీ మాన్యుఫాక్చరింగ్ రంగంలో మొత్తం రూ. 1,200 కోట్ల పెట్టుబడులు పెడతామని ఈప్లేన్ కంపెనీ డైరెక్టర్ కెప్టెన్ దివ్య వెల్లడించారు. తొలిదశలో రూ. 270 కోట్ల మేర పెట్టుబడులు పెడతామని వెల్లడించారు. ఏవియేషన్ రంగంలో మెయింటెనెన్స్, రిపేరు, ఓవర్‌హాలింగ్(ఎంఆర్‌ఓ) సెంటర్ స్థాపిస్తామని భారత్ ఏవియేషన్ డైరెక్టర్ జోసెఫ్ పొన్నుస్వామి వెల్లడించారు.

అమరావతికి 16వ ఆర్థిక సంఘం బృందం

16వ ఆర్థిక సంఘం అధ్యక్షుడు అరవింద్ పనగారియా, సభ్యులు మంగళవారం అమరావతికి వచ్చారు. ఆ బృందానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్వాగతం పలికారు. విజయవాడ, తిరుపతి సహా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో 4 రోజులపాటు ఈ బృందం పర్యటిస్తుంది. చివరి రోజు సీఎంతో, కేశవ్‌తో సమావేశమవుతుంది.

ఆ ఔషధాలతో జాగ్రత్త..!

» ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లతో ఒంటిపై బొబ్బలు

» డైక్లో ఏక్యూ వాడితే శరీరంపై దురద, దద్దుర్లు

» గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో గుర్తించిన వైద్యులు

» ప్రతి వైద్య కళాశాలలో ఫార్మకోవిజిలెన్స్ విభాగాలు

» రాష్ట్రంలో తొలిసారి డ్రగ్ సేఫ్టీ న్యూస్ లెటర్ విడుదల

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా మూత్రపిండాల సమస్య (సీకేడీ)తో బాధపడే రోగుల్లో రక్తహీనతను తగ్గించేందుకు వినియోగించే ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ల వల్ల దుష్ప్రభావాలు ఎదురవుతున్నాయి. ఇవి చేయించుకున్న రోగుల శరీరంపై ఎర్రటి మచ్చలు, బొబ్బలు ఏర్పడుతున్నాయి. నొప్పుల నివారణకు వాడే డైక్లో ఏక్యూ మందు వల్ల కూడా శరీరంపై దురదలు, దద్దుర్లు వస్తున్నాయి. ఇటీవల గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి (జీజీహెచ్)లో ఈ మందులు వాడినప్పుడు రోగుల్లో కనిపించిన దుష్ప్రభావాలను వైద్యులు ఆరోగ్య శాఖ దృష్టికి తెచ్చారు. ఇటీవల కొన్ని మందుల వల్ల దుష్ప్రభావాలు వస్తుండడంతో వీటిని గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రతి వైద్య కళాశాలలో ఫార్మకోవిజిలెన్స్ విభాగాలను ఏర్పాటు చేసింది. ఇవి వైద్య కళాశాలలోని ఫార్మకాలజీ విభాగానికి అనుబంధంగా పనిచేస్తాయి. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యరంగంలో గుర్తించిన మందుల దుష్ప్రభావాల వివరాలను ఘజియాబాద్‌లోని సెంట్రల్ ఫార్మకోవిజిలెన్స్ కేంద్రానికి పంపుతాయి. ఈ మందుల పట్ల కేంద్ర ఆరోగ్య శాఖ వైద్యులను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైతే ఆయా మందుల నిషేధానికి సిపారసు చేస్తాయి.

డాక్టర్లు అప్రమత్తంగా ఉండాలి..

ఇటీవల గుంటూరుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో డ్రగ్ రియాక్షన్స్‌ను వైద్యులు గుర్తిస్తున్నారు. పలురకాల బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ల చికిత్సకు వాడే మెట్రోనిడజోల్ యాంటీ బయోటిక్ వాడిన కొందరు రోగుల్లో చర్మం వాయడం, ఎరుపు రంగులోకి మారడం, తెల్లటి చీముతో కూడిన చిన్న పొక్కులు ఏర్పడడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. తామర, దురద వంటి పలు ఫంగల్ వ్యాధుల చికిత్సల్లో వాడే లులికొనజోల్ వల్ల ముఖంపై మంగు (మెలస్మా) మచ్చలు ఏర్పడుతున్నాయి. గుండె జబ్బు, డీవీటీ థ్రాంబోసిస్ రోగులకు వాడే దాల్టీపెరిన్ వల్ల కండరాల నొప్పులు వేధిస్తున్నాయి. మధుమేహ రోగుల్లో రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రించేందుకువాడే గ్లిక్లాజైడ్ వల్ల చర్మంపై దద్దుర్లు, పొక్కులు, గడ్డలు ఏర్పడుతున్నట్టు గుర్తించారు. నొప్పుల నివారణకు వాడే ట్రమడాల్ ట్యాబ్లెట్ల వల్ల ఒంటిపై బొబ్బలు వస్తున్నట్టు గుర్తించారు. అలర్జీ, వికారానికి ప్రొమెథాజైన్ మందును పిల్లలకు సూచించవద్దన్నారు.

ఇకపై ప్రతినెలా డ్రగ్ సేఫ్టీ న్యూస్ లెటర్

రాష్ట్ర ప్రభుత్వ వైద్య బోధన రంగంలో తొలిసారిగా గుంటూరు వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం మంగళవారం డ్రగ్ సేఫ్టీ న్యూస్‌లెటర్‌ను విడుదల చేసింది. ఇందులో పలు రకాల ఔషధాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటి వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ సాల్మన్ రాజు ఆధ్వర్యంలో రూపొందించిన డ్రగ్ సేఫ్టీ న్యూస్‌లెటర్‌ను గుంటూరు వైద్య కళాశాల (జీఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి ఆవిష్కరించారు. ఇకపై ప్రతి నెలా న్యూస్‌లెటర్‌ను విడుదల చేస్తామని, ఇది ప్రైవేటు డాక్టర్లకూ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

4.23 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

» రూ.4.62 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేబినెట్ ఓకే



మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, పక్కన మంత్రులు అనిత, దుర్గేశ్, డోలా

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 4.23 లక్షలకుపైగా ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రూ.4.62 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎస్ఐపీబీ) నిర్ణయాలను ఈ మేరకు ఆమోదించింది. రాజధాని నిర్మాణంలో దూకుడు పెంచుతూ రూ.617.33 కోట్లతో శాసనసభ భవనం, 786.05 కోట్లతో హైకోర్టు భవనం నిర్మించాలని నిర్ణయించింది. మంగళవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించిన ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. వేట లేని కాలంలో వెసులుబాటుగా ఉండాలని మత్స్యకారులకు రూ.20 వేలు సాయం అందించే కార్యక్రమాన్ని ఈ నెల 26న నిర్వహించాలని నిర్ణయించారు. ఆ వివరాలను మంత్రులు నిమ్మల రామానాయుడు, డోలా బాలవీరాంజనేయస్వామి, అనిత, కందుల దుర్గేశ్ సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

కేబినెట్ ఆమోదించిన ముఖ్యమైన తీర్మానాలు

1 పరిశ్రమలు, వాణిజ్యం, ఏపీఎండీసీ ఆర్థిక బలం, పరపతిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీవోలకు ఆమోదం. రూ. 9000 వేల కోట్ల బాండ్లు జారీచేయాలని నిర్ణయం.

1 విశాఖపట్నం హిల్‌నంబరు 3 (సెజ్)లోని ఐటీ పార్క్‌లో 3.5ఎకరాలు,ఐపీ కాపులుప్పాడలో 56.36 ఎకరాలు యూఆర్‌సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి కేటాయింపు.

1 సిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ టు ఇన్నోవేట్, ఇంటిగ్రేట్ అండ్ సస్టయిన్ 2.0 కార్యక్రమం కింద నగరాల కోసం వాతావరణ కేంద్రం(ఎస్-సీ-3) ఏర్పాటు.

1 ఏపీ ఏకీకృత స్వచ్ఛ ఇంధనవిధానం-2024 కింద కర్నూలు జిల్లా ఆస్పరిలో 88 ఎండబ్ల్యూ పవన విద్యుత్ ప్రాజెక్టును స్థాపించడానికి జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ చేసిన అభ్యర్థనకు సమ్మతి. ఈ విధానం కింద తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం, తూర్పు కనుపూరు, వెల్లపాలెం గ్రామాల్లోను, కోట మండలంలోని కర్లపూడి, సిద్ధవరం గ్రామాల్లోను సౌరవిద్యుత్ ప్రాజెక్టులను బీఈఎస్ఎస్ తోపాటు స్థాపించడానికి చింత గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ చేసిన అభ్యర్థనకు ఆమోదముద్ర.

1 అనంతపురం జిల్లా గుత్తి, పామిడి మండలాల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు రిన్యూ విక్రమ్ శక్తి లిమిటెడ్ చేసిన అభ్యర్థనకు సుముఖత.

1 సత్యసాయి జిల్లా హరేసముద్రం, బుల్లసముద్రం, ఉప్పర్లపల్లి, ఎర్ర బొమ్మనహల్లి, కల్లుమర్రి, మనూరు, సమీప గ్రామాల్లో సౌర ప్రాజెక్టులను బీఈఎస్ఎస్‌తోపాటు స్థాపించడానికి చింత గ్రీన్ ఎనర్జీకి అనుమతి.

1 గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో వంద పడకల ఆస్పత్రి కోసం 6.35 ఎకరాల భూమిని ఉచితంగా(లేదా) నామమాత్రపు లీజు ప్రతిపాదికన ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌కు(ఈఎస్ఐసీ) కేటాయింపు.

1 ఏలూరు జిల్లా ఐఎస్ జగన్నాథపురంలో 30 ఎకరాల ప్రభుత్వ భూమి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధికి ఉచితంగా కేటాయింపు.

1 చిత్తూరుజిల్లా కుప్పం మండలం బైరుగని పల్లె గ్రామంలో 1.99 ఎకరాల ప్రభుత్వభూమిని 1.31 ఎకరాల పట్టాభూమితో మార్పిడికి నిర్ణయం.

1 ఇండస్ట్రియల్ పార్క్‌ల ఏర్పాటుకు నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో 87.56 ఎకరాలు, అదే జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరులో 220.81 ఎకరాల ప్రభుత్వ భూమి ఉచితంగా ఏపీఐఐసీకి కేటాయింపు.

1 విజయనగరం జిల్లా కొత్త వలస మండలం రెల్లి గ్రామంలో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికి 516.58 ఎకరాల కేటాయింపు జీవో రద్దు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదముద్ర వేయగానే రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వస్తుందని మంత్రులు తెలిపారు. ఈ వర్గీకరణ కోసం 200 రోస్టర్ వ్యవస్థను అనుసరిస్తామని, విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ఫలాలు సమానంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి నిమ్మల తెలిపారు. 2-3 రోజుల్లో ఆర్డినెన్స్, తర్వాత గజిట్ నోటిఫికేషన్ విడుదలవుతాయి. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను వర్గీకరణ ప్రాతిపదికనే జారీ చేస్తాం" అని తెలిపారు. సామాజిక న్యాయం పట్ల టీడీపీకి ఉన్న చిత్తశుద్ధికి ఆర్డినెన్సే నిదర్శనమని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. అన్ని వర్గాలకూ న్యాయం చేయాలనేది సీఎం చంద్రబాబు సంకల్పమని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మత కలహాలు సృష్టించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని హోం మంత్రి అనిత విమర్శించారు. ఇటీవల నరసన్నపేటలోని ఆలయ సమీపంలో జీసస్ సూక్తులు రాయించడం, చర్చి దగ్గర జై శ్రీరామ్ అని రాయించడం కుట్రలో భాగమన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో సిట్ విచారణ పూర్తి చేయగానే బాధ్యులపై చర్యలు ఉంటాయన్నారు.

మెగా డీఎస్సీకి వర్గీకరణే ప్రాతిపదిక

1 2018 ఆగస్టు తుఫాన్‌కు ఎర్ర కాల్వ పరివాహక ప్రాంతంలో పడిన గండ్లు, ఇతర చోట్ల చేపట్టిన 48 పునరుద్ధరణ పనులకు ఆమోదం.

1 వెలిగొండ ప్రాజెక్ట్‌లో 2, 4 ప్యాకేజీలకు రూ.106.39 కోట్లతో నల్లమల జలాశయాన్ని నింపే పనులకు అనుమతి.

1 పోలవరం ప్రాజెక్టులో నవయుగకు ఒప్పంద షరతుల ప్రకారం చెల్లించవలసిన రూ. 57.56 కోట్లను, తుది బిల్లుతోపాటు చెల్లించవలసిన రూ. 36.37 కోట్లను చెల్లించేందుకు ఆమోదం.

1 ఉపముఖ్యమంత్రి పేషీలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నెలకు రూ.60 వేల పారితోషికంతో వీడియోగ్రాఫర్ నియామకానికి అనుమతి.

TATA CONSULTANCY SERVICES

వెల్కమ్ టీసీఎస్!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటిదాకా ఏ సంస్థకూ రాష్ట్రంలో ఇలా భూమి కేటాయించలేదు. విశాఖలో ఏర్పాటు చేయబోయే కేంద్రంలో టీసీఎస్ రూ. 1,370 కోట్లు పెట్టుబడిగా పెడుతుంది. దశల వారీగా 12 వేల నుంచి 15వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది.

వరుస చర్చలు.. భేటీలు

విశాఖను ఆర్థిక, ఐటీ రాజధానిగా తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనిని వాస్తవరూపంలోకి తీసుకొచ్చేందుకే... ఇప్పుడు టీసీఎస్‌కు నామమాత్ర ధరకు భూమి కేటాయించారు. చంద్రబాబు గత ఏడాది ఆగస్టులో 'టాటా సన్స్' చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌తో భేటీ అయ్యారు. ఆ తర్వాత... అక్టోబరులో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ముంబైలోని టాటా హౌస్‌లో చంద్రశేఖరన్‌తో చర్చలు జరిపారు. నవంబరులో చంద్రబాబు మరో విడత చంద్రశేఖరన్‌తో భేటీ అయ్యారు. విశాఖలో టీసీఎస్ ఆపరేషన్స్ సెంటర్ ఏర్పాటు కానుందని ప్రభుత్వ వర్గాలు అప్పుడే సంకేతాలు పంపించాయి. మరోవైపు... రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలికి కో-చైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. ఇదే క్రమంలో... ఇప్పుడు విశాఖలో టీసీఎస్‌కు 21.6 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

ఇతర కంపెనీలకు 'ఆకర్షణ'గా...

విశాఖలో ఐటీ పరిశ్రమకు టీసీఎస్ 'యాంకర్'గా పని చేస్తుందని... మరిన్ని ఐటీ కంపెనీలూ తరలి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ సీఎంగా ఉండగా సనంద్‌లో టాటా మోటార్స్‌కు చౌకగా స్థలం కేటాయించారు. ఆ తర్వాత సనంద్ ప్రఖ్యాత ఆటోమొబైల్ హబ్‌గా రూపుదిద్దుకుంది. ఇదే క్రమంలో... టీసీఎస్ రాకతో విశాఖ దేశంలోని ప్రముఖ ఐటీ హబ్‌లలో ఒకటవుతుందని ప్రభుత్వం ఆశాభావంతో ఉంది. నిజానికి, టీసీఎస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం హిల్ నంబరు 3లో మిలీనియం టవర్-ఏ, బీలను (సుమారు 2 లక్షల చ.అ. ప్లగ్ అండ్ ప్లే స్థలం) కేటాయించింది. అది ఆర్థిక మండలి పరిధిలో ఉండడంతో డీనోటిఫై చేసే ప్రక్రియ మొదలైంది. అయితే... తమ కార్యకలాపాలకు ఈ ప్రాంగణం సరిపోదని, సొంతం క్యాంపస్ ఏర్పాటుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని టీసీఎస్ కోరింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తూ అదే కొండపై 21.16 ఎకరాలు కేటాయించింది. అక్కడ శాశ్వత భవనాలు నిర్మించేలోగా... మిలీనియం టవర్-ఏ, బీ నుంచే టీసీఎస్ తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. బహుశా... రెండు మూడు నెలల్లోనే ఇందుకు శ్రీకారం చుట్టే అవకాశముంది. అలాగే... విశాఖ టెక్ సిటీగా ఎదిగేందుకు దోహద పడేలా పలు ఐటీ సంస్థలకు భూముల కేటాయింపునకు కూడా మంగళవారం కేబినెట్ ఆమోదం తెలిపింది.

తమిళనాడుకు స్వయం ప్రతిపత్తి

(మొదటి పేజీ తరువాయి)

వైస్‌చాన్సలర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎం.నాగనాథన్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ 1971లో ఏర్పాటైన జస్టిస్ రాజమన్నార్ కమిటీ సిఫారసులను కూడా పరిగణనలోకి తీసుకుని వచ్చే ఏడాది జనవరిలో మధ్యంతర నివేదికను సమర్పిస్తుందని, రెండేళ్లలో సమగ్రమైన నివేదికను రూపొందిస్తుందని స్టాలిన్ వివరించారు. ఇటీవలి కాలంలో రాష్ట్రాల హక్కులను కేంద్రం హరించివేస్తోందని, రాష్ట్రాల జాబితాలోని వైద్య, న్యాయ, ఆర్థిక శాఖలను ఉమ్మడి జాబితాలోకి మార్చే ప్రయత్నాలను వేగవంతం చేసిందని స్టాలిన్ ఆరోపించారు. ఐదు దశాబ్దాలకు మునుపే 1969లో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి కేంద్ర, రాష్ట్రాల నడుమ సంబంధాలను సమీక్షించడానికి విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పీవీ రాజమన్నార్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా కేంద్ర-రాష్ట్రాల సంబంధాలపై సమీక్ష జరిపి సమగ్రమైన నివేదికను తయారు చేసి ఆ కమిటీ 1971లో నివేదికను సమర్పించిందన్నారు. ఆ కమిటీ నివేదికను 1974 ఏప్రిల్ 16న శాసనసభలో కరుణానిధి ప్రవేశపెట్టి ఆమోదింపజేశారని చెప్పారు. ఆ తర్వాత కేంద్రప్రభుత్వం 1983లో నియమించిన సర్కారియా కమిటీ చేసిన సిఫారసులతోనూ పెద్దగా ఫలితం లేకపోయిందని స్టాలిన్ వివరించారు. కేవలం తమిళనాడు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మేం అధికార వికేంద్రీకరణ, నిధుల కోసం ఒత్తిడి తేవడం లేదు.. గుజరాత్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు, కశ్మీర్ నుంచి కేరళ వరకే దేశ ప్రజల విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఒత్తిడి తెస్తున్నాం. రాష్ట్ర స్వయం ప్రతిపత్తిపై గళం విప్పుతున్న తొలి రాష్ట్రం తమిళనాడు' అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఆధారంగా పనిచేస్తున్న భారతదేశంలోని అన్ని రాష్ట్రాల హక్కులను పరిరక్షించడమే కమిటీ ఏర్పాటు ఉద్దేశమని స్టాలిన్ చెప్పారు. మణిపూర్, నాగాలాండ్ వంటి ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక ఆచారాలను కూడా గౌరవించాలనేది తమ అభ్యర్థన అన్నారు. 'మా మాతృభాష తమిళం పరిరక్షణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. అదే సమయంలో దేశంలోని ఇతర ప్రాంతాల్లో మాతృభాషలు తమ స్వభావాన్ని కోల్పోతుండటంపైనా అంతే ఆందోళన చెందుతున్నాం' అని స్టాలిన్ పేర్కొన్నారు.



చికిత్స పొందుతున్న కోడె దూడకు ఆహారం అందిస్తున్న జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, చిత్రంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు

మూగ జీవి రోదన చలించిన న్యాయమూర్తి

- బైక్ ఢీకొనడంతో కాలు విరిగి కోడెదూడ విలవిల
- ఆస్పత్రిలో చేర్పించిన జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తోటి మనుషులకు ప్రమాదం జరిగినా.. పట్టించుకోకుండా వెళ్లిపోయే ఈ రోజుల్లో.. ఓ మూగ జీవి యెడల కరుణ చూపి, హైకోర్టు న్యాయమూర్తి మానవత్వం చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి విలవిల్లాడుతున్న కోడె దూడను చూసి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ చలించిపోయారు. గుంటూరులోని ఏటుకూరు బైపాస్ రోడ్డులో సోమవారం రాత్రి ఓ ద్విచక్ర వాహనం కోడె దూడను ఢీకొంది. ఈ ప్రమాదంలో కోడె దూడ ఎడమ కాలు విరిగిపోయింది. కుటుంబంతో కలిసి అదే మార్గంలో కారులో వెళ్తున్న జస్టిస్ జి. రామకృష్ణప్రసాద్ ప్రమాదంలో గాయపడిన కోడె దూడను చూసి చలించిపోయారు. ట్రాఫిక్ పోలీసులను అప్రమత్తం చేశారు. దూడకు ప్రాథమిక వైద్యం చేయించి, గుంటూరు పాలీ క్లినిక్‌కు తరలించారు. అక్కడ డాక్టర్ ఎల్.నాగేశ్వరరావు కోడెదూడకు శస్త్ర చికిత్స చేశారు. క్లినిక్‌లో ఉన్న దూడను మంగళవారం జస్టిస్ రామకృష్ణప్రసాద్ కుటుంబంతో సహా చూసి, పశుసంవర్ధక శాఖ జేడీ నరసింహారావు, డిప్యూటీ డైరెక్టర్ రత్న జ్యోతితో మాట్లాడి వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. కోడె దూడకు ఆహారం అందించారు. మూగజీవి పట్ల జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ చూపిన వాత్సల్యంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

'గుండెపోటు' కథనంలో ఉదయ్ పాత్ర!

- వివేకా గాయాలు కనపడకుండా దాచిపెట్టడంలోనూ: సీబీఐ
- బెయిల్ రద్దు పిటిషన్లపై 29న విచారణ?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యను గుండెపోటుగా చిత్రీకరించిన వ్యవహారంలో నిందితుడు గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఏ-7) పాత్ర కూడా ఉందని సీబీఐ పేర్కొంది. ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 27న దర్యాప్తు సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. వివేకా కుమార్తె సునీతారెడ్డి మార్చి 7న మరో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వివేకా హత్య కేసులో ఉదయ్‌కుమార్‌రెడ్డి పాత్ర ఏమిటని సీజేఐ ప్రశ్నించారు. సీబీఐ తరఫున స్పెషల్ కౌన్సెల్ జోహెబ్ హుస్సేన్ బదులిస్తూ.. 'హత్యను గుండెపోటుగా చిత్రీకరించే ప్రయత్నం జరిగింది. ఆ గాయాలు కనపడకుండా కట్లు కట్టి సాధారణ మరణంగా నమ్మించే ప్రయత్నం చేశారు. ఇందులో ఉదయ్‌కుమార్‌రెడ్డి పాత్ర కూడా ఉంది' అని నివేదించారు. ఈ క్రమంలో ఉదయ్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. వివేకా హత్య కేసులో మరికొందరు నిందితుల బెయిల్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లతో కలిపి సీబీఐ వ్యాజ్యాన్ని విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సునీత తరఫున న్యాయవాది జైసల్ వాహి వాదనలు వినిపించేందుకు సిద్ధం కాగా.. సునీత పిటిషన్‌కూ తమ ఆదేశాలు వర్తిస్తాయని ధర్మాసనం పేర్కొంది. ఆయా పిటిషన్లు 29న సుప్రీంకోర్టులో విచారణకు వచ్చే అవకాశముంది.

షైనింగ్ స్టార్స్-2025



ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో మంత్రి లోకేశ్

టాపర్లు.. బ్రాండ్ అంబాసిడర్లు!

- మంచి ఫలితాలు రావనే ముద్రను చెరిపేశారు
- ప్రభుత్వ పరువును కాపాడారు
- ప్రభుత్వ ఇంటర్ టాపర్లతో మంత్రి లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కాలేజీల్లో చదివితే మంచి మార్కులు రావనే ముద్రను ఈ సంవత్సరం విద్యార్థులు చెరిపివేశారని మంత్రి లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో చదివి ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో షైనింగ్ స్టార్స్-2025 పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో 52 మంది టాపర్లకు ల్యాప్‌ట్యాప్‌లు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "మీతో కలిసి కూర్చోవడం నా అదృష్టం. నేనెప్పుడూ చదువులో టాపర్‌ను కాను. మీరంతా టాపర్లు. టాపర్ అవ్వాలన్న ఆలోచన కూడా నాకెప్పుడూ రాలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే బ్యాక్ బెంచ్ స్టూడెంట్‌ని. కానీ మీరు విజేతలుగా నిలిచారు. ప్రభుత్వ పరువు కాపాడారు. పేదరికం వల్ల విద్యార్థులు చదువులకు దూరం కాకూడదు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతాం. ఈ ఏడాది జూనియర్ కాలేజీల్లో అనేక సంస్కరణలు అమలుచేశాం. నేను పాయకాపురం పర్యటనకు వెళ్లినప్పుడు ఓ చెల్లి చెప్పిన మాటలు గుర్తున్నాయి. తనకు అమ్మానాన్న లేరని, చేపలు అమ్ముతూ అమ్మమ్మ చదివిస్తోందని, మధ్యాహ్న భోజన పథకం తిరిగి ప్రవేశపెట్టడం వల్ల అమ్మమ్మపై కొంత భారం తగ్గిందని ఆ విద్యార్థి చెప్పింది.

మీరు బ్రాండ్ అంబాసిడర్లు

మీరంతా ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్లు. విద్యార్థుల మధ్య పోటీ ఉండాలి. నేను తొమ్మిదో తరగతి వరకూ ఆడుతూపాడుతూ చదివేవాడిని. క్రికెట్ ఎక్కువగా ఆడేవాడిని. పదో తరగతి నుంచి నన్ను బాగా రుద్దారు. నేను కూడా రుద్దుడు బ్యాచ్ విద్యార్థినే. ఉన్నత విద్య తర్వాత ప్రపంచ బ్యాంకులో పని చేశాను. ఆ తర్వాత ఎంబీఏ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చేశాను. అందుకే విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక సంస్కరణలపైనే దృష్టి పెట్టాను. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉచితంగా ఇచ్చాం. ప్రిన్సిపాళ్లకు పదోన్నతులు కల్పించాం. జూన్ నాటికి మొత్తం సంస్కరణలు పూర్తిచేస్తాం.



కుసుమ అనే విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న మంత్రి లోకేశ్

అన్ని రంగాల్లో అవకాశాలున్నాయి

అందరూ ఐటీ రంగంవైపే వెళ్లాలనుకోవడం సరి కాదు. నేడు అనేక అవకాశాలు వస్తున్నాయి. రాష్ట్రానికి సోలార్, బయో గ్యాస్ కంపెనీలు వస్తున్నాయి. ఉత్పత్తి రంగంలోనూ భారీగా ఉపాధి అవకాశాలున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా మన లక్ష్యాలను మార్చుకోవాలి. ఈ మధ్య విద్యార్థులు సున్నితంగా మారుతున్నారు. ఒక సబ్జెక్టులో ఫెయిలైతే జీవితం అక్కడే ఆగిపోదు. అది స్పీడ్ బ్రేకర్ మాత్రమే. చిన్నచిన్న ఆటుపోట్లు ఎదురైనా ఎదుర్కోవాలి. మిమ్మల్ని ప్రోత్సహించే బాధ్యత మాది. ప్రభుత్వ కాలేజీల్లో వసతులు మెరుగుపరుస్తాం. స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దు. డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి. ఈమధ్య కాలంలో పనిఒత్తిడి వల్ల నేను మా అమ్మతో, దేవాన్ష్‌తో కూడా మాట్లాడలేకపోయాను. అందుకే అలారం పెట్టుకుని మరీ వారితో మాట్లాడటం అలవాటుగా మార్చుకున్నా. మీరంతా ఉద్యోగాలు కోసం ఎదురుచూసేవారిగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి.

నా కంటే బ్రాహ్మణి బెటర్

టాపర్లలో బాలికలు ఎక్కువ మంది ఉన్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలి. మహిళలు వ్యాపారంలో కూడా రాణిస్తారు. చదువులోగానీ, వ్యాపారంలోగానీ నా కంటే బ్రాహ్మణి బెటర్. అందుకే బాలికలు చదువుతోపాటు అన్ని రంగాలపైనా దృష్టి సారించాలి. పీజీ విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తాం. విదేశీ విద్య పథకానికి ప్రత్యామ్నాయం తీసుకొస్తాం. భవిష్యత్తులో ఇంకా కఠిన సవాళ్లు ఎదుర్కోవాలి. అందుకే నేను తెలుగుదేశం 40ఏళ్లుగా గెలవని మంగళగిరి నియోజకవర్గాన్ని ఎంచుకుని గెలిచాను. విద్యాశాఖ వద్దని చాలామంది చెప్పినా, కష్టపడడానికి ఇదో మంచి అవకాశమని.. కావాలనే ఈ శాఖ తీసుకున్నాను.

ఐపీఎస్ అయ్యాక నాపై కేసు పెట్టొద్దు.. లోకేశ్ సరదా వ్యాఖ్య

విద్యార్థుల లక్ష్యాలపై లోకేశ్ సరదా వ్యాఖ్యలు చేశారు. ఐపీఎస్ అధికారి కావాలనుకుంటున్నాను అని ఓ విద్యార్థిని రాయడంపై స్పందించారు. "ఐపీఎస్ కావాలనుకోవడం మంచి లక్ష్యం. కానీ ఐపీఎస్ అయ్యాక నాపై కేసులు పెట్టొద్దు. ఇప్పటికే నాపై 23 కేసులున్నాయి. ఇంకా పెడితే బండి సంజయ్ అన్నతో పోటీ పడాలి. ఆయనపై 109 కేసులున్నాయంటున్నారు" అని సరదాగా వ్యాఖ్యానించారు.

ఈ ఏడాది నుంచే
ఆటిజం కేంద్రాల ఏర్పాటు

- స్పెషల్ ఎడ్యుకేషన్‌కు 2,260 పోస్టులు
- ఎస్జీటీ 1,136, స్కూల్ అసిస్టెంట్ 1,124
- మిగులు టీచర్ల సర్దుబాటుతో పోస్టుల సృష్టి

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల చదువులపై ప్రభుత్వందృష్టి సారించింది. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలో 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను సృష్టించింది. 1,136 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు, 1,124 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సృష్టిస్తూ పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ ఎడ్యుకేషన్‌కు 1,984 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అవసరమని పాఠశాల విద్యాశాఖ అంచనా వేయగా, అందులో 860 పోస్టులు ఇప్పటికే మంజూరయ్యాయి. అయితే ఈ పోస్టుల కోసం సాధారణ టీచర్ పోస్టులను రద్దు చేసింది. సాధారణ టీచర్ పోస్టుల్లో మిగులు పోస్టులను స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులుగా సర్దుబాటు చేయడంతో, అంతే సంఖ్యలో సాధారణ టీచర్ పోస్టులు రద్దైపోయాయి. ఈ చర్యతో రాష్ట్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్యను బలోపేతం చేసే అవకాశం ఏర్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రానికి 125 ఆటిజం కేంద్రాలను కేటాయించింది. మానసిక ఎదుగుల తక్కువగా ఉన్న పిల్లల విద్యపై ఆటిజం కేంద్రాలు దృష్టిపెడతాయి. 2025-26 విద్యా సంవత్సరం నుంచే కొన్ని ఆటిజం కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించనుంది. వాటికి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు కేటాయిస్తారు. అలాగే శారీరక దివ్యాంగులుగా ఉన్న విద్యార్థులకు కూడా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు అవసరం. తాజా పోస్టుల సృష్టితో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సరిపడా స్థాయిలో టీచర్లు అందుబాటులోకి వస్తారు.

సైన్స్ మార్కులు విడివిడిగా ప్రకటించాలి

అమరావతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరుగా మార్కులు ప్రకటించాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు. వేర్వేరుగా ఫలితాలు ప్రకటించడంవల్ల విద్యార్థులకు వారి సామర్థ్యం ఏ సబ్జెక్టులో బాగుందో తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. పరీక్షలు, మూల్యాంకనం వేర్వేరుగా ఉన్నందున మార్కులు కూడా విడివిడిగా ప్రకటించాలని కోరారు.

న్యాయాన్ని అందించడంలో
టాప్-2లో ఏపీ

- అగ్రస్థానంలో నిలిచిన కర్ణాటక
- మూడు, నాలుగు స్థానాల్లో తెలంగాణ, కేరళ
- వెల్లడించిన ఇండియా జస్టిస్ రిపోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మెరుగైన పోలీస్ వ్యవస్థ, జైళ్ల నిర్వహణ, న్యాయాన్ని అందించడంలో మన రాష్ట్రం.. దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. కర్ణాటక అగ్రస్థానాన్ని దక్కించుకోగా.. తెలంగాణ, కేరళ, తమిళనాడు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. శాంతిభద్రతలు, మెరుగైన న్యాయవ్యవస్థ, జైళ్ల యాజమాన్యం విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, రాజస్థాన్ చివరి స్థానంలో ఉన్నాయని ఇండియా జస్టిస్ రిపోర్టు వెల్లడించింది. గత సర్వేలో 11వ స్థానాన్ని పొందిన తెలంగాణ, ఈ ఏడాది మూడో స్థానం దక్కించుకుంది. గతంలో ఐదో స్థానంలో ఉన్న ఏపీ ఇప్పుడు రెండో స్థానానికి వచ్చింది. కర్ణాటకకు 1-10 స్కోరులో 6.78 దక్కగా, ఏపీ 6.32, తెలంగాణ 6.15 స్కోర్ దక్కించుకున్నాయి. కింది కోర్టుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ న్యాయమూర్తుల నియమాకాల్లో ఏపీ ముందంజలో ఉంది. ఏపీ పోలీస్ సిబ్బందిలో 21.5 శాతం మహిళలు ఉండగా, జైలు సిబ్బందిలో 8.4 శాతం మంది ఉన్నారు. కింది కోర్టుల్లో 50.9 శాతం మహిళా న్యాయాధికారులు ఉండగా, హైకోర్టులో 16.7 శాతం ఉన్నారు. ఏపీ హైకోర్టులో 20 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులు 22.5శాతం, 10-20 ఏళ్ల మధ్య పెండింగ్‌లో ఉన్న కేసులు 26.7 శాతం ఉన్నాయి.

అవినీతికి కొమ్ముకాసిన అధికారి తొలగింపు

- జగనన్న ఇళ్ల లెవలింగ్ తనిఖీలపై ప్రభుత్వం సీరియస్

అమరావతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులతో గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీ ఇళ్ల లెవలింగ్ పనుల తనిఖీలపై కూటమి ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. లోపభూయిష్టంగా తనిఖీలు చేపట్టి, అక్రమార్కులకు కొమ్ముకాసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నెల్లూరు సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి (ఎస్‌క్యూసీవో) సతీశ్ బాబును పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణతేజ విధుల నుంచి తొలగించారు. ఆయనను సొంత శాఖకు పంపిస్తూ నిర్ణయం తీసుకున్నారు. నెల్లూరు జిల్లాలో ఆయన తనిఖీలు చేపట్టిన కొన్ని పనుల వద్దకు చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి (సీక్యూసీవో) స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఈ క్రమంలో సతీశ్‌బాబు చేపట్టిన తనిఖీలకు, ప్రస్తుత వాస్తవ పరిస్థితులకు తేడా ఉన్నట్టు గుర్తించి ఆయనపై వేటు వేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి మెటీరియల్ నిధులను యథేచ్ఛగా వైసీపీ కార్యకర్తలకు పంచిపెట్టారన్న ఆరోపణలున్నాయి. దీనిపై టీడీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించడం, పత్రికల్లో కూడా కథనాలు రావడంతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి తనిఖీలకు ఆదేశించారు. అయితే తనిఖీల్లో భాగంగా కొంతమంది ఎస్‌క్యూసీవోలు వైసీపీ కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని కమిషనర్ అధికారులను హెచ్చరించారు.

ప్రణాళిక ప్రకారమే పరార్!

(మొదటి పేజీ తరువాయి)



గత ఐదేళ్ల లావాదేవీలకు సంబంధించిన పత్రాలను సీజ్ చేసినట్లు తెలిసింది. మరోవైపు కసిరెడ్డి భార్య దివ్యారెడ్డి, ఆమె సమీప బంధువు తీగల విజయేందర్ రెడ్డి డైరెక్టర్లుగా ఉన్న ఆరేటి ఆసుపత్రిలోనూ అధికారులు సోదాలు చేపట్టి కీలక డాక్యుమెంట్లు సీజ్ చేసినట్లు సమాచారం. నిందితుడి కుమార్తె ఇషానీ పేరుతో నిర్వహిస్తున్న ఈడీ క్రియేషన్స్ లావాదేవీలపైనా కూపీ లాగిన సిట్ మంగళవారం రాత్రి వరకూ సోదాలు నిర్వహిస్తూనే ఉన్నట్లు తెలిసింది. ఇదిలాఉండగా, రాజ్ కసిరెడ్డి కోసం గాలిస్తున్న సిట్ అధికారులకు అతని తల్లిదండ్రుల ఆచూకీ లభించింది. అక్కడకు వెళ్లి నిందితుడి తండ్రి ఉపేందర్ రెడ్డిని ప్రశ్నించారు. అయితే కుమారుడి ఆచూకీ, ఫోన్ నంబరు, వాడే కారు, అతని స్నేహితుల గురించి ఏది అడిగినా 'తెలియదు' అనే సమాధానం ఒక్కటే చెప్పారని, దీంతో విజయవాడలోని సిట్ ఆఫీసులో విచారణకు రావాలని ఆయనకు నోటీసు ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు కసిరెడ్డికి చెందిన రూ.1.33 కోట్లు విలువైన విలాసవంతమైన కారును హైదరాబాద్ శివారులోని అతడి స్నేహితుడికి చెందిన ఫామ్‌హౌస్‌లో సిట్ అధికారులు గుర్తించారు. రాజ్ ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడకు వెళ్లిన అధికారులకు కారు మాత్రమే కనిపించింది. దాన్ని సీజ్ చేసి, కసిరెడ్డి ఆచూకీ కోసం ఏఐ సాంకేతికత సాయంతో గాలిస్తున్నట్లు తెలిసింది.

మద్యం స్కామ్‌లో సాయిరెడ్డికి పిలుపు

(మొదటి పేజీ తరువాయి)



తాడేపల్లి బాస్ చీకటి గుట్టుమట్లు తెలిసిన మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి నోటీసు జారీ చేసింది. ఈ నెల 18న విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలోని సిట్ ఆఫీసుకు ఉదయం 10గంటలకు రావాలని దర్యాప్తు అధికారి పేరుతో ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు. సెక్షన్ 179ప్రకారం ఈ నోటీసు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. అయితే, ఆ రోజు తనకు వేరే పనులు ఉన్నాయని, 17వ తేదీ అయితే రాగలనని సాయిరెడ్డి తెలిపారు. ఇందుకు సిట్ అధికారులు అంగీకరించారు. కాగా, లిక్కర్ స్కామ్‌లో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డేనని గత నెల 12న కాకినాడ పోర్టు కేసులో విజయవాడ సీఐడీ అధికారుల ముందు హాజరైన సమయంలో విజయసాయి రెడ్డి మీడియా ముఖంగా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. జగన్ అక్రమాస్తుల కేసులతోపాటు ఆయన పార్టీ వైసీపీలో నంబర్ టూ గా ఉంటూ ఇటీవలే రాజకీయాలకు దూరమైన సాయిరెడ్డి నాడు (2019) లిక్కర్ వ్యవహారంలో చక్రం తిప్పారు. ఆ తర్వాత రాయల సీమకు చెందిన ఎంపీ మిథున్ రెడ్డి చేతికి అంతా వెళ్లిపోయినట్లు ప్రచారం జరిగింది. ఆయన తర్వాత రాజ్ కసిరెడ్డి ఏడంచెల వ్యవస్థను నడిపించడంలో కీలక పాత్ర పోషించినట్లు వెల్లడైంది. లిక్కర్ బాక్స్‌పై రూ.150 నుంచి రూ.600వరకూ వసూలుచేసి నెలకు రూ.60కోట్లకు తగ్గకుండా చేర్చాల్సిన చోటుకు చేర్చడంలో రాజ్ కసిరెడ్డిది కీలక పాత్రగా గతంలో సీఐడీ తేల్చింది. నాసిరకం మద్యం కొనుగోలు, సరఫరా వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు 20వేల కోట్ల రూపాయల వరకూ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఇప్పటికే ప్రకటించారు. దీంతో పాటు మద్యం కొనుగోలు, లైసెన్స్‌ల మంజూరు, కమీషన్లు, లంచాల రూపంలో నాలుగు వేల కోట్ల రూపాయలు చేతులు మారినట్లు సీఐడీ ఇప్పటికే నిగ్గు తేల్చింది.

'ఆడుదాం కోట్లాట'లో కొత్త కోణాలు!

- ఇంజనీరింగ్ అధికారి సన్నిహితురాలికి 3 ఖాతాలు
- ఆమె తల్లి పేరుతో మరో మూడు బ్యాంకు ఖాతాలు
- మొత్తం ఆరు ఖాతాల్లో కలిపి రూ.9 కోట్లు నిల్వ
- అనంతపురం కాంట్రాక్టర్ నుంచి రూ.2 కోట్లు బదిలీ
- ఫిర్యాదుదారు పేరున వెలది కొత్తపాలెంలో 7.50 ఎకరాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో లోతుగా సాగుతున్న దర్యాప్తు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' టెండర్లలో రూ.కోట్లు దుర్వినియోగమైనట్లు నిర్ధారణ అయింది. ఈ వ్యవహారంలో లోతుకు వెళ్లేకొద్దీ కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కార్యక్రమం టెండర్ల ప్రక్రియలో కీలకంగా వ్యవహరించిన కడప జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ అధికారి సన్నిహితురాలి పేరు మీద కోట్లాది రూపాయల విలువైన భూములతో పాటు ఆమె బ్యాంకు ఖాతాల్లో రూ.కోట్లల్లో నిల్వ ఉండటం వాస్తవమేనని తేలినట్టు సమాచారం. ఈ వ్యవహారంలో ఎన్టీఆర్ జిల్లా నందిగామ పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసు కొట్లాటకు సంబంధించినదే అయినా దాని వెనుక మాత్రం 'ఆడుదాం ఆంధ్రా'లో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన మూలాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 11న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'ఆడుదాంలో కోట్లాట' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. శాప్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అధికారి కుటుంబ సభ్యులు తన ఇంటికి వచ్చి దాడి చేశారని ఆయన సన్నిహితురాలు నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతోపాటు సన్నిహితులంతా కలిసి రూ.12కోట్ల వరకు ఆమెకు బదిలీ చేశామని సదరు అధికారి పోలీసులకు వివరించారు. తొలుత దీన్ని కొట్లాట కేసుగానే పరిగణించిన పోలీసులు.. ఇప్పుడు మొత్తం తీగను లాగే పనిలో ఉన్నారు. ఒక సాధారణ మహిళకు అన్ని కోట్ల రూపాయలు ఎందుకు బదిలీ చేశారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోపక్క ఈ కేసులో పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్న నిఘా వర్గాలు పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. అధికారిపై ఫిర్యాదు చేసిన మహిళకు మూడు బ్యాంకు ఖాతాలు, ఆమె తల్లి పేరు మీద మరో మూడు బ్యాంకు ఖాతాలున్నట్టు గుర్తించారు. మొత్తం ఈ ఆరు ఖాతాల్లో కలిపి రూ.9కోట్ల నిల్వ ఉన్నట్టు నిర్ధారించారు. ఆ డబ్బు ఎక్కడి నుంచి, ఎవరి ఖాతాల ద్వారా చేరిందన్న విషయాలను దర్యాప్తు బృందాలు కూపీ లాగుతున్నాయి. అనంతపురం జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టర్ ఫిర్యాదుదారు ఖాతాకు రూ.2 కోట్లు బదిలీ చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా'లో భారీ మొత్తంలో ఒక టెండర్‌ను ఆ కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. అలాగే అధికారి సన్నిహితురాలి పేరు మీద చందర్లపాడు మండలం వెలది కొత్తపాలెం గ్రామంలో 7.50 ఎకరాలు ఉన్నట్టు తెలిసింది. ఈ భూమి విలువ రూ.23 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. ఈ భూమిని విక్రయించిన వారికి ఆమె ఖాతాల ద్వారానే మొత్తం చెల్లింపులు జరిగాయని దర్యాప్తు బృందాలు నిర్ధారించినట్టు సమాచారం.

వాలుతున్న దళారులు

నందిగామలో నమోదైన కేసును రాజీ చేస్తామని రాజకీయ నేతలు, దళారులు ఫిర్యాదుచేసిన మహిళ చుట్టూ వాలిపోతున్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు ఆమెను సంప్రదిస్తున్నట్టు నిఘా వర్గాలకు సమాచారం అందింది. అధికారితో వివాదం లేకుండా రాజీ చేయడానికి, పోలీసులు మున్ముందు ఎలాంటి దర్యాప్తు చేయకుండా కేసును కోల్డ్ స్టోరేజీలోకి పంపే ఏర్పాట్లు చేస్తానని ఓ దళారీ ఆమె నుంచి రూ.10 లక్షలు తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. విషయం తెలుసుకున్న ఓ పోలీసు అధికారి ఆ దళారీని పిలిపించి ఆమె నుంచి తీసుకున్న డబ్బు తిరిగివ్వాలని హెచ్చరించినట్టు సమాచారం.

విండ్‌షీల్డ్ నిజంగా దెబ్బతిందా?

- కలెక్టరేట్‌కు, ఎస్పీకి చెప్పకుండా హెలికాప్టర్‌ను ఎలా తీసుకెళ్లారు?
- నేడు వచ్చి వివరణ ఇవ్వండి..
- జగన్ పర్యటించిన చాపర్ పైలట్లకు పోలీసుల నోటీసు

పుట్టపర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన సమయంలో, హెలిప్యాడ్ వద్ద జరిగిన ఘటనపై విచారణకు రావాలని ఆయన ప్రయాణించిన హెలికాప్టర్ పైలట్, కో-పైలట్‌కు పోలీసులు నోటీసులు జారీచేశారు. బుధవారం చెన్నేకొత్తపల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయానికి రావాలని రామగిరి సర్కిల్ పోలీసులు ఈ నెల 12నే నోటీసులిచ్చారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని చిప్పర్ ఏవియేషన్ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న పైలట్ కెప్టెన్ అనిల్‌కుమార్, కో-పైలట్ శ్రేయాజ్ జైన్‌కు సీఆర్‌పీసీ 161 కింద నోటీసులు జారీచేశారు. పాపిరెడ్డిపల్లిలో హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ బెంగళూరు నుంచి ఈ నెల 8న వచ్చారు. కుంటిమద్ది గ్రామ సమీపంలో ఆయన హెలికాప్టర్ దిగింది. ఆ సమయంలో బారికేడ్లను తోసేసి.. పోలీసులు అడ్డగిస్తున్నా ఆగకుండా వైసీపీ శ్రేణులు హెలిప్యాడ్ వద్దకు దూసుకెళ్లాయి. ఈ క్రమంలో దాని విండ్‌షీల్డ్ దెబ్బతిందంటూ జగన్‌ను వదిలేసి పైలట్లు బెంగళూరు వెళ్లిపోయారు. దీంతో ఆయన రోడ్డు మార్గాన బెంగళూరు వెళ్లి హైద్రాబాకు తెరలేపారు. ఈ ఘటనను భద్రతా వైఫల్యంగా చిత్రీకరించాలని చూశారు. దీనిని తీవ్రంగా పరిగణించిన పోలీసులు.. వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు విచారణ ప్రారంభించారు. ఆ రోజు ఏం జరిగిందో తేల్చేందుకు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. హెలిప్యాడ్ వద్దకు ముందస్తు ప్రణాళికతోనే వైసీపీ కార్యకర్తలను భారీగా తరలించారని, బారికేడ్లు విరిచి, పోలీసులను పక్కకు నెట్టారని, వారి విధులకు ఆటంకం కలిగించారని తేల్చారు. ఈ క్రమంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, మరికొందరిపై ఐదు రోజుల కిందట కేసు నమోదు చేశారు. తాజాగా హెలికాప్టర్ నడిపిన పైలట్, కో-పైలట్‌కు నోటీసులు జారీ చేశారు. 'హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతిందని, వీవీఐపీని తీసుకెళ్లలేమని కలెక్టరేట్‌కు గానీ, ఎస్పీకి గానీ సమాచారం ఇవ్వకుండా ఏ విధంగా హెలికాప్టర్‌ను టేకాఫ్ చేశారు..? హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతినడం నిజమేనా? మరమ్మతు చేయకుండా గాలిలోకి ఎలా ఎగిరింది? వైసీపీ నేతలు, కార్యకర్తలు హెలికాప్టర్ డోర్ లాగారా? పైలట్ బ్యాగ్‌ను తస్కరించారా?' అన్న అంశాలపై వారిని ప్రశ్నించనున్నట్లు తెలిసింది.

ప్రభావతి బెయిల్ పిటిషన్ విచారణ 24కు వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్, డాక్టర్ నీలం ప్రభావతి దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు మరోసారి వాయిదా వేసింది. గత వైసీపీ హయాంలో అప్పటి ఎంపీగా ఉన్న తనను సీఐడీ కస్టడీలో తీవ్రంగా వేధించారంటూ గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో రఘురామ ఫిర్యాదు చేశారు. ఆ కేసులో జీజీహెచ్ అప్పటి సూపరింటెండెంట్ ప్రభావతి ఏ 5గా ఉన్నారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించగా నిరాశ ఎదురైంది. హైకోర్టు తీర్పును ప్రభావతి జనవరి 22న సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ మంగళవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా అందుబాటులో లేరని, కేసు విచారణను ఈ నెల 21 లేదా 24కు వాయిదా వేయాలని మరో న్యాయవాది కోరారు. ఆ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

వంశీ బెయిల్‌పై విచారణ రేపటికి వాయిదా

విజయవాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైల్లో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాదులు కౌంటర్ పిటిషన్‌ను మంగళవారం దాఖలు చేశారు. తదుపరి విచారణను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది. గతంలో వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. దీంతో రెండోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టులోనూ బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.